


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 194

మంగళవారం 4-10-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


సోనోవిజన్‌లో కొనుగోలుదారుల సందడి

దసరాకు సోనోవిజన్ అందించే డిస్కౌంట్ సేల్‌ను ఈ సంవత్సరం ప్రజలు అనూహ్యంగా ఆదరిస్తున్నారు. ముఖ్యంగా సోనోవిజన్‌లో లభించే స్క్రాచ్ కార్డ్ స్కీమ్ అందరిని ఆకట్టుకుంటుంది. మాములు డిస్కౌంట్‌తో పాటు కార్డ్ స్క్రాచ్ చేయగా మినిమం 6% పైన కొంతమందికి మరింత ఎక్కువ పర్సంటేజ్ డిస్కౌంట్ రావడంపై కొనుగోలుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరియు క్యాష్ బ్యాక్ ఆఫర్స్‌లో 22.5% వరకు అదనంగా డిస్కౌంట్ లభించడం వలన కొనుగోలుదారులకు లాభదాయకంగా ఉంది.



దసరా శుభాకాంక్షలతో...
సోనోవిజన్ దసరా సేల్
Lowest Prices GUARANTEED Best Service
LG Life's Good 190 Cm (75") UHD LED
EMI : 4999/-
SAMSUNG 165 Cm (65") QLED
EMI : 3990/-
LG Life's Good 139 Cm (55") OLED
EMI : 3999/-
SAMSUNG 139 Cm (55") 4K Smart LED
EMI : 2990/-
SONY 138 Cm (55") Ultra HD 4K Anroid
EMI : 2995/-
SONY 108 Cm (43") 4K Anroid
EMI : 1850/-
LG Life's Good 108 Cm (43") 4K Smart LED
EMI : 1999/-
Panasonic 108 Cm (43") Smart LED
EMI : 2414/-
SAMSUNG 80 Cm (32") Smart LED
EMI : 1400/-
LLOYD 108 Cm (43") Smart LED
EMI : 1034/-
TCL 80 Cm (32") Smart LED
EMI : 1000/-
SONY Sound Bar
EMI : 1044/-
iPhone 14 Pro Book Now 4000/- Cash Back 24/0 Scheme Available Selected Bank Cards
iPhone 13 3000/- Cash Back 24/0 Scheme Available Selected Bank Cards
iPhone Watch 12/0 Scheme Available
SAMSUNG S-22 Ultra Mobile, S-22 Ultra Watch 5000/- | 8000/- Cash Back 9/0 Scheme Available
SAMSUNG A-73 5G Ram Expandable 9/0 Scheme Available
vivo V-25 PRO - 5G Y75 - 5G Ram Expandable 10/3 Scheme 15/5 Scheme Available
ONEPLUS 5G Ram Expandable 9/0 Scheme Available
oppo 12 GB Ram, 256 GB Rom. 9/1 Scheme 12/4 Scheme Available
realme 5G Ram Expandable 9/0 Scheme Available Selected Models
hp 12/4 Scheme Available
DELL 15/4 Scheme Available
ASUS 12/4 Scheme Available
Lenovo 12/4 Scheme Available
MacBook 24/0 Scheme Available
LG Life's Good Side by Side 694 Ltrs Refrigerator FREE Small Refrigerator
EMI : 13,540/-
SAMSUNG Side by Side 700 Ltrs Refrigerator
EMI : 7234/-
Whirlpool Frost Free Double Door 260 Ltrs Refrigerator
EMI : 2000/-
VOLTAS beko Direct Cool Single Door 190 Ltrs Refrigerator
EMI : 1050/-
Haier 256 Ltrs BMR Refrigerator
EMI : 2267/-
LLOYD Frost Free Double Door 276 Ltrs Refrigerator
EMI : 1991/-
Haier Side by Side 682 Ltrs Refrigerator
EMI : 5250/-
LLOYD Side by Side 590 Ltrs Refrigerator
EMI : 4792/-
SAMSUNG Frost Free Double Door 253 Ltrs Refrigerator
EMI : 1986/-
Godrej Direct Cool Single Door 190 Ltrs Refrigerator
EMI : 1160/-
LG Life's Good Direct Cool Single Door 215 Ltrs Refrigerator
EMI : 1559/-
Haier Direct Cool Single Door 190 Ltrs Refrigerator
EMI : 1025/-
Chest Freezer 230 Ltrs
EMI:1700/-
LG Life's Good Front Load Washing Machine 10.5 KGS
EMI : 5667/-
SAMSUNG Front Load Washing Machine 9 KGS
EMI : 3325/-
BOSCH Front Load Washing Machine 6 KGS
EMI : 2475/-
IFB WDR Front Load Washing Machine 6 KGS
EMI : 2334/-
LLOYD Front Load Washing Machine 6 KGS
EMI : 1959/-
LG Life's Good Top Load Washing Machine 7.5 KGS
EMI : 1575/-
SAMSUNG Top Load Washing Machine 6.5 KGS
EMI : 1342/-
BOSCH Top Load Washing Machine 6.5 KGS
EMI : 1459/-
IFB Top Load Washing Machine 6.5 KGS
EMI : 1650/-
Whirlpool Top Load Washing Machine 7.0 KGS
EMI : 1792/-
LLOYD Semi Automatic Washing Machine 6.5 KGS
EMI : 767/-
LG Life's Good 10 Years Compressor WARRANTY 5 Years PCB WARRANTY
Starting EMI : 2917/-
SAMSUNG
Starting EMI : 2917/-
VOLTAS
Starting EMI : 2875/-
LLOYD
Starting EMI : 2875/-
HITACHI
Starting EMI : 2917/-
DAIKIN
Starting EMI : 3250/-
Convection Microwave Oven Rs : 10,500/- Onwards
Microwave Oven Rs : 5800/- Onwards
Chimney Rs : 7100/- Onwards
2 Burner Glass Manual Gas Stove Rs : 2700/- Onwards
Water Dispenser Rs : 8200/- Onwards
Water Purifier RO Rs : 12900/- Onwards
Water Geyser Rs : 3300/- Onwards
Wet Grinder Rs : 3200/- Onwards
Rice Cooker Rs : 1700/- Onwards
Mixer Rs : 2500/- Onwards
* T & C Apply
amazon pay Upto 2.5% క్యాష్ బ్యాక్ (1000/- వరకు క్యాష్‌బ్యాక్ క్రెడిట్ కార్డ్ కొనుగోలుదారులకు, షరతులు వర్తిస్తాయి)
BharatPe PhonePe బ్యాంక్ కార్డు పై చెల్లించే సదుపాయం (అదనపు చార్జీలు లేకుండ)
visit : www.sonovision.in మా టీమ్ ఆన్‌లైన్ & ఆఫ్‌లైన్ సేవలను అందించడానికి సిద్ధంగా ఉన్నారు.
LG Life's Good SAMSUNG SONY Haier Whirlpool LLOYD Panasonic Godrej DAIKIN HITACHI VOLTAS Carrier IFB BOSCH BAJAJ
VOLTAS beko TCL V-GUARD Amirthaa Preethi EUREKA FORBES KENT ULTRA Butterfly FABER Crompton KEELINE AOSmith hp vivo oppo iPhone ONEPLUS ONIDA mi morphy richards

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 15
సంచిక: 194
మంగళవారం 4-10-2022
SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి'


మేఘన మెరిసె
తెలుగమ్మాయి అద్భుత ఇన్నింగ్స్.. ఆసియా కప్‌లో మలేసియాపై భారత్ గెలుపు - 12లో


మళ్లీ అమ్మకాలదే పైచేయి
638 పాయింట్ల పతనంతో.. 56,789కు చేరిన సెన్సెక్స్ - 13లో



మోగిన మునుగోడు నగారా
తెలంగాణలోని మునుగోడు అసెంబ్లీ ఉప ఎన్నిక పోలింగ్ నవంబర్ 3వ తేదీన జరగనుంది. 6న ఓట్లను లెక్కిస్తారు.
వివరాలు 10లో


శత్రువుల పాలిట 'ప్రచండ'మే
స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన అధునాతన తేలికపాటి యుద్ధ హెలికాప్టర్ 'ప్రచండ్' భారత వైమానిక దళంలో చేరింది.
వివరాలు 6లో


స్వాంటే పాబోకు వైద్య నోబెల్
మానవ పరిణామ క్రమంపై చేసిన పరిశోధనలకు గాను స్వీడిష్ శాస్త్రవేత్త స్వాంటే పాబోకు వైద్య శాస్త్రంలో నోబెల్ బహుమతి దక్కింది.
వివరాలు 6లో


భారత గగనతలంలో అలజడి
ఇరాన్ నుంచి చైనా వెళ్తున్న విమానానికి వచ్చిన బాంబు బెదిరింపు కొద్దిసేపు భారత గగనతలంలో అలజడి సృష్టించింది.
వివరాలు 6లో

ఏది నిజం?
రామోజీ అర్ధసత్యాల 'పంచాయితీ'
- పంచాయతీలకు కేంద్ర నిధుల విడుదలపై అసత్యాలు
- నిధులను మళ్లించేస్తున్నారంటూ పనిగట్టుకుని దుష్ప్రచారం
- పంచాయతీల కరెంటు బిల్లులు చెల్లించేస్తారేమోనని అనుమానాలు
- ఏం? అవి బకాయిపడ్డ బిల్లుల్ని వాటి నిధులతో చెల్లిస్తే తప్పా?
- చెల్లించకపోతే డిస్కమ్‌లు విద్యుత్తు పంపిణీ చేయగలవా?
- వాటిని నిలబెట్టాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానికి ఉంది కదా?
- బాబు హయాంలో డిస్కమ్‌లు రూ.19,900 కోట్ల అప్పుల్లోకి జారిపోలేదా?
- ఈ ప్రభుత్వం గనక తీర్చకపోయి ఉంటే అవి మనగలిగి ఉండేవా?
- ఆ మాత్రం జవాబుదారీతనం లేకుండా దిగజారుడు రాతలేల?
- ఆర్థిక సంఘం నిధులతో కరెంటు బాకీలు తీర్చాలని కేంద్రమే చెప్పిందిగా?
- ఈ ఏడాది పంచాయతీ బిల్లుల చెల్లింపులోనూ గణనీయంగా మెరుగుదల.. ఈ వాస్తవాలను వదిలిపెట్టి వంకర రాతలెందుకు?

4లో

అలా.. చక్కబడి!
మనబడి నాడు-నేడుతో సర్వాంగ సుందరంగా సర్కారీ స్కూళ్లు

పాఠశాలల నిర్వహణపైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- ఉపాధ్యాయులకు సచివాలయ సిబ్బంది సహకారం
- ప్రతి వారం, ప్రతి నెలా సందర్శించేలా జాబ్ చార్ట్
- హాజరు, చేరికలు, సదుపాయాల బాధ్యత సంక్షేమ, విద్య సహాయకుడికి.. పిల్లల ఆరోగ్యం, భోజన నాణ్యత పరిశీలన పనులు ఏఎన్‌ఎంకు
- చిన్నారుల రక్షణ, ఆడపిల్లల భద్రత అంశాలు మహిళా పోలీస్‌కు
- గైర్హాజరుపై ఇప్పటికే తల్లిదండ్రులకు ఫోన్ మెసేజ్‌లు
- బుజ్జగించి బడికి రప్పించేలా వలంటీర్ల ద్వారా ఏర్పాట్లు
- మండలానికి రెండు ఎంఈవో పోస్టులతో పర్యవేక్షణ పటిష్టం
- ఇక సాఫీగా అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ వ్యవహారాలు

2లో



పక్కాగా తరగతి పురోగతి
- స్కూళ్లలో ఇక క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్
- పాఠశాలల పరీక్షా విధానంలో కీలక మార్పులు
- 1–8 తరగతులకు ఓఎమ్మార్ షీట్లతో పరీక్షలు
- ఫార్మేటివ్, సమ్మేటివ్ స్థానంలో సీబీఏ టెస్ట్
- మైనర్ మీడియం స్కూళ్లలో పాత పద్ధతిలోనే
- 9, 10 తరగతులకూ పాత విధానమే
- నవంబర్ 2 నుంచి పరీక్షలు.. ఏటా 3 సార్లు
- మార్గదర్శకాలతో సర్క్యులర్ జారీ

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో అభ్యసన లోపాలను గుర్తించడం, సరైన బోధనతో సంపూర్ణ సామర్థ్యాలు సంతరించుకోవడమే లక్ష్యంగా పరీక్షల విధానంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక మార్పులు చేపట్టింది. క్లాస్‌రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్ విధానానికి శ్రీకారం చుడుతోంది. ఈ విద్యా సంవత్సరం నుంచే కొత్త విధానం అమలులోకి రానుంది. పాఠశాలల్లో ప్రమాణాలు
మిగతా 2వ పేజీలో ▶

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన. చిత్రంలో ప్రజా ప్రతినిధులు, మేధావులు


వికేంద్రీకరణతోనే అభివృద్ధిలో సమతుల్యత
- రాష్ట్ర భవిష్యత్తును చంద్రబాబు నట్టేట ముంచేశారు
- మేధావుల కమిటీ నివేదికను బుట్టదాఖలు చేశారు
- వేలాది మంది మనోభావాలనూ కాలగర్భంలో కలిపేశారు
- వాళ్ల భూముల విలువ పెంచుకునేందుకే పాదయాత్ర
- ఇన్‌సైడర్ ట్రేడింగ్‌వల్లే వికేంద్రీకరణకు ఆటంకాలు
- వికేంద్రీకరణకు మద్దతుగానే ప్రజలు వైఎస్సార్‌సీపీని గెలిపించారు
- రాజమహేంద్రవరం మేధావుల రౌండ్‌టేబుల్ భేటీలో వక్తలు

> రాష్ట్రంలో మరెవరికీ న్యాయం జరగకుండా తమ వారికి మాత్రమే ప్రయోజనం కల్పించే వ్యూహంతోనే అమరావతిని రాజధాని చేయాలనుకుని రాష్ట్ర భవిష్యత్తును చంద్రబాబు నట్టేట ముంచేశారు. ఈ పరిస్థితుల నుంచి రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు సీఎం జగన్ ప్రయత్నిస్తున్నారు.
> - మంత్రి ధర్మాన ప్రసాదరావు

సాక్షి ప్రతినిధి, రాజమహేంద్రవరం: వికేంద్రీకరణతోనే రాష్ట్రంలో అన్ని ప్రాంతాల మధ్య అభివృద్ధిలో సమతుల్యత సాధ్యమవుతుందని మేధావులు, రాజకీయ నేతలు స్పష్టంచేశారు. విభజన సమయంలో వేలాది మంది మనోభావాలను స్వయంగా అధ్యయనం చేసి ఇచ్చిన నివేదికను చంద్రబాబు కాలగర్భంలో కలిపేసి ప్రస్తుత సమస్యకు కారణమయ్యారని
మిగతా 10వ పేజీలో ▶

అన్ని ఆలయాల్లో కొబ్బరికాయలు కొట్టండి
- విజయదశమి రోజున రాష్ట్రమంతా వికేంద్రీకరణ కోసం ప్రార్థించాలి
- మంత్రి వేణు, మాజీమంత్రి కన్నబాబు పిలుపు

10లో

న్యూస్‌రీల్
దుర్గాదేవిగా బెజవాడ దుర్గమ్మ

దసరా మహోత్సవాల్లో భాగంగా జగజ్జనని దుర్గమ్మ సోమవారం దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. మూలా నక్షత్రం రోజున అమ్మవారిని 3.50 లక్షల మంది దర్శించుకున్నారు.
వివరాలు 5లో ▶

శ్రీవారి సేవలో గవర్నర్

తిరుమల శ్రీవారిని గవర్నర్ విశ్వభూషణ్ కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. వారికి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి స్వాగతం పలికారు.
వివరాలు 5లో ▶

పాఠశాలలకు నేరుగా బియ్యం
అంగన్‌వాడీలు, పాఠశాలలు, హాస్టళ్లకు బియ్యం డోర్ డెలివరీ
- ఈ నెల నుంచి ప్రారంభించాలని పౌరసరఫరాల శాఖ నిర్ణయం
- తద్వారా రేషన్ పంపిణీ వాహనదారులకు అదనపు ఆదాయం
- ఫైన్ క్వాలిటీ బియ్యం సరఫరాకు కసరత్తు.. ఈ సీజన్‌లో రైతుల నుంచి స్థానిక (సన్న) రకాల ధాన్యం కూడా సేకరణ



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతోంది. ఇప్పటికే నాణ్యమైన (సార్టెక్స్) బియ్యాన్ని లబ్ధిదారుల ఇంటి ముంగిటికే వాహనాల ద్వారా (ఎండీయూ) డోర్ డెలివరీ చేస్తుండగా.. ఈ నెల నుంచి ఐసీడీఎస్ (అంగన్‌వాడీలు), మధ్యాహ్న భోజన పథకం కింద పాఠశాలలకు, సంక్షేమ హాస్టళ్లకు కూడా ఫోర్టిఫైడ్ బియ్యాన్ని నేరుగా రవాణా చేయనుంది. తద్వారా ఎండీయూ ఆపరేటర్లకు అదనపు ఆదాయం సమకూర్చనుంది. ఇప్పటివరకు అంగన్‌వాడీలు రేషన్ దుకాణం నుంచి, స్కూళ్లు, హాస్టళ్ల యాజమాన్యాలు ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి వ్యయప్రయాసలతో బియ్యం తెచ్చుకునేవారు. ఒకరోజు ప్రత్యేకంగా బియ్యం కోసం కేటాయించాల్సి వచ్చేది. పైగా రవాణా, ఎగుమతులు, దిగుమతుల విషయంలో ఇబ్బందులు పడేవారు. వీటన్నింటికి పరిష్కారంగా ప్రభుత్వమే రేషన్‌ను డోర్ డెలివరీ చేయాలని నిర్ణయించింది.

ఫైన్ క్వాలిటీ ధాన్యం సేకరణ
రాష్ట్రంలో అంగన్‌వాడీలు, స్కూళ్లు, హాస్టళ్లలో విద్యార్థుల భోజనానికి ఏడాదికి 2.54 లక్షల టన్నుల
మిగతా 3వ పేజీలో ▶

టీచర్ల పదోన్నతుల షెడ్యూల్ విడుదల
సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాల టీచర్ల పదోన్నతుల షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్స్, గ్రేడ్–2 హెడ్‌మాస్టర్ల పదోన్నతుల షెడ్యూల్‌ను పాఠశాల విద్య కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ విడుదల చేశారు. ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్స్ ప్రాథమిక సీనియారిటీ జాబితాను ఈ నెల 7వ తేదీన వెబ్‌సైట్‌లో ఉంచుతారు. వీటిపై ఉన్న అభ్యంతరాలను ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 8వ తేదీలోగా తెలపాల్సి ఉంటుంది. వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులు ఈ నెల 9వ తేదీన పరిశీలించి తుది సీనియారిటీ జాబితాను 10న విడుదల చేస్తారు. గ్రేడ్–2 పోస్టుల ప్రమోషన్లను ఈ నెల 11న, స్కూల్ అసిస్టెంట్లు దానికి సమానమైన ఇతర పోస్టుల పదోన్నతులను ఈ నెల 12, 13 తేదీల్లో విడుదల చేస్తారు.

నీట్ యూజీ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల
2లో

కృష్ణమ్మ జోరు
పరవళ్లు తొక్కుతున్న కృష్ణా, ఉప నదులు తుంగభద్ర, భీమా
- ఆల్మట్టి నుంచి ప్రకాశం బ్యారేజ్ దాకా దిగువకు నీరు విడుదల
- ఒక సీజన్‌లో అన్ని ప్రాజెక్టుల గేట్లు రెండో సారి తెరవడం చరిత్రలో తొలిసారి
- ప్రకాశం బ్యారేజ్ నుంచి 1.07 లక్షల క్యూసెక్కులు కడలిలోకి

సాగర్ నుంచి దిగువకు కృష్ణమ్మ పరవళ్లు


సాక్షి, అమరావతి/శ్రీశైలం ప్రాజెక్ట్/విజయపురి సౌత్: కృష్ణా నది జోరు మీదుంది. పరీవాహక ప్రాంతంలో వర్షాల ప్రభావంతో కృష్ణా నది, ఉప నదులు తుంగభద్ర, భీమా ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో కృష్ణా నది ప్రధాన పాయపై ఉన్న ఆల్మట్టి నుంచి ప్రకాశం బ్యారేజ్ వరకూ అన్ని ప్రాజెక్టుల గేట్లను సోమవారం మరోసారి ఎత్తేసి.. వరద జలాలను దిగువకు విడుదల చేస్తున్నారు. ఒక సీజన్‌లో అన్ని ప్రాజెక్టుల గేట్లను రెండోసారి ఎత్తేయడం కృష్ణా చరిత్రలో ఇదే తొలిసారి. జూరాల నుంచి వస్తున్న కృష్ణా వరదకు తుంగభద్ర డ్యామ్ నుంచి విడుదల చేసిన ప్రవాహం తోడవడంతో సోమవారం రాత్రికి శ్రీశైలం ప్రాజెక్టులోకి 1,47,928 క్యూసెక్కులు చేరుతోంది. జలాశయంలో గరిష్ట స్థాయిలో నీటిని నిల్వ చేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఒక గేటు తెరవగా, వరద పెరగడంతో రాత్రి 9 గంటల సమయంలో రెండో గేటు తెరిచారు. రెండు గేట్ల ద్వారా మొత్తం 1,15,276 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. నాగార్జున సాగర్‌కు సోమవారం సాయంత్రానికి 92,841 క్యూసెక్కులు వస్తుండగా.., నాలుగు గేట్ల ద్వారా వచ్చిన నీటిని వచ్చినట్లు వదిలేస్తున్నారు. పులిచింతల గేట్లను కూడా
మిగతా 3వ పేజీలో ▶

ఇదండీ సంగతి

ఫోన్‌లో ఎవరితో రహస్య చాటింగ్ చేస్తున్నారో చెపుతారా.. లేక ఆర్టీఐతో తెలుసుకోమంటారా!!

క్రిస్ సిటీ నిర్మాణానికి మూడు సంస్థలు పోటీ
సాంకేతిక బిడ్డింగ్‌లో అర్హత సాధించిన ఎన్‌సీసీ, షాపూర్‌జీ పల్లోంజీ, నవయుగ
ఆర్థిక అంశాలు పరిశీలించాక రివర్స్ టెండరింగ్‌లో ఒక సంస్థ ఎంపిక

సాక్షి, అమరావతి: చెన్నై–బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా నెల్లూరు జిల్లా కృష్ణపట్నం వద్ద అభివృద్ధి చేస్తున్న కృష్ణపట్నం ఇండస్ట్రియల్ సిటీ(క్రిస్ సిటీ) నిర్మాణానికి మూడు సంస్థలు పోటీ పడుతున్నాయి. తొలి దశలో సుమారు 2,006 ఎకరాల విస్తీర్ణంలో రూ.1,054.6 కోట్ల విలువైన పనులకు ఏపీఐఐసీ టెండర్లు పిలిచింది. ఈ పనులు చేజిక్కించుకునేందుకు ఎన్‌సీసీ, నవయుగ, షాపూర్‌జీ పల్లోంజీ సంస్థలు వేసిన బిడ్లు సాంకేతికార్హత సాధించాయి. ఈ మధ్యనే జరిగిన ఏపీఐఐసీ బోర్డు సమావేశంలో సాంకేతిక అర్హత సాధించిన ఈ మూడు బిడ్లు ఆమోదం పొందాయి. త్వరలోనే ఆర్థిక అంశాలను పరిశీలించాక రివర్స్ టెండరింగ్ విధానంలో ఒక సంస్థను ఎంపిక చేయనున్నట్టు ఏపీఐఐసీకి చెందిన ఉన్నతాధికారి చెప్పారు. చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా మొత్తం 11,095.9 ఎకరాల్లో క్రిస్ సిటీ నిర్మాణాన్ని చేపడుతుండగా.. అందులో తొలి దశలో 2,000



ఎకరాలను కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ నిక్‌డిక్ట్ నిధులతో అభివృద్ధి చేస్తున్నారు. ఇందుకోసం ఏపీఐఐసీ నిక్‌డిక్ట్ కృష్ణపట్నం ఇండస్ట్రియల్ సిటీ డెవలప్‌మెంట్ లిమిటెడ్ పేరుతో ప్రత్యేక కంపెనీని ఏర్పాటు చేసింది. ఈ మొత్తం ప్రాజెక్టుకు ఇప్పటికే పూర్తిస్థాయి పర్యావరణ అనుమతులూ మంజూరయ్యాయి. ఈ పారిశ్రామికవాడకు కండలేరు నుంచి నీటిని సరఫరా చేస్తారు. తుది బిడ్ ఎంపిక కాగానే త్వరలోనే పనులు ప్రారంభించేలా ఏపీఐఐసీ ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అందుబాటులోకొస్తే 2.96 లక్షల మందికి ఉపాధి దొరుకుతుంది.

గ్రామాలకు స్పెషలిస్ట్ వైద్యులు
పీజీ, స్పెషాలిటీ కోర్సులు చేసిన వైద్యులు గ్రామాల్లో ఏడాది పనిచేయాలి
- కన్వీనర్ కోటా సీట్లలో పీజీ చేసే వైద్య విద్యార్థులకు వర్తింపు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- మూడేళ్ల తర్వాత అందుబాటులోకి 1,849 మంది స్పెషలిస్టులు
- గ్రామీణ ప్రాంతాల్లో తీరనున్న స్పెషలిస్టు వైద్యుల కొరత



సాక్షి, అమరావతి: గ్రామీణ ప్రజలకు స్పెషలిస్ట్ వైద్యుల సేవలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పనతోపాటు పీజీ, సూపర్ స్పెషాలిటీ కోర్సులు పూర్తి చేసిన వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మెడికల్ పీజీ, సూపర్ స్పెషాలిటీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు రూరల్/ప్రభుత్వ సేవలను తప్పనిసరి చేసింది. ప్రభుత్వ కళాశాలల్లో రాష్ట్ర కోటా, ప్రైవేట్ కళాశాలల్లో ఏ–కేటగిరీ సీట్లలో అడ్మిషన్‌లు పొంది కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు ఒక సంవత్సరం తప్పనిసరిగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేయాల్సి ఉంటుంది. ఆ సమయంలో ప్రభుత్వం గౌరవ వేతనం చెల్లిస్తుంది. ఈ మేరకు వైద్య శాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. 2022–23వ విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్‌లు పొందే విద్యార్థులకు ఈ నిబంధన వర్తిస్తుంది. కోర్సులు పూర్తి చేసుకున్న స్పెషలిస్ట్ వైద్యులను తొలి ప్రాధాన్యత కింద ఏపీ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో నియమిస్తారు. ఆ తర్వాత మిగిలిన వారి సేవలను డీఎంఈ పరిధిలో వినియోగించుకుంటారు.

అన్ని కాలేజీలకు ఆదేశాలు
- మెడికల్ పీజీ, సూపర్ స్పెషాలిటీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు ఏడాది పాటు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలు అందించేలా ముందుగానే ఒప్పంద పత్రాలు తీసుకోవాలని అన్ని కాలేజీలకు డీఎంఈ ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం నాన్–సర్వీస్ అభ్యర్థులకు రాష్ట్ర కోటా, ఏ–కేటగిరీ సీట్లలో అడ్మిషన్‌లు ఇచ్చేటప్పుడు కచ్చితంగా బాండ్ తీసుకోవాలని తెలిపారు.

ముందుగానే ఒప్పందం
నాన్ సర్వీస్ అభ్యర్థులు కోర్సు అనంతరం సంవత్సరం పాటు రూరల్/ప్రభుత్వ సేవలు అందించేలా ముందుగానే ఒప్పంద పత్రం తీసుకుంటారు. ఒప్పందాన్ని ఉల్లంఘించి
మిగతా 3వ పేజీలో ▶

క్లుప్తంగా

ప్రజలకు సీఎం జగన్ దసరా శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: ప్రజలందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దసరా శుభాకాంక్షలు తెలిపారు. దుర్గాష్టమి, మహర్నవమి, విజయదశమిని పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల ప్రజలకు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారికి సీఎం జగన్ సోమవారం శుభాకాంక్షలు తెలియజేశారు. లోక కంటకుడైన మహిషాసురుడిని జగన్మాత సంహరించినందుకు.. దుష్ట శక్తులపై దైవ శక్తుల విజయానికి ప్రతీకగా ఈ పండుగ జరుపుకొంటున్నామని సీఎం జగన్ అన్నారు. జగన్మాత ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సుఖ శాంతులతో, సిరి సంపదలతో తులతూగాలని, ప్రతి ఒక్క కుటుంబానికీ విజయాలు కలిగేలా దుర్గామాత దీవెనలు, ఆశీస్సులు ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

వారిని 62 ఏళ్ల వరకు కొనసాగించండి

ఏఎన్‌యూ అధికారులకు హైకోర్టు ఆదేశం



సాక్షి, అమరావతి: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ)లో పని చేస్తున్న బోధనేతర సిబ్బందిని 62 ఏళ్ల వయసు వరకు కొనసాగించాలని విశ్వవిద్యాలయ అధికారులను హైకోర్టు ఆదేశించింది. వారి పదవీ విరమణ వయసును 60 ఏళ్లకే పరిమితం చేయడం తగదంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కుంభజడల మన్మథరావు ఇటీవల తీర్పు చెప్పారు. ఉద్యోగుల పదవీ విరమణ వయసును రాష్ట్ర ప్రభుత్వం 62 ఏళ్లకు పెంచినా యూనివర్సిటీ రిజిస్ట్రార్ మాత్రం తమ పదవీ విరమణ వయసును 60 ఏళ్లకు కుదిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ డిప్యూటీ రిజిస్ట్రార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, సీనియర్ అసిస్టెంట్, లైబ్రరీ అసిస్టెంట్ తదితర బోధనేతర సిబ్బంది హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ల న్యాయవాది ఎస్.లక్ష్మీ నారాయణరెడ్డి వాదనలు వినిపిస్తూ.. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పిటిషనర్ల పదవీ విరమణ వయసు 62 ఏళ్లుగా యూనివర్సిటీ వీసీ నిర్ణయించారని చెప్పారు. దీనికి విరుద్ధంగా రిజిస్ట్రార్ పిటిషనర్ల పదవీ విరమణ వయసును 60 ఏళ్లకు కుదించారని తెలిపారు. ఇలా చేసే అధికారం రిజిస్ట్రార్‌కు లేదన్నారు. పదవీ విరమణ వయసు కుదింపుపై నిర్ణయాన్ని వర్సిటీ పాలకమండలి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. బోధనేతర సిబ్బంది పదవీ విరమణ వయసును 60 ఏళ్లకు కుదించడాన్ని తప్పుపట్టారు. వారిని 62 ఏళ్ల వరకు సర్వీసులో కొనసాగించాలని యూనివర్సిటీ అధికారులను ఆదేశించారు.

నీట్ యూజీ-2022 కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

11న ఆల్ ఇండియా కోటా తొలి దశ కౌన్సెలింగ్



సాక్షి, అమరావతి: నీట్ యూజీ-2022 కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) సోమవారం విడుదల చేసింది. ఆల్ ఇండియా కోటా తొలి దశ కౌన్సెలింగ్ ఈ నెల 11న ప్రారంభమై 20వ తేదీ వరకు ఉంటుంది. మరో వైపు డీమ్డ్, సెంట్రల్ ఇనిస్టిట్యూట్స్‌లో 10వ తేదీ నుంచి 20 మధ్య తొలి దశ కౌన్సెలింగ్ ఉండనుంది. రాష్ట్రాల్లో తొలి దశ కౌన్సెలింగ్ 17వ తేదీ నుంచి 28 వరకు ఉంటుంది. ఆల్ ఇండియా, డీమ్డ్, సెంట్రల్ ఇనిస్టిట్యూట్స్ రెండో దశ కౌన్సెలింగ్ నవంబర్ 2-10, స్టేట్ కౌన్సెలింగ్ 7-18వ తేదీ మధ్య ఉండనుంది. మాప్-అప్ రౌండ్ ఆల్ ఇండియా, డీమ్డ్, సెంట్రల్ ఇనిస్టిట్యూట్స్ నవంబర్ 23 నుంచి డిసెంబర్ ఒకటో తేదీ మధ్య, రాష్ట్రాల్లో డిసెంబర్ 6 నుంచి 12వ తేదీ మధ్య నిర్వహిస్తారు. నవంబర్ 15 నుంచి తరగతులు ప్రారంభిస్తారు.

అలా.. చక్కబడి!

నాడు - నేడుతో సర్వాంగ సుందరంగా సర్కారీ స్కూళ్లు



సాక్షి, అమరావతి: విద్యా సంస్కరణల్లో భాగంగా రూ.16 వేల కోట్లకు పైగా వెచ్చించి ప్రభుత్వ విద్యా సంస్థలను నాడు - నేడు ద్వారా కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఇక సమర్థంగా నిర్వహణపై దృష్టి సారించింది. అభివృద్ధి పనులు చిరకాలం మన్నికతో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు మౌలిక లక్ష్యమైన విద్యా ప్రమాణాలు, అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేలా చర్యలు చేపడుతోంది. అస్తవ్యస్తంగా, దిశానిర్దేశం లేకుండా ఉన్న అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ వ్యవహారాలను గాడిలో పెడుతోంది. ఇవి రెండూ ప్రత్యేక పర్యవేక్షణతో ముందుకు సాగేలా ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటివరకు ఇవన్నీ పాఠశాల విద్యాశాఖ అధికారులు, టీచర్లతో సాగగా ఇప్పుడు ఇతర శాఖలకూ బాధ్యతలు అప్పగిస్తోంది. మండల స్థాయిలో అకడమిక్, అడ్మినిస్ట్రేటివ్ వ్యవహారాలను వేర్వేరుగా పర్యవేక్షించేందుకు ఇద్దరు చొప్పున ఎంఈవోలను ప్రభుత్వం నియమిస్తోంది. ఇందుకోసం అదనంగా 692 ఎంఈవో పోస్టులను ఇటీవల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేసిన విషయం తెలిసిందే.

టీచర్లకు సాయంగా సచివాలయ సిబ్బంది

ఇప్పటివరకు పాఠశాలలకు సంబంధించి విద్యా వ్యవహారాలు, పాలనా వ్యవహారాలను విద్యాశాఖకు చెందిన టీచర్లు, ఎంఈవోలు, ఇతర అధికారులే పర్యవేక్షిస్తున్నారు. ఒకపక్క విద్యా వ్యవహారాలు, మరోపక్క అడ్మినిస్ట్రేటివ్ అంశాల బాధ్యతల వల్ల ఒత్తిడికి గురవుతున్నారు. మండల విద్యాధికారుల పోస్టులు న్యాయ వివాదాలతో దశాబ్ద కాలంగా భర్తీ కాకపోవడంతో మండల స్థాయిలో పర్యవేక్షణ కొరవడింది. ప్రభుత్వం విద్యారంగంపై రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నప్పటికీ లక్ష సాధనలో కీలకమైన క్షేత్రస్థాయి పర్యవేక్షణ కరవైంది. ఈ అంశాలను క్షుణ్నంగా పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం స్కూళ్లలో అభివృద్ధి పనులతో పాటు పిల్లల ఆరోగ్య సంరక్షణ, హాజరు, చదువులపై దృష్టి పెట్టే బాధ్యతను సచివాలయాల సిబ్బందికి అప్పగించాలని నిర్ణయించింది. తమ పరిధిలోని పాఠశాలల టీచర్లకు విధి నిర్వహణలో వీరు సహకారం అందించనున్నారు.

ఎవరెవరికి ఏ బాధ్యతలు..?

ఉద్యోగి	స్కూళ్లలో పర్యవేక్షణాంశాలు	ఎప్పుడు?
సంక్షేమ, విద్యా సహాయకుడు	విద్యార్థి, టీచర్ అటెండెన్సు/ఆబ్సెంట్, ఎన్‌రోల్‌మెంటు/రిటెన్షన్, మధ్యాహ్న భోజనం.. స్కూళ్లలో నదుపాయాలు	వారంలో ఒకరోజు
ఏఎన్‌ఎం	విద్యార్థుల హెల్త్ చెకప్.. ఆరోగ్య స్థితి పరిశీలన, మధ్యాహ్న భోజనం నాణ్యత, వ్యాక్సినేషన్	నెలలో ఒకరోజు
మహిళా పోలీసు	పిల్లల భద్రత, బాలల హక్కులు, విద్యార్థినుల భద్రత, వేధింపులు, వ్యసనాలపై దృష్టి	వారంలో ఒకరోజు

క్రమ పద్ధతిలో నిరంతరం..

గ్రామ, వార్డు సచివాలయాల్లోని విద్య, సంక్షేమ సహాయకుడు, ఏఎన్‌ఎం, మహిళా పోలీసులకు స్కూళ్ల పర్యవేక్షణ బాధ్యతలను ప్రభుత్వం అప్పగిస్తోంది. ఎవరెవరు ఏ పనులు చేయాలి? ఎప్పుడెప్పుడు ఆయా స్కూళ్లను పర్యవేక్షించాలో జాబ్ చార్టు రూపొందించింది. స్కూళ్ల పర్యవేక్షణ ఒక క్రమపద్ధతిలో నిరంతర ప్రక్రియగా కొనసాగేలా దీన్ని సిద్ధం చేశారు.

కమాండ్ కంట్రోల్‌కు సమాచారం..

సచివాలయాల సిబ్బంది స్కూళ్లను పరిశీలించిన అనంతరం ఆయా అంశాలను ఆన్‌లైన్‌లో నిర్ణీత లాగిన్ ద్వారా వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. వాటికి సంబంధించిన ఫొటోలను అప్‌లోడ్ చేస్తారు. వారిచ్చే సమాచారం ప్రకారం ఏమైనా సమస్యలుంటే సంబంధిత అధికారి వాటిని పరిష్కరిస్తారు. అంశాల తీవ్రతను బట్టి పరిష్కారానికి సమయాన్ని నిర్దేశిస్తారు. దీనిపై పైస్థాయి అధికారులు పునఃపరిశీలన చేస్తారు. ఇదంతా ఎడ్యుకేషన్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు వెళ్తుంది. వీటితో పాటు ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబర్ (14417), స్పందన ద్వారా అందే ఫిర్యాదులను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తారు.

హాజరుపై సంక్షిప్త సందేశాలు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల గైర్హాజరును నివారించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. స్కూలుకు రాని విద్యార్థుల గురించి తల్లిదండ్రులు, ఆయా తరగతుల టీచర్ల ఫోన్లకు కార్పొరేట్ స్కూళ్ల తరహాలో సంక్షిప్త సందేశాన్ని పాఠశాల విద్యాశాఖ అందిస్తోంది. వరుసగా మూడు రోజుల పాటు స్కూలుకు రాని విద్యార్థి సమాచారాన్ని వలంటీర్ల ఫోన్‌కూ సంక్షిప్త సందేశాల ద్వారా చేరవేస్తున్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలలకు వచ్చేలా ఈ చర్యలు దోహదం చేస్తున్నాయి.

పక్కాగా తరగతి పురోగతి

▶ మొదటి పేజీ తరువాయి

మెరుగుపర్చేందుకు ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహకారంతో అమలు చేస్తున్న 'సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్' (సాల్ట్) కార్యక్రమంలో భాగంగా తరగతి గది ఆధారిత మూల్యాంకన విధానాన్ని తెస్తున్నారు. 1 నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులకు సీబీఏ విధానంలో పరీక్షలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఏపీ ఎస్సీఈఆర్టీ) డైరెక్టర్ డాక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు సీబీఏ మార్గదర్శకాలు, షెడ్యూల్‌తో సోమవారం సర్క్యులర్ జారీ అయింది. ఈ పరీక్షలు పూర్తిగా ఓఎమ్మార్ (ఆప్టికల్ మార్కు రికగ్నిషన్) విధానంలో ఏడాదికి మూడు సార్లు జరుగుతాయి. తొలివిడత పరీక్షలు నవంబర్ 2 నుంచి ప్రారంభమవుతాయి.

ఈఐతో ఎస్సీఈఆర్టీ ఎంవోయూ

నూతన విధానంలో పరీక్షా పత్రం రూపకల్పన, మూల్యాంకనం కోసం 'ఎడ్యుకేషన్ ఇనిషియేటివ్స్' (ఈఐ)తో ఎస్సీఈఆర్టీ ఎంవోయూ కుదుర్చుకుంది. దీని ప్రకారం 1 - 8 తరగతుల విద్యార్థులకు ఫస్ట్ లాంగ్వేజ్ (తెలుగు), సెకండ్ లాంగ్వేజ్ (హిందీ), థర్డ్ లాంగ్వేజ్ (ఇంగ్లీషు), ఈవీఎస్, గణితం, సైన్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్టుల్లో సీబీఏ పరీక్షలు నిర్వహిస్తారు. ఫిజికల్, బయోలాజికల్ సైన్స్‌కి కలిపి ఒకే పేపర్ ఉంటుంది. ప్రశ్నపత్రాలు బైలింగ్యువల్ (ద్విభాషా) పద్ధతిలో రూపొందిస్తారు. పక్కాగా మూల్యాంకనం ద్వారా విద్యార్థుల సామర్థ్యాలను కచ్చితంగా గుర్తించి లోటుపాట్లను సరిదిద్దడంపై ఈఐ సంస్థ నివేదిక అందిస్తుంది. బోధనా విధానాలపై ఎస్సీఈఆర్టీకి సిఫార్సు చేస్తుంది. వాటి ఆధారంగా ఉపాధ్యాయులు తగిన చర్యలు తీసుకుంటారు.



ఫార్మేటివ్, సమ్మేటివ్ స్థానంలో

ప్రస్తుతం నిర్వహిస్తున్న ఫార్మేటివ్, సమ్మేటివ్ పరీక్షల స్థానంలో సీబీఏ పరీక్షలను నిర్వహిస్తారు. 1-8 తరగతులకు సంబంధించిన 1, 3 ఫార్మేటివ్, సమ్మేటివ్ 2 బదులు సీబీఏ పరీక్షలు ఉంటాయి. ఫార్మేటివ్ 2, 4, సమ్మేటివ్ 1 పరీక్షలను యధాతథంగా పాత విధానంలోనే నిర్వహిస్తారు. విద్యార్థుల సామర్థ్యాలను సంపూర్ణంగా అంచనా వేసేలా ఈఐ సంస్థ అంతర్జాతీయ ప్రమాణాలను అనుసరించి ప్రశ్న పత్రాన్ని రూపొందిస్తుంది. ఓఎమ్మార్ విధానంలో తొలిసారి నిర్వహిస్తున్నందున టీచర్లకు వెబినార్ల ద్వారా సూచనలు అందించనున్నారు.

9, 10 పాత విధానంలోనే

గతంలో మాదిరిగానే 9, 10 తరగతుల విద్యార్థులకు అంతర్గత పరీక్షలను నాలుగు ఫార్మేటివ్, రెండు సమ్మేటివ్‌లతో పాత విధానంలో నిర్వహిస్తారు. టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో పేపర్ల సంఖ్యను ప్రభుత్వం ఆరింటికి కుదించడంతోపాటు అంతర్గత మార్కులతో సంబంధం లేకుండా ప్రతి పేపర్‌ను 100 మార్కులకు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. కన్నడ, తమిళం, ఒడియా తదితర మైనర్ మీడియం స్కూళ్లలో మాత్రం 1-8 తరగతుల విద్యార్థులకు సీబీఏ తరహాలో కాకుండా పాత విధానంలోనే ఫార్మేటివ్, సమ్మేటివ్ పరీక్షలు ఉంటాయి.

ప్రైవేట్ స్కూళ్లకు ఓఎమ్మార్ పంపిణీ ఉండదు

సీబీఏ పరీక్షల ఓఎమ్మార్ పత్రాలను ప్రభుత్వ స్కూళ్లలో చదివే విద్యార్థులకు మాత్రమే పంపిణీ చేస్తారు. ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు డీసీఈబీ (డిస్ట్రిక్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు) నుంచి ప్రశ్నపత్రాలను అందుకుని పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. ఈఐ సంస్థ విడుదల చేసే 'కీ' ఆధారంగా ప్రైవేట్ స్కూళ్లలో మూల్యాంకనం చేసి మార్కులను పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి.

సీబీఏ పరీక్షల షెడ్యూల్

1 నుంచి 5వ తరగతి వరకు

తేదీ	పరీక్ష
నవంబర్ 2	తెలుగు, మేథమెటిక్స్
నవంబర్ 3	ఇంగ్లీష్, ఈవీఎస్
నవంబర్ 4	ఓఎస్సెస్సీ
6, 7, 8వ తరగతులకు	
నవంబర్ 2	తెలుగు, మేథమెటిక్స్
నవంబర్ 3	హిందీ, జనరల్ సైన్సు
నవంబర్ 4	ఇంగ్లీష్, సోషల్ స్టడీస్
నవంబర్ 5	ఓఎస్సెస్సీ-1, ఓఎస్సెస్సీ-2
9, 10 తరగతులకు ఫార్మేటివ్ పరీక్షలు	
నవంబర్ 2	తెలుగు, మేథమెటిక్స్
నవంబర్ 3	హిందీ, సైన్స్
నవంబర్ 4	ఇంగ్లీష్, సోషల్
నవంబర్ 5	ఓఎస్సెస్సీ-1, ఓఎస్సెస్సీ-2

ఆ 84 మందికీ జీతాలు!

తెలంగాణ ఆప్షన్ ఎంచుకుని పోస్టింగ్‌కు నోచుకోని ఉద్యోగులకు జీతాలు చెల్లించేందుకు అంగీకారం



సాక్షి, అమరావతి: రాష్ట్ర విభజన నేపథ్యంలో తెలంగాణలో ఉంటామని చెప్పడం విద్యుత్ ఉద్యోగుల పాలిట శాపంగా మారింది. ఏపీ నుంచి తెలంగాణకు వెళ్లిన ఉద్యోగుల్లో 84 మంది ఇప్పటి వరకూ పోస్టింగ్‌కు నోచుకోలేదు. 29 నెలలుగా కనీస వేతనాలు కూడా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి చెందిన 655 మంది విద్యుత్ సంస్థల ఉద్యోగులు తెలంగాణలో పనిచేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేయడంతో వారిని ఆ రాష్ట్రానికి కేటాయించారు. వీరిలో 571 మందినే తెలంగాణ విద్యుత్ సంస్థలు తీసుకున్నాయి. తమ సంస్థల్లో ఇప్పటికే ఉద్యోగులు ఎక్కువగా ఉన్నందున మిగిలిన 84 మందిని చేర్చుకోవడం కుదరదని చెప్పాయి. దీంతో వారంతా సుప్రీంకోర్టులో పిటిషన్‌ను దాఖలు చేశారు. వీరిలో ఇద్దరు ఉద్యోగులు ఇప్పటికే కరోనాతో కన్నుమూశారు. జీతాలు అందక కష్టాల్లో ఉన్న తమను ఆదుకోవాలని ఏపీ విద్యుత్ సంస్థలను వారు అభ్యర్థించారు. దీంతో స్పందించిన ఇంజనీరింగ్ సిబ్బంది సెప్టెంబర్ నెలలో ఒక రోజు మూలవేతనాన్ని ఇచ్చేందుకు అంగీకరించారు. ఇంజనీరింగ్ సిబ్బంది జీతభత్యాల నుంచి ఒక రోజు మూల వేతనాన్ని తగ్గించి రాష్ట్ర ఇంధన శాఖ నేరుగా అందజేసేందుకు అంతా సిద్ధం చేసింది. దాదాపు రెండున్నర కోట్ల రూపాయల వరకూ వసూలైంది. అయితే సెప్టెంబర్ మూడో వారంలో ఏపీ ఇంజనీర్లు తీసుకున్న ఈ నిర్ణయం గురించి తెలుసుకున్న టీఎస్ ట్రాన్స్‌కో అధికారులు.. నాలుగో వారంలో దీనిపై చర్చించారు. సుప్రీంలో ఉద్యోగుల పిటిషన్ విచారణకు వచ్చినపుడు ఏపీ ఉద్యోగుల జీతాల నుంచి ఇచ్చిన సాయం ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉండటంతో తామే జీతాలిస్తే మంచిదని భావించారు. ఫలితంగా 84 మందికి జీతాలిచ్చేందుకు చర్యలు చేపట్టారు. దీంతో రెండున్నరేళ్లుగా ఇబ్బందులు పడుతున్న వారికి కాస్త ఊరట లభించినట్టయింది. కాగా, తెలంగాణ ట్రాన్స్‌కో జీతాలిస్తామని చెప్పడంతో తాము ఇవ్వాలనుకున్న ఒక రోజు వేతనంపై యూనియన్ నిబంధనల మేరకు చర్చించి అంతిమ నిర్ణయం తీసుకుంటామని ఏపీ స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డ్ ఇంజనీర్స్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ ప్రతాపరెడ్డి చెప్పారు.

'లింకు' లేకే ఎక్కువ మ్యుటేషన్ల తిరస్కరణ

- 3 నెలల్లో మొత్తం 1.95 లక్షల మ్యుటేషన్ దరఖాస్తులకు నో
- వీటిలో లింకు డాక్యుమెంట్లు సరిగా లేనివి 93 వేలకుపైనే
- శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఎక్కువ దరఖాస్తుల తిరస్కరణ
- రెవెన్యూ శాఖ విశ్లేషణ

సాక్షి, అమరావతి: రెవెన్యూ కార్యాలయాలకు అందుతున్న మ్యుటేషన్ దరఖాస్తుల్లో ఎక్కువశాతం లింకు డాక్యుమెంట్లు సక్రమంగా లేకపోవడం వల్ల తిరస్కరణకు గురవుతున్నట్లు తేలింది. మ్యుటేషన్ దరఖాస్తులు ఎక్కువగా పెండింగ్‌లో ఉండడం, తిరస్కారానికి గురవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ప్రత్యేకంగా దృష్టిసారించింది. నిరంతరం సమీక్షిస్తూ సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో నెలవారీ సమీక్షల్లో వీటికి సంబంధించి పలు కీలక అంశాలను గుర్తించారు.

అత్యధికంగా శ్రీకాకుళం జిల్లాలో..

రాష్ట్రవ్యాప్తంగా గత మూడు నెలల్లో 1.95 లక్షల మ్యుటేషన్ దరఖాస్తులను తిరస్కరించారు. వీటిలో అవసరమైన లింకు డాక్యుమెంట్లు లేనందువల్ల తిరస్కరించినవే 93 వేలకుపైగా ఉన్నాయి. కుటుంబ వివాదాల కారణంగా 5,700 దరఖాస్తులు, రికార్డుల్లో ఉన్నదాని కంటే ఎక్కువ భూమి చూపిస్తుండడం వల్ల 4 వేలకుపైగా దరఖాస్తులు, సాదాబైనామా భూములు కావడం వల్ల 2,400 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి.

కొన్ని దరఖాస్తులకు సంబంధించిన భూములు అసైన్డ్, ప్రభుత్వ, చుక్కల భూముల పరిధిలో ఉండడంతో తిరస్కరించారు. మరోవైపు క్షేత్రస్థాయిలో అందిన దరఖాస్తులపై అభ్యంతరాల స్వీకరణకు జారీచేయాల్సిన ఫారం-8 నోటిఫికేషన్‌కు ముందే చాలా దరఖాస్తులను తిరస్కరించినట్లు తేలింది. కిందిస్థాయి అధికారుల నిర్లక్ష్యం, పని ఒత్తిడి వంటి కారణాల వల్ల వాటిని తిరస్కరిస్తున్నట్లు గుర్తించారు. ఇలాంటి కేసులను తీవ్రంగా పరిగణించి వివరణకు ఆదేశిస్తున్నారు. అత్యధికంగా శ్రీకాకుళం జిల్లాలో 35 వేలకుపైగా దరఖాస్తులను తిరస్కరించారు. ఆ తర్వాత విజయనగరం జిల్లాలో 30 వేలకుపైగా దరఖాస్తులకు నో చెప్పారు. అనకాపల్లి జిల్లాలో 18 వేలు, ప్రకాశం జిల్లాలో 13 వేలు, నెల్లూరు జిల్లాలో 11 వేలు, అన్నమయ్య జిల్లాలో 9 వేలు, తిరుపతి జిల్లాలో 7,300, చిత్తూరు జిల్లాలో 6,600 దరఖాస్తులను తిరస్కరించారు. తూర్పు గోదావరి జిల్లాలో అతి తక్కువగా 1,145 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి జిల్లాల్లో తిరస్కరణకు గురైన దరఖాస్తులు రెండు వేల కంటే తక్కువగా ఉన్నాయి.

ఆ అధికారం ఆర్డీవోలకే

సరైన కారణాలు లేకుండా మ్యుటేషన్ దరఖాస్తులను తిరస్కరించరాదని రెవెన్యూ యంత్రాంగానికి ఇప్పటికే భూ పరిపాలన ప్రధాన కమిషనర్ ఆదేశాలిచ్చారు. కిందిస్థాయి అధికారులు ఎడాపెడా తిరస్కరిస్తుండటంతో ఆ అధికారాన్ని ఆర్డీవోలకు అప్పగించారు. దరఖాస్తును తహశీల్దార్ నేరుగా తిరస్కరించే అధికారం ఇప్పుడు లేదు. తిరస్కరించాలంటే ఆర్డీవోకు సిఫారసు చేయాల్సి ఉంటుంది. ఆర్డీవో దీనిపై పరిశీలించి నిర్ణయం తీసుకుంటారు.

మ్యుటేషన్ అంటే..

ఏదైనా ఆస్తిపై యాజమాన్య హక్కును ఒకరి నుంచి మరొకరికి బదిలీచేసి రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయడాన్ని మ్యుటేషన్ అంటారు. తల్లిదండ్రుల నుంచి వారసులకు ఆస్తి సంక్రమించినప్పుడు, ఒకరి ఆస్తిని మరొకరు కొనుగోలు చేసినప్పుడు యాజమాన్య హక్కుల్లో మార్పుచేర్పులు చేపడతారు. వీటిపై యాజమాన్య హక్కు కోసం మ్యుటేషన్‌కు దరఖాస్తు చేసుకుంటారు.

డాక్యుమెంట్ రైటర్లు, స్టాంప్ విక్రేతలకు ఊరట

కమిషనర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్ రద్దుచేస్తూ హైకోర్టు తీర్పు



సాక్షి, అమరావతి: డాక్యుమెంట్ రైటర్లు, స్టాంపు విక్రయదారులకు హైకోర్టు ఊరటనిచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోకి డాక్యుమెంట్ రైటర్లు, స్టాంపు విక్రయదారులకు ప్రవేశాన్ని నిలిపేస్తూ స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను హైకోర్టు రద్దుచేసింది. ఎవరో కొంతమంది డాక్యుమెంట్ రైటర్లు అక్రమాలకు పాల్పడుతున్నారన్న కారణంతో డాక్యుమెంట్ రైటర్లందరికీ ప్రవేశాన్ని నిరాకరించడం ఎంతమాత్రం సరికాదంది. ఇలా మూకుమ్మడిగా ప్రవేశాలను నిలిపేయడం వారికి రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను హరించడమే అవుతుందని పేర్కొంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ దొనడి రమేశ్ ఇటీవల తీర్పు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోకి డాక్యుమెంట్ రైటర్లు, స్టాంపు విక్రయదారులకు ప్రవేశాన్ని నిలిపేస్తూ స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ గత డిసెంబర్ 17న ప్రొసీడింగ్స్ జారీ చేశారు. ఈ ప్రొసీడింగ్స్‌ను సవాలు చేస్తూ ఏపీ డాక్యుమెంట్ రైటర్ల సంక్షేమసంఘం అధ్యక్షుడు పెనుమాక వెంకటసుబ్బారావు, మరికొందరు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై జస్టిస్ రమేశ్ విచారించారు. పిటిషనర్ల న్యాయవాది ఎస్.శివారెడ్డి వాదనలు వినిపిస్తూ.. 1993లోను ఇలాంటి ఉత్తర్వులే ఇచ్చారని తెలిపారు. దీనిపై అప్పట్లో దాఖలైన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు అధికారుల తీరును తప్పుబట్టిందని చెప్పారు. దీనిపై ప్రభుత్వం చేసిన అప్పీలును విచారించిన ధర్మాసనం.. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సమర్థిస్తూ అధికారుల తీరును తప్పుబట్టిందన్నారు. అయినా కమిషనర్ ఇప్పుడు మళ్లీ డాక్యుమెంట్ రైటర్లు, స్టాంప్ విక్రయదారులకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రవేశాలను నిలిపేస్తూ ప్రొసీడింగ్స్ ఇచ్చారని తెలిపారు. దీనిపై స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కౌంటర్ దాఖలు చేసింది. ఈ కౌంటర్‌ను పరిశీలించిన న్యాయమూర్తి.. ఇందులో పలు అంశాల గురించి ప్రస్తావించినప్పటికీ, పిటిషనర్లు లేవనెత్తిన న్యాయపరమైన అంశాలకు సమాధానం చెప్పలేదన్నారు. గతంలో ఇదే అంశంపై ధర్మాసనం ఇచ్చిన తీర్పును పరిగణనలోకి తీసుకుంటూ.. స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను రద్దుచేస్తూ తీర్పు చెప్పారు.

గడప గడపనా ఉత్సాహం

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం సోమవారం ఉత్సాహభరితంగా సాగింది. తమ ఇంటికి వచ్చిన ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులకు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నాయకులు వివరించారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా.. అని అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి అక్కడికక్కడే చర్యలు చేపట్టారు. - సాక్షి, నెట్‌వర్క్



ప్రకాశం జిల్లా మార్కాపురం గాంధీబజారులో మహిళకు సంక్షేమ పథకాల గురించి వివరించి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



పల్నాడు జిల్లా పసుమర్రులో మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న మంత్రి విడదల రజిని



అనంతపురం జిల్లా యాడికిలో సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



కాకినాడ జిల్లా నర్సింగపురంలో స్థానికులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు



కర్నూలు జిల్లా వెల్దుర్తిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



పార్వతీపురం మన్యం జిల్లా అడ్డాపుశీలలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

గిరిజనోద్ధరణకు నిధులివ్వండి

కేంద్రాన్ని కోరిన ఉపముఖ్యమంత్రి రాజన్నదొర



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన అభివృద్ధి, సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం ఉదారంగా ఆర్థిక ఊతమిస్తే మరిన్ని అద్భుత ఫలితాలు సాధించగలమని ఏపీ గిరిజన సంక్షేమ శాఖ కేంద్ర గిరిజన సంక్షేమ శాఖను కోరింది. ఇదే విషయమై కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అర్జున్‌ముండాకు వినతిపత్రాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ఇటీవల అందజేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను రాజన్నదొర సోమవారం 'సాక్షి'కి వెల్లడించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నాయకత్వంలో చేపట్టిన గిరిజనోద్ధరణ కార్యక్రమాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాలతో గిరిజన ప్రజల అభివృద్ధి, కోవిడ్ కష్టకాలంలోనూ సంతృప్త స్థాయిలో సంక్షేమ పథకాలు అందించిన తీరు వివరించినట్లు పేర్కొన్నారు. ఇటువంటి అనేక అంశాలను దృష్టిలో పెట్టుకుని ఏపీ పట్ల కేంద్రం మరింత ఉదారంగా వ్యవహరించాలని కోరారు. దేశ వ్యాప్తంగా గిరిజనుల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల విషయంలో ఆయా శాఖల నిధులు, పనులు సమన్వయం చేసేలా కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ సమన్వయం చేసే బాధ్యతను తీసుకుంటే ఎంతో మేలు జరుగుతుందన్నారు.

97.29 శాతం మందికి
పింఛన్ల పంపిణీ

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా గత మూడురోజుల్లో రూ.1,505.02 కోట్ల పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ నెలలో 62,53,506 మందికి పింఛన్లు పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1,590.53 కోట్లు విడుదల చేసింది. సోమవారం సాయంత్రానికి గ్రామ, వార్డు వలంటీర్లు 60,84,342 మంది (97.29%) లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.


ఏలూరు పెన్షన్‌లైన్‌లో ఎండీ మెహరున్నీసాకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మెబీనా


గుంటూరు బావాజీనగర్‌లో షేక్ మస్తానికి దివ్యాంగ పింఛన్ అందజేస్తున్న వార్డు వలంటీర్ రజియా

గ్రామాలకు స్పెషలిస్ట్ వైద్యులు

▶ మొదటి పేజీ తరువాయి
కోర్సు పూర్తయిన 18నెలల వ్యవధిలో ప్రభుత్వ సేవల్లో చేరకపోతే పీజీ చేసినవారికి రూ.40 లక్షలు, సూపర్ స్పెషాలిటీ కోర్సులు చేసిన వారికి రూ.50లక్షల జరిమానా విధిస్తారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో రాష్ట్ర కోటా సీట్లలో 707 మంది, ప్రైవేట్ కళాశాలల్లో ఏ-కేటగిరీ సీట్లలో 1,142 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందుతారు.



వీరందరూ ఏడాది పాటు గ్రామీణ ప్రాంతాల్లో తప్పనిసరిగా సేవలు అందించాల్సి ఉంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు పొందనున్న వీరందరూ 2025-26లో కోర్సులు పూర్తి చేసుకుంటారు. అనంతరం గ్రామీణ సేవల్లో చేరాల్సి ఉంది. ప్రభుత్వ నిర్ణయంతో గ్రామీణ ప్రాంతాల్లో స్పెషలిస్టు వైద్యుల కొరత తీరనుంది. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి.

బంగాళాఖాతంలో
అల్పపీడనం

- రేపటికి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు పయనం
- మూడు రోజులు కోస్తాంధ్రలో వానలు



సాక్షి, అమరావతి/విశాఖపట్నం: పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో సోమవారం అల్పపీడనం ఏర్పడింది. దీనికి అనుబంధంగా సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఈ అల్పపీడనం పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ బుధవారానికి ఏపీ తీరం వైపునకు పయనించే అవకాశం ఉంది. అల్పపీడనం, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రానున్న మూడు రోజులు కోస్తాంధ్రలో పలుచోట్ల, రాయలసీమలో ఒకటి, రెండు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) సోమవారం రాత్రి ప్రకటించింది. అదే సమయంలో కోస్తాంధ్రలో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. కోస్తాంధ్ర, రాయలసీమల్లో ఉరుములు, మెరుపులతోపాటు పిడుగులు పడవచ్చని వివరించింది. మరోవైపు కోస్తాంధ్ర తీరం వెంబడి గంటకు 40 నుంచి 45 కిలో మీటర్లు, గరిష్టంగా 55 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని తెలిపింది. అందువల్ల సముద్రం అలజడిగా ఉంటుందని, రానున్న మూడు రోజులు మత్స్యకారులు చేపలవేటకు వెళ్లవద్దని సూచించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు హుకుంపేట (వైఎస్సార్ జిల్లా)లో 3.5 సెం.మీ., కపిలేశ్వరపురం (డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా)లో 3.2, చాట్రాయి (ఏలూరు)లో 3.1, రాజానగరం (తూర్పుగోదావరి)లో 3, ఆళ్లగడ్డ (నంద్యాల జిల్లా)లో 2.9, జగ్గంపేట (కాకినాడ జిల్లా) 2.6, గొలుగొండ (అనకాపల్లి జిల్లా)లో 2.3 సెం.మీ.ల వర్షపాతం నమోదైంది.

పాఠశాలలకు నేరుగా బియ్యం

▶ మొదటి పేజీ తరువాయి
బియ్యం అవసరం. ఇప్పటివరకు ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యార్థులకు సార్టెక్స్ బియ్యాన్ని (సాధారణ రకాలు) ఫోర్టిఫై చేసి ఆహారంగా అందిస్తోంది. వచ్చే జనవరి నుంచి ఫైన్ క్వాలిటీ (స్థానిక రకాలు, సన్న రకాలు) బియ్యాన్ని కూడా సరఫరా చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే 2022-23 ధాన్యం సేకరణలో మార్పులు తీసుకొస్తోంది. విద్యార్థులకు మరింత నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు అవసరమైన ఫైన్ క్వాలిటీ ధాన్యాన్ని ఏడాదికి 4 లక్షల నుంచి 5 లక్షల టన్నుల మేర రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేయనుంది. తద్వారా విద్యార్థులకు, రైతులకు మేలు జరగనుంది. దీనికితోడు అప్పుడే పండిన ధాన్యాన్ని మిల్లింగ్ చేయడం ద్వారా వచ్చే బియ్యంతో వండే అన్నం ముద్దగా ఉంటుందనే ఫిర్యాదులను పరిష్కరించేలా.. సేకరణకు, మిల్లింగ్‌కు మధ్య రెండు నుంచి మూడునెలల వ్యవధి ఉండేలా చర్యలు చేపడుతోంది.

ఏప్రిల్ నుంచి ఫోర్టిఫైడ్ రైస్

ఏప్రిల్ నుంచి అన్ని జిల్లాల్లో ఫోర్టిఫైడ్ బియ్యాన్ని పంపిణీ చేసేలా పౌరసరఫరాల శాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఏడు జిల్లాలతో పాటు ఐసీడీఎస్, మధ్యాహ్న భోజనం, సంక్షేమ హాస్టళ్లకు మాత్రమే ఫోర్టిఫైడ్ బియ్యాన్ని అందిస్తున్నారు. ముఖ్యంగా గిరిజన, వెనుకబడిన ప్రాంతాల్లో ఈ ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ఆహారంగా తీసుకున్న వారిలో రక్తహీనత శాతం తగ్గినట్టు ఆరోగ్య సర్వేలు చెబుతున్నాయి. ఇందులో భాగంగానే పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు మొత్తం ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే ప్రజలకు అవగాహన కల్పించేలా అంగన్‌వాడీలు, స్కూల్ టీచర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు.

అంగన్‌వాడీలు, పాఠశాలలు, హాస్టళ్లకు ప్రతినెల సరఫరా చేస్తున్న బియ్యం వివరాలు

విభాగం	సంఖ్య	బియ్యం (టన్నులు)
అంగన్‌వాడీలు	55,607	3,568.3
పాఠశాలలు	45,873	8,491.8
హాస్టళ్లు	3,932	9,163.0

ఫోర్టిఫైడ్ రైస్ అంటే..


మంచి ఆరోగ్యానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు బియ్యానికి అదనంగా చేర్చడాన్ని రైస్ ఫోర్టిఫికేషన్ అంటారు. ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్-బి12 వంటి కీలక సూక్ష్మపోషకాలను బియ్యంలో అదనంగా చేరుస్తారు.

విటమిన్ టాబ్లెట్ కంటే పవర్‌ఫుల్

ప్రభుత్వం అందించే ఫోర్టిఫైడ్ రైస్ విటమిన్ టాబ్లెట్ కంటే ఎంతో పవర్‌ఫుల్. అందుకే రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేసేందుకు కసరత్తు చేస్తున్నాం. దీంతోపాటు విద్యార్థులకు మంచి ఆహారం అందించేలా ఫైన్ క్వాలిటీ బియ్యాన్ని పంపిణీ చేయనున్నాం. రాష్ట్రంలో 9,260 ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ డోర్ డెలివరీ చేస్తున్నాం. ఇప్పుడు దీన్ని అంగన్‌వాడీలు, పాఠశాలలు, హాస్టళ్లకు విస్తరిస్తున్నాం.
– అరుణ్‌కుమార్, కమిషనర్, పౌరసరఫరాల శాఖ

కృష్ణమ్మ జోరు

▶ మొదటి పేజీ తరువాయి
ఎత్తేశారు. ప్రకాశం బ్యారేజ్‌లోకి 1,16,217 క్యూసెక్కులు చేరుతోంది. ఇక్కడి నుంచి కృష్ణా డెల్టాకు 8,747 క్యూసెక్కులను విడుదల చేస్తూ మిగులుగా ఉన్న 1,07,470 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు.


సోమవారం మధ్యాహ్నం ఒక గేటు ద్వారా శ్రీశైలం నుంచి విడుదలవుతున్న నీరు

కృష్ణా బేసిన్‌లో సోమవారం సాయంత్రం 6 గంటలకు ప్రధాన ప్రాజెక్టుల్లోకి వరద ప్రవాహాలు ఇలా..

ప్రాజెక్టు	గరిష్ట మట్టం (అడుగుల్లో)	గరిష్ట నిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత మట్టం (అడుగుల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)
ఆల్మట్టి	1,705	129.72	1,704.95	129.46	20,000	20,000
నారాయణపూర్	1,615	37.64	1,614.14	36.95	40,000	34,850
జూరాల	1,045	9.66	1,044.13	9.11	67,000	74,828
తుంగభద్ర	1,633	105.79	1,632.95	105.58	27,333	27,397
శ్రీశైలం	885	215.81	884.80	214.36	1,47,928	1,15,276
నాగార్జునసాగర్	590	312.05	589.70	311.14	92,841	92,841
పులిచింతల	175	45.77	171.98	41.19	57,560	64,048
ప్రకాశం బ్యారేజ్	57.05	3.07	57.05	3.07	1,16,217	1,16,217



ఏదన్నా సరే ప్రపంచంలో అర్థం కావాలంటే సానుభూతితో దానిలో ఐక్యమై, ఆ దృష్టితో యోచించాలి. వెక్కిరింపు, ఏమీ లేదని కొట్టిపారేయడం చాలా సులభం.
– చలం

సాక్షి

మంగళవారం, అక్టోబర్, 4

మరో ముందడుగు

అయిదేళ్ళ క్రితం మొదలైన ప్రయత్నం ఎట్టకేలకు సాకారమవుతోంది. మొబైల్ టెలిఫోనీలో అయిదో జనరేషన్ (5జి) టెక్నాలజీ వినియోగానికి తొలి అడుగులు పడ్డాయి. ఆరవ ఇండియా మొబైల్ కాంగ్రెస్ ఉత్సవాల్లో శనివారం భారీ హంగామా మధ్య దేశంలో 5జి సేవలను ప్రధాని లాంఛనంగా ప్రారంభించారు. ప్రస్తుత 4జి నెట్‌వర్క్‌ను వాడుకుంటూనే '5జి'ని అందించే నాన్-స్టాండ్ ఎలోన్ పద్ధతిలో 8 నగరాల్లో ఎయిర్‌టెల్ సేవలు మొదలయ్యాయి. దీపావళికి కొత్త నెట్‌వర్క్‌తో స్టాండ్ ఎలోన్ విధానంలో నాలుగు మెట్రో నగరాల్లో సేవలివ్వడానికి జియో సిద్ధమవుతోంది. మన సాంకేతిక ప్రస్థానంలో ఇది మరో పెద్ద ముందడుగు. అమెరికా, బ్రిటన్, చైనా, కెనడా, దక్షిణ కొరియాలు ఎప్పుడో ప్రారంభించిన 5జి సేవలు ఇప్పటికైనా మన దగ్గర మొదలవడం సంతోషకరం.

ఆరంభం ఆలస్యమైనప్పటికీ 5జి సేవల్లో అనతికాలంలో భారత్ అగ్రస్థానానికి చేరుతుందనే వార్తలు మరింత సంతోషాన్నిస్తున్నాయి. తర్వాతి '6జి'కి సైతం సిద్ధమవుతున్నామన్న మాటలు మారనున్న భవిష్యత్ దృశ్యాన్ని సూచిస్తున్నాయి. ఇటీవల 5జి స్పెక్ట్రమ్ వేలంలో 4.3 లక్షల కోట్ల విలువైన ఎయిర్‌వేవ్స్‌ను అమ్మకానికి పెట్టగా, 1.5 లక్షల కోట్ల మేరకే అమ్ముడయ్యాయి. రూ. 88 వేల కోట్ల పైగా వేలంలో పెట్టిన రిలయన్స్ జియో వచ్చే ఏడాది డిసెంబర్ కల్లా ప్రతి తాలూకాలో తమ సేవలు అందుబాటులోకి వచ్చేలా ప్రణాళిక వేసింది. వేలంలో జియో తర్వాత అధికంగా డబ్బు పెట్టిన భారతీ ఎయిర్‌టెల్ మాత్రం వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి పట్టణ ప్రాంతాల్లో, 2024 మార్చికి ప్రధాన గ్రామాల్లో సేవలందిస్తామంటోంది. సమస్యల్లో పడి, నిధుల సమీకరణ సాగించలేకున్న వోడాఫోన్ – ఐడియా సమయం చెప్పకున్నా, రేసులో తన ఉనికిని నిలబెట్టుకొనే పనిలో ఉంది.

5జి దిశగా ఆలోచన అయిదేళ్ళ క్రితం 2017లోనే దేశంలో మొదలైంది. విద్యావేత్తలతో పాటు ప్రభుత్వ, పారిశ్రామిక ప్రతినిధులతో ఉన్నత స్థాయి ప్రతినిధుల వేదికను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా మన దేశంలోనూ '5జి'కి మార్గం చూపి, అప్పటి 4జి దాకా వివిధ టెలికామ్ నెట్‌వర్క్‌లలో నెలకొన్న విజాతీయతను పోగొట్టడం లక్ష్యంగా ఆ వేదిక పనిచేసింది. 2018లో నిపుణుల బృందం తన నివేదికను సమర్పించింది. 5జి ఉపయోగాలపై పరిశోధన సాగుతుండగానే ప్రభుత్వం పరిశీలనకై టెలికామ్ సంస్థలకు స్పెక్ట్రమ్ కేటాయింపు మొదలుపెట్టింది. 2019లో స్పెక్ట్రమ్ ధరలపై టెలికామ్ శాఖ, ట్రాయ్ సంప్రతింపులు జరిపాయి. ఈ ఏడాది ఆగస్ట్‌లో 5జి స్పెక్ట్రమ్ వేలం జరిగింది. రెండు నెలల్లో ఇప్పుడు 5జి సేవలు మొదలయ్యాయి.

ఇప్పుడున్న 4జి కన్నా పది రెట్లు ఇంటర్నెట్ స్పీడ్ '5జి'తో పెరుగుతుంది. '4జి'లో 100 ఎంబీపీఎస్ అత్యధిక స్పీడ్ కాగా, '5జి'లో ఏకంగా అది 10 జీబీపీఎస్ దాకా వెళుతుంది. అలాగే, డేటా ప్రసారానికి '4జి'లో 10 నుంచి 100 మిల్లీసెకన్ల సమయం పడితే, '5జి'లో ఆ లేటెన్సీ సమయం 1 మిల్లీ సెకన్ లోపలే ఉంటుంది. కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం పెరిగి, విద్య, వైద్యం, వినియోగ వస్తువులు, ఆన్‌లైన్ గేమింగ్, వినోదం – ఇలా అన్ని రంగాల్లో వ్యాపారాలు మారిపోతాయి. 5జి సేవలు కొత్త ఆర్థిక అవకాశాలకు తలుపులు తీసి, మరిన్ని సామాజిక ప్రయోజనాలతో మొత్తం భారత సమాజాన్నే మార్చేస్తాయని అంచనా వేస్తున్నది అందుకే! వచ్చే 2035కల్లా దేశంలో 5జి వల్ల ఏకంగా 45 వేల కోట్ల డాలర్ల మేర సంచిత ఆర్థిక ప్రభావం ఉంటుందని సర్కారు వారి మాట. 5జి వల్ల నిరుపేదలు సాధికారత సాధిస్తారని ప్రధాని ఆశంస. అది వాస్తవరూపం దాల్చాలంటే, 5జి సేవలతో పల్లెల్లో నిరుపేదలకు సైతం నాణ్యమైన విద్య, వైద్యం అందించాలి. ఉపాధి అవకాశాలు కల్పించాలి. అలా '5జి'తో పట్టణ – గ్రామీణ అంతరాలను చెరిపివేయాలి.

అయితే, అనేక సవాళ్ళు లేకపోలేదు. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడా 5జి సేవలు తొలి ఏళ్ళలో టెలికామ్ కంపెనీలకు కాసుల వర్షం కురిపించలేదు. మన టెలికామ్ సేవల సంస్థలకూ ఆ సంగతి తెలుసు. స్పెక్ట్రమ్ కొనుగోలు కోసం ఇప్పటికే భారీ మొత్తం ఖర్చు పెట్టిన ఈ సంస్థలు 5జి విస్తరణలో ఆర్థిక క్రమశిక్షణతో తెలివిగా అడుగులు వేయాల్సి వస్తుంది. వినియోగదారులకు అందుబాటులో ఉంటూనే, అతి డిస్కౌంట్లతో సొంత జేబుకు మరీ పెద్ద చిల్లు పడకుండా చూసుకోక తప్పదు. 4జిలో అనేక ఇబ్బందులున్నా ప్రపంచంలో అత్యధికంగా డేటా వినియోగించే మొబైల్ యూజర్లలో భారతీయులూ ఒకరు. అదే సమయంలో సగటున నెలకు ఒక యూజర్‌తో టెలికామ్ సంస్థలకు వచ్చే ఆదాయం బాగా తక్కువుండే దేశాల్లో భారత్ ఒకటి. వ్యాపారం నిలబడాలంటే ఇది ఇబ్బందే గనక, 4జి లాగా 5జి సేవలనూ టెలికామ్ సంస్థలు చౌకగా ఇస్తాయని చెప్పలేం. అయితే, కాస్తంత ఖరీదైనా సరే తాము '5జి'కి మారిపోతామంటూ ఇటీవలి సర్వేలో నూటికి 90 మంది ఉత్సాహం చూపారు.

ధరల నిర్ణయంతో పాటు సైబర్ భద్రత, సాంకేతికతను పెంచుకోవడం, ఫైబర్‌నెట్ విస్తరణ తదితర సవాళ్ళను టెలికామ్ సంస్థలు ఎలా ఎదుర్కొంటాయో చూడాలి. అలాగే, 4జి సేవల్లో, నెట్ స్పీడ్‌లో సవాలక్ష సమస్యలు వేధిస్తున్న సువిశాల దేశంలో '5జి'లో ఇచ్చినమాట నిలబెట్టుకోవడమూ సులభమేమీ కాదు. బేసిక్ ఫోన్ల స్థానాన్ని స్మార్ట్‌ఫోన్లు ఆక్రమించినట్టు, పాత టెక్నాలజీలను పూర్తిగా మార్చడానికి పదేళ్ళపైనే పట్టవచ్చు. అయితేనేం 5జి ఫోన్ల అమ్మక హంగామా అప్పుడే మొదలైంది. అంతటా 5జి ఉత్సాహం నెలకొంది. ఆరేళ్ళలో అనూహ్యంగా మొబైల్ వీడియోను సర్వాంతర్యామిని చేసిన 4జి లాగానే, డిజిటల్ ఇండియాలో సరికొత్త స్వప్నాన్వేషణకు బి రెడీ!

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు ఆశ్వయుజ మాసం, **తిథి:** శు.నవమి ప.1.39 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ రా.11.11 వరకు, తదుపరి శ్రవణం **వర్జ్యం:** రా.2.43 నుండి 4.13 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.15 నుండి 9.04 వరకు, తదుపరి రా.10.36 నుండి 11.24 వరకు **అమృతఘడియలు:** సా.5.12 నుండి 6.41 వరకు, మహర్నవమి.

సూర్యోదయం : 5.54
సూర్యాస్తమయం: 5.46
రాహుకాలం : ప. 3.00 నుంచి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుంచి 10.30 వరకు

రామోజీ అర్ధసత్యాల 'పంచాయితీ'

అసత్యం ప్రమాదకరమే. కానీ అర్ధసత్యం అంతకన్నా ప్రమాదకరం. కానీ 'ఈనాడు' పత్రిక ఈ రెండింటినే ఆయుధాలుగా చేసుకుంది. వీటి తోనే నిత్యం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిపై కుట్ర లకు తెరతీస్తోంది. సోమవారం నాడు పతాక శీర్షికల్లో "రూ.948 కోట్ల మళ్లింపు?" అంటూ వండివార్చిన కథనం ఇలాంటి అర్ధసత్యాల్లో భాగమే. పైపెచ్చు ఈ శీర్షికకు చివర్లో ప్రశ్నార్థక మొకటి!. అంటే... రాసిన రామోజీరావుకే సందేహం ఉందన్న మాట. మరి అంత సందేహం ఉన్నపుడు రాయటమెందుకు? పైపెచ్చు వార్త నిండా నిధుల మళ్లింపు జరిగి పోయిందన్నట్లుగా వ్యాఖ్యలు? ఇదెక్కడి పాత్రికేయం రామోజీరావుగారూ? ఇదేనా పత్రికను నడిపే తీరు? నిజానికి మీ వార్తలో ఆర్థిక సంఘం నుంచి ప్రభుత్వానికి నిధులు వచ్చా యన్నది మాత్రమే నిజం. కానీ మళ్లించారన్నది పచ్చి అబద్ధం. అందుకే మీరు, మీ అర్ధ సత్యాలు ఈ రాష్ట్రానికి అత్యంత హానికరం.

అంతవరకూ బాగానే ఉన్నా...

ఇక్కడ గమనించాల్సిందేంటంటే... ఆంధ్రప్రదేశ్ విభజన దగ్గరి నుంచీ పంచాయతీలు, స్థానిక సంస్థలకు కేంద్రం ఇచ్చే నిధులను ఆయా సంస్థల పీడీ బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తూ వస్తున్నారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలోనూ ఇదే చేశారు. కాకపోతే ఇలాకాకుండా వాటి వ్యక్తిగత ఖాతాల్లో వేయాలని కేంద్రం సూచించటంతో... అలా చేస్తే కనీసం ట్రెజరీ అధికారుల నియంత్రణ కూడా ఉండదని, నిధులు విడుదల చేసే ముందు బిల్లుల్ని పరిశీలించటం, తనిఖీ చేయటం ఏమాత్రం ఉండదని కాబట్టి దీన్ని ఏం చేయాలన్న విషయంలో పంచాయతీ రాజ్ శాఖతో ఆర్థిక శాఖ ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతోంది. అక్రమాలను కనీసం తనిఖీ చేసే వీలుంటుంది కనక పీడీ ఖాతాలకే ఆర్థిక శాఖ మొగ్గు చూపుతుండగా... ఇలా చేస్తే మళ్లీ నిధుల విడుదలలో కేంద్రం జాప్యం చేసే అవకాశం ఉందని, కాబట్టి వ్యక్తిగత ఖాతాలే బెటరని పంచాయతీ రాజ్ శాఖ సూచిస్తోంది. దీనిపై తుది నిర్ణయం ఆలస్యమయ్యింది తప్ప... రామోజీ చెప్పినట్లు రూపాయి కూడా మళ్లించలేదు. అదీ నిజం.

విద్యుత్తు బిల్లులు చెల్లిస్తే తప్పా?

రామోజీరావు రాతలో మరింత ఘోరమైన సంగతేంటంటే ఈ నిధులను విద్యుత్ బిల్లుల చెల్లింపునకు వినియోగిస్తారేమోనని ఆందోళన వ్యక్తంచేయటం!!. అసలు ఇంతకన్నా దుర్మార్గం ఏమైనా ఉంటుందా రామోజీరావు గారూ? చంద్రబాబు హయాంలో ఐదేళ్లూ పంచాయతీలు, స్థానిక సంస్థల బిల్లులు రూపాయి కూడా చెల్లించలేదు. పైపెచ్చు పీపీఏల పేరిట విద్యుత్తు రంగాన్ని నాశనం చేశారు. దాంతో విద్యుత్ పంపిణీ సంస్థలు ఏకంగా రూ.3వేల కోట్ల అప్పుల నుంచి రూ.19,900 కోట్ల అప్పుల్లోకి జారిపోయాయి. స్థానిక సంస్థలు, పంచాయతీలైతే రూ.5వేల కోట్లకుపైగా బకాయిపడ్డాయి. విద్యుత్తు సంస్థలు కనక వాటి నిబంధనలు ప్రకారం బిల్లు కట్టని పంచాయతీలకు కరెంటు నిలిపేస్తే పరిస్థితేంటి? ''అంధకారంలో పంచాయతీలు'' ''బిల్లులు చెల్లించని దుస్థితిలో పంచాయతీలు'' అని మీరే పతాక శీర్షికల్లో వేస్తారుగా? మరి ఇప్పుడు పంచాయతీలకు నిధులు వచ్చినపుడు అవి వాడుకున్న కరెంటు తాలూకు బిల్లును ఆ డబ్బుల నుంచి చెల్లిస్తే మీకేంటి నొప్పి? పడిపోతున్న విద్యుత్తు పంపిణీ సంస్థలను నిలబెట్టాలి కదా? ఆ మాత్రం కూడా బాధ్యతలేకుండా దౌర్భాగ్యపు రాతలెందుకు?

ఇదీ... పీడీ ఖాతాల కథ...

సాధారణ నిధులైతేనేం, ఆర్థిక సంఘం గ్రాంట్ల నిధులైతేనేం రాష్ట్ర విభజన నాటి నుంచీ... అన్నీ ఆయా స్థానిక సంస్థల పీడీ ఖాతాల్లోనే నిర్వహిస్తున్నారు. వాటి పీడీ ఖాతాల్లోని నిధుల లభ్యతను బట్టి గ్రామ పంచాయతీలు కానీ, స్థానిక సంస్థలు గానీ బిల్లులు సమర్పించడం... వాటిని క్లియర్ చెయ్యటం జరుగుతుంటుంది. 'ఈనాడు' చెప్పని నిజమేంటంటే... పంచాయతీలు అప్‌లోడ్ చేసే బిల్లులు సాధారణ నిధుల నుంచో, 14/15వ ఆర్థిక సంఘం నిధుల నుంచో పెద్దగా ఆలస్యం లేకుండా క్లియరవుతూనే ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో సాధారణ నిధుల నుంచి గ్రామపంచాయతీలకు రూ.381 కోట్ల విలువైన బిల్లులు చెల్లించగా... అదే ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఆరునెలల్లో ఏకంగా రూ.638.41 కోట్ల విలువైన బిల్లులు చెల్లించారు. ఆర్థిక సంఘం నిధుల నుంచి గతేడాది రూ.313.48 కోట్ల బిల్లులు క్లియర్ చేయగా... ఈ ఏడాది 588.53 కోట్ల విలువైన బిల్లులు చెల్లించారు. ఈ స్థాయిలో చెల్లింపులు పెరిగిన విషయాన్ని 'ఈనాడు' ఏనాడూ చెప్పదు.

కాకపోతే కొన్ని స్థానిక సంస్థల పీడీ ఖాతాల్లో నిధులు లేకపోవటంతో వాటికి బిల్లులు అప్‌లోడ్ చేయటంలో సమస్యలొస్తున్నది నిజమే. ఈ సమస్యలు కూడా ఎందుకంటే ఆర్థిక సంఘం నిధుల విడుదలలో కేంద్ర ప్రభుత్వం అలవిమాలిన జాప్యం చేస్తోంది. 2021–22కు సంబంధించిన రెండవ అంచె నిధులు 2022–23 రెండో త్రైమాసికంలో విడుదలయ్యాయి. ఇక 2022–23 మూడో త్రైమాసికంలోకి అడుగుపెట్టినా... ఈ ఏడాది తొలి అంచె నిధులింకా రాలేదు. పైపెచ్చు చాలా గ్రామ పంచాయతీల్లో ఐదేళ్లుగా విద్యుత్ బిల్లులు చెల్లించకపోవటంతో బకాయిలు పేరుకుపోయాయి. ఆస్తి పన్ను వసూళ్లలో ఆలస్యం కారణంగా పంచాయతీల నిధులు తగ్గిపోయాయి. వీటన్నిటికీ తోడు... డిస్కమ్‌లకు స్థానిక సంస్థలు చెల్లించాల్సిన విద్యుత్ బకాయిలపై రాష్ట్ర స్థాయిలో ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని స్వయంగా కేంద్ర ఆర్థిక సంఘమే ఉత్తర్వులు జారీ చేసింది. మరి వీటన్నిటినీ ప్రస్తావించకుండా... విద్యుత్ బిల్లుల కింద మినహాయిస్తారేమోననే రెచ్చగొట్టే బాధ్యతారాహిత్యపు వార్తలు ఎవరికోసం రామోజీరావు గారూ?

పంచాయతీలకు కేంద్ర నిధుల విడుదలపై అసత్యాలు

నిధులను మళ్లించేస్తున్నారంటూ పనిగట్టుకుని దుష్ప్రచారం



అసలేం జరిగిందంటే...

2021–22 సంవత్సరానికి సంబంధించి రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలు, స్థానిక సంస్థలకు ఈ ఏడాది జూలై 29న కేంద్రం రూ.379 కోట్లు, ఆగస్టు 31న మరో రూ.569 కోట్లు మొత్తం రూ.948 కోట్లను విడుదల చేసింది. నిజానికి ఈ 15వ ఆర్థిక సంఘం నిధులు ఈ ఏడాది మార్చికి ముందే రావాలి. కానీ కేంద్రం నుంచి ఆలస్యమయ్యాయి. ఆ నిధులు వచ్చిన 4 రోజుల్లోనే... వాటిని సంబంధిత స్థానిక సంస్థల ఖాతాల్లో జమ చేసేందుకు వీలుగా ప్రభుత్వం ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఆర్థిక శాఖ బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ (బీఆర్‌ఓ) జారీ చేయగా... వాటికి అనుగుణంగా ఆగస్టు 4న పంచాయతీ రాజ్ ముఖ్య కార్యదర్శి ఆ నిధుల విడుదలకు పరిపాలన పరమైన అనుమతులు జారీ చేశారు. ఆ తరవాత వారం రోజులకే పంచాయితీ రాజ్ కమిషనర్ ఆ నిధుల్ని సంబంధిత స్థానిక సంస్థల వ్యక్తిగత ఖాతాల్లో జమచేసేందుకు ఉత్తర్వులిచ్చారు.

ఏది నిజం?



డిస్కమ్‌ల పరిస్థితిని మెరుగుపరచడానికి తీసుకోవాల్సిన చర్యలను ప్రస్తావిస్తూ కేంద్రం ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులు.

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

మేడ్ ఇన్ ఇండియా



2.47 లక్షల ఏళ్ల క్రితమే మనం 'మేడ్ ఇన్ ఇండియా' స్థాయికి చేరుకున్నాం. ఏపీలోని ఒంగోలు జిల్లా హనుమంతుని పాడులో లభించిన అతి ప్రాచీన కళాఖండాలు దీన్నే రుజువు చేస్తున్నాయి. – డాక్టర్ జి.వి. సాయిచంద్రన్, ప్రొఫెసర్

దుర్గామాత అంశ



భారత రాజకీయాలలో శక్తిమంతురాలైన మమతా బెనర్జీ జన్మతిథి అష్టమి! ఆ విషయాన్ని ఆమే స్వయంగా ఓసారి వెల్లడించారు. ప్రతి మహిళలోనూ దుర్గామాత అంశ ఉంటుంది. ఈ దుర్గాష్టమి సందర్భంగా యావత్ మహిళావనికి శుభాభివందనాలు. – నీలాంజన్ దాస్, పొలిటికల్ ఎనలిస్ట్

అదీ చెప్పాలి కదా!



కార్గిల్ యుద్ధం తర్వాత తయారీ మొదలైన మన తేలికపాటి దేశవాళీ యుద్ధ హెలికాప్టర్ పూర్తవడానికి 23 ఏళ్లు పట్టిందని 'ప్రచండ' గురించి ట్వీట్ చేసిన ఈ అనుకూల వాదాల ప్రచారకర్త (సీనియర్ జర్నలిస్ట్ శేఖర్‌గుప్తా)... హెలికాప్టర్ తయారీకి ఎందుకంత ఆలస్యం అయిందో కూడా చెప్పి ఉండాల్సింది. – రాజేశ్, 'ఆర్డినరీ పర్సన్'

పట్టించుకోలేదు!



ఒక్క ఢిల్లీ పోలీసులు తప్ప అన్నీ వేగంగా కదులుతున్నాయి. మనీష్ అనే యువకుడు అక్టోబర్ 1న అరడై కత్తిపోట్లకు గురై మరణించాడు. అంతకు 3 రోజుల ముందే తనకు ప్రాణహాని ఉందని అతడు పోలీసులను ఆశ్రయించాడు. వాళ్లు పట్టించుకోలేదు. అంతా అయ్యాక నేరస్థుల్ని పట్టుకున్నారు. కేసు తదుపరి విచారణ అక్టోబర్ 6. – సూరజ్ కుమార్ బౌద్ధ, యాక్టివిస్టు

సత్య నిరూపణ



అంతరించిపోతున్న హోమినిన్‌ల జన్యువులు, మానవ పరిణామ క్రమంపై జరిపిన వినూత్న ఆవిష్కరణలకు గాను స్వీడన్ పరిశోధకుడు స్వాంటే పాబో వైద్యశాస్త్రంలో నోబెల్ సాధించారు. అయినప్పటికీ... మానవులు, చింపాంజీల పూర్వీకులు ఒకరేనన్న సత్యాన్ని అంగీకరించేందుకు కొందరు సిద్ధంగా లేరు.

– ఫవాజ్ జకా, ఆశావహ శూన్యవాది

బాల నరేంద్రుడు



నిర్మాత దీపక్ ముకుత్ 'బాల్ నరేన్' అనే ఒక చిన్నారి రత్నాన్ని మనకు అందిస్తున్నారు. 'స్వచ్ఛ్ భారత్ అభియాన్' గురించిన ఈ సామాజిక చిత్రంలో 14 ఏళ్ల చిన్న పిల్లవాడు గ్రామం మొత్తానికి దిశానిర్దేశం చేస్తాడు. నిజ జీవిత సంఘటనలతో తయారైన ఈ సినిమాలో బాల్ నరేన్‌గా నటించిన యజ్ఞ భాసిన్ ప్రధాని మోదీని కలవాలనుకుంటున్నాడు. అందుకు ఆయన అవకాశం ఇస్తారా?! ఏ విధమైన ప్రభుత్వ సహాయమూ లేని ఈ సినిమా ఈ నెల 14న విడుదల అవుతోంది.

– పలక్ కపూర్, క్రియేటివ్ ప్రొడ్యూసర్

అసుర గణం



దక్షిణ కోల్‌కతాలోని రూబీ పార్క్‌లో పూజ కోసం ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహంలో భాగమైన అసురుడిలో గాంధీజీ పోలికలు ఉండటం యాదృచ్ఛికం అనిపించడం లేదు. 'హిందూ మహాసభ' ఆధ్వర్యంలో అక్కడ దుర్గాపూజలు జరుగుతున్నాయి. మరి హిందూ మహాసభను రద్దు చేస్తారా? మోదీ మీడియా ఎందుకని పెదవి విప్పడం లేదు?! – అద్వైత్, హిస్టారియన్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com

పుస్తక ప్రచురణపైనా పెత్తనమేనా?

కామెంట్



కరణ్ థాపర్

ప్రపంచంలో చాలా భయంకరమైన ఘటనలు జరుగుతుంటాయనీ, ప్రతి ఒక్క ఘటనపై మనం దృష్టి పెట్టలేమనీ నాకు తెలుసు. కానీ కొన్ని సార్లు మనం చూడలేకపోయిన లేక విస్మరించిన విషయాలు రెండూ మనల్ని ఆశ్చర్యచకితులను చేస్తాయి. ఒక్కోసారి స్వీయ ఓటమిలోకి కూడా మనల్ని నెడతాయి. ఈరోజు అలాంటి ఒక ఘటనపై నేను దృష్టి పెట్టాలని అనుకుంటున్నాను.

సెప్టెంబర్ 15వ తేదీన మణిపూర్ ప్రభుత్వం ఒక జీవోను విడుదల చేసింది. రాష్ట్ర చరిత్ర, సంస్కృతి, సంప్రదాయం, భౌగోళిక అంశాలకు చెందిన ఏవైనా పుస్తకాలను ప్రచురించడానికి ముందు వాటిని మణిపూర్ విద్యామంత్రి నేతృత్వంలో ప్రభుత్వం నియమించిన కమిటీకి సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. నిజం చెప్పాలంటే, ఇది పుస్తకాలపై సెన్సార్‌షిప్ విధించటానికి చేసిన ప్రయత్నం మాత్రమే కాదు... రాజ్యాంగం మనకు ప్రసాదించిన వాక్ స్వేచ్ఛ, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛల ఉల్లంఘన కూడా అవుతుందని ఆందోళన కలుగుతోంది.

రాష్ట్ర చరిత్ర, సంస్కృతి, సంప్రదాయం, భౌగోళిక అంశాలపై ప్రచురించిన కొన్ని పుస్తకాలు వాస్తవాలను వ్యక్తీకరించేలా ఉంటున్నాయి లేదా వివిధ సామాజిక బృందాల్లో శాంతియుత సహజీవనానికి విఘాతం కలిగించేవిగా ఉంటున్నాయని మణిపూర్ ప్రభుత్వం చెబుతోంది. ఇకనుంచి ఈ అంశాలపై రాసిన పుస్తకాలను రాష్ట్రంలోని వైస్‌చాన్సలర్లు, కాలేజీలు, యూనివర్సిటీల అధ్యాపకులు, మణిపూర్ ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ అధికారులతో కూడిన 15 మంది సభ్యుల కమిటీకి సమర్పించాల్సి ఉంటుంది. ఈ కమిటీ ఆమోదం లేకుండా ఏ పుస్తకాన్నయినా ప్రచురించినట్లయితే సంబంధిత చట్టప్రకారం శిక్షకు గురవుతారని ప్రభుత్వ ఆదేశం తెలిపింది. అయితే ఏ చట్టం కింద ఏ శిక్ష విధిస్తారనే విషయాన్ని అది నిర్దిష్టంగా పేర్కొనలేదు. అలాగే శిక్షకు గురయ్యేది రచయితా, లేక ప్రచురణకర్తా లేదా ఇద్దరూనా అనే విషయాన్ని కూడా స్పష్టంగా పేర్కొనలేదు.



ఇప్పుడు రాజ్యాంగం వైపు చూద్దాం. భారత సార్వభౌమాధికారాన్ని, దేశ సమగ్రత ప్రయోజనాలను, శాంతిభద్రతలను దెబ్బతీసే రకం వాక్ స్వేచ్ఛపై హేతుపూర్వకమైన ఆంక్షలను విధించడానికి భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (2) అనుమతిస్తోంది. ఇది నిర్దిష్టమైన పుస్తకాలను నిషేధించేందుకు ప్రభుత్వాన్ని అనుమతిస్తోంది. దీనికి ఉదాహరణ ఏమిటంటే మహాత్మాగాంధీ హత్యపై కాల్పనిక చిత్రణకు సంబంధించి స్టేన్లీ వూల్పర్ట్ రాసిన "నైన్ అవర్స్ టు రామా" అనే పుస్తకాన్ని గతంలోనే నిషేధించారు. అంతమాత్రాన ప్రభుత్వంపైన పేర్కొన్న నాలుగు అంశాలపై రాసే ప్రతి పుస్తకాన్నీ ప్రచురణకు ముందుగానే ప్రభుత్వ కమిటీకి సమర్పించడాన్ని కూడా ఆర్టికల్ 19 (2) అనుమతిస్తుందా?

దీనికి సమాధానం నిస్సందేహంగా లేదు అనే చెప్పాలి. దీనికి సమాధానం అవును అయితే అర్థవంతమైన ప్రజాస్వామ్యంగా భారత్ తన ఉనికిని కోల్పోతుంది. కాబట్టే మణిపూర్ ప్రభుత్వ ఆదేశం అసంబద్ధమైనదే కాదు... ఆమోదించతగినది కూడా కాదు. అందుకనే ఈ అంశాన్ని చేపట్టడంలో, తీవ్రంగా నిరసన తెలపడంలో మన వైఫల్యం నన్ను ఆశ్చర్యపరుస్తోంది. అంతకు మించి భయ పెడుతోంది కూడా!

అయితే పూర్తిగా వాస్తవ విరుద్ధంగా రూపొంది, సమాజాన్ని చిక్కుల్లో పడేసి, విచ్ఛిన్న పరిచే పుస్తకాలకు వ్యతిరేకంగా ఎలాంటి చర్యా తీసుకోకూడదని దీనర్థం కాదు. ప్రభుత్వం ఇలాంటి పుస్తకాలను సవరించుకోవాలని డిమాండ్ చేయవచ్చు.

మణిపూర్ ప్రభుత్వం జారీ చేసిన ఆదేశంపై మన ప్రచురణకర్తలు ఎందుకు మౌనంగా ఉన్నారు? వారు తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతారనీ, ప్రభుత్వ ఆదేశాలపై లీగల్ చర్యకు సిద్ధమవుతారనీ భావించాను. అయితే నిజాయతీగా చెప్పాలంటే మణిపూర్‌లో కొద్దిమంది ప్రచురణ కర్తలు మినహాయిస్తే బడా ప్రచురణ సంస్థల్లో ఏ ఒక్కటీ మణిపూర్ ప్రభుత్వ ఆదేశాన్ని సవాలు చేసిన పాపాన పోలేదు.

బహుశా చిన్న స్థాయి ప్రచురణ కర్తలకు ఇది చాలా ఖర్చుతో కూడిన వ్యవహారం కావొచ్చు. దీని కయ్యే ఖర్చులను వారి పుస్తకాల ద్వారా రాబట్టలేకపోవచ్చు. అయితే ప్రచురణకర్తలు సామూహికంగానే ఈ ఉక్కుపాదం మీద పోరాడవచ్చు. ఎందుకంటే వీరి హక్కులు, ప్రయోజనాలు మొత్తంగా ప్రమాదంలో పడుతున్నాయి మరి. ఆక్షేపణే లేకుండా వారు ప్రభుత్వ ఆదేశాన్ని ఆమోదించినట్లయితే (ప్రస్తుతానికి వారు ఆమోదిస్తున్నట్లే కనబడుతోంది) వారూ, వారి రచయితలు కూడా నష్టపోతారు.


వారితోపాటు మనం కూడా నష్టపోతాం. పాఠకులుగా మనం చదవాలనుకునే, నేర్చుకోవాల నుకునే పుస్తకాలను ప్రభుత్వాలు నిరాకరిస్తాయి. మణిపూర్ ప్రభుత్వ ఆదేశం అందరిలాగే మనల్ని కూడా దెబ్బ తీస్తుంది. కాబట్టి మన మీడియా ఎందుకు మౌనంగా ఉంటోంది అనేది ప్రశ్న. టీవీల్లో దీనికి వ్యతిరేకంగా ఆగ్రహపూరితమైన చర్చలు ఎందుకు జరగడం లేదు? మన వార్తా పత్రికలు మండిపడుతూ సంపాదకీయాలు ఎందుకు రాయడం లేదు? వాళ్లకు పరిస్థితి అర్థం కాలేదా? లేక ఏం జరుగుతోందో వారికి నిజంగానే తెలియడం లేదా? వీటికి సమాధానాలు నాకు తెలీవు కానీ ఈ ప్రశ్నలన్నీ ప్రాసంగికత కలిగినట్టివే! అందుకే నేటి పరిస్థితి చాలా నిస్పృహను కలిగిస్తోంది.

చివరకు అది నా మిత్రుడు లేవనెత్తిన ప్రశ్న దగ్గర వచ్చి ఆగింది. చివరకు మనం ఇక్కడికి చేరామా అని ప్రశ్నించాడతను. నిజం చెప్పాలంటే, సమాధానం అవును అనే!

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు

తెలుగు సాంస్కృతిక వికాస రారాజు

పిఠాపురం మహారాజా రావు వెంకట కుమార మహీపతి సూర్యారావు బహదూర్ (1885 –1965) ఆంధ్రదేశపు సంస్కరణ పోషణకు, సాంస్కృతిక కళా వికాసానికీ, సత్పరిపాలనకూ ఎనలేని కృషి చేశారు. తన గురువు దివాన్ మొక్కపాటి సుబ్బారాయుడు చూపిన అభ్యుదయ మార్గంలో అణగారిన వర్గాల ప్రజల అభ్యున్నతికై అలుపెరుగక పరిశ్రమించారు. వివిధ రంగాల్లో సూర్యారావు చేపట్టిన కార్యక్రమాలు ఎన్నదగ్గవి. దక్షిణాఫ్రికాలోని భారతీయుల కోసం గాంధీజీ పిలుపునందుకుని పాతిక వేలు అందించి, ఆనాటి జమీందార్లలో దేశభక్తికి ఊపిరులూదారు. రవీంద్రనాథ్ టాగూర్ స్థాపించిన 'శాంతినికేతన్' కలకత్తాలోని సిటీ కాలేజి; రాజమండ్రిలోని ఆస్తిక కళాశాల, టౌన్ హాలు నిర్మాణానికీ ఆర్థికంగా ఆయన అందించిన సేవలు అనన్యసామాన్యమైనవి. సంఘ సంస్కరణోద్యమానికి బాటలు వేసిన 'బ్రహ్మసమాజం' కార్యక్రమాలకు అన్ని విధాలా సాయం అందించారు. 1933లో బ్రహ్మసమాజ సూత్రధారి రాజా రామ్మోహన్‌రాయ్ శత వర్ధంతిని నిర్వహించారు. ఎన్నో మత సామరస్య, మానవీయ గ్రంథాల్ని ఈ సంద ర్భంగా ప్రచురించారు. అలాగే నాలుగవ అంతర్జాతీయ సర్వ మత సమ్మేళనానికి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ గౌరవాన్ని పొందిన రెండవ భారతీయ రాజుగా ఘనత సాధించారు. 'ఆంధ్ర సాహిత్య పరిషత్తు'ను మద్రాసులో స్థాపించి దానికి శాశ్వత నిధిని ఏర్పాటు చేశారు. ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ లాంటి సమగ్రమైన నిఘంటువు తెలుగులో కూడా అవసరమనే ఆశయంతో 'సూర్యరాయాంధ్ర' నిఘంటువు నిర్మాణాన్ని ఒక బృహత్కార్యంగా చేపట్టి తెలుగుజాతికి అందించారు.



సూర్యారావు బహదూర్

దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటి అనాథ ఆశ్రమంగా 'కరుణాలయం' స్థాపించారు. నిమ్న వర్గాల పురుషుల పేరు చివర 'గాడు'ను చేర్చి అవమానకరంగా పిలవడాన్ని నిషేధిస్తూ లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో బిల్లును ప్రవేశపెట్టి విజయం సాధించారు. గాంధీజీ చేపట్టిన మద్యపాన నిషేధ ఉద్యమం కంటే ముందుగానే పిఠాపురం సంస్థాన పరిధిలో కల్లు తాగడాన్ని నిషేధించారు. కాకినాడలోని పీఆర్ కళాశాల ద్వారా దేశంలో అత్యున్నత విద్యనందించి చరిత్రలో ప్రత్యేకతను చాటుకున్నారు. తెలుగునాట సాంస్కృతిక పునరుజ్జీవనానికి ఎనలేని కృషి చేసిన పిఠాపురం రాజాను స్మరించుకోవడం మన బాధ్యత.

– ర్యాలి ప్రసాద్, చారిత్రక పరిశోధకులు

(రేపు పిఠాపురం మహారాజా సూర్యారావు బహదూర్ జయంతి)

శ్రీవారి సేవలో గవర్నర్ హరిచందన్

తిరుమల: తిరుమల శ్రీవారిని సోమవారం రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఆయనకు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి స్వాగతం పలికారు. గవర్నర్ ధ్వజస్తంభానికి నమస్కరించి శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం మొక్కులు చెల్లించుకున్నారు. అద్దాల మండపంలో గవర్నర్‌కు వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. శ్రీవారి తీర్థప్రసాదాలను గవర్నర్‌కు టీటీడీ చైర్మన్, ఈవో అందించారు.

'నృత్య' సత్యనందినికి బంగారు పతకం


తెలంగాణ గవర్నర్ తమిళసై నుంచి గోల్డ్ మెడల్ అందుకుంటున్న సత్యనందిని

విజయవాడ కల్చరల్: కూచిపూడి నాట్యంలో విశేష ప్రతిభ చూపిన ఎన్టీఆర్ జిల్లా విజయవాడకు చెందిన నృత్యకళాకారిణి తూనుగుంట్ల సత్యనందినికి కూచిపూడి మాస్టర్ ఆఫ్ ఫెర్ఫార్మెన్స్ ఆర్ట్స్(ఎంపీఏ)–2022కి బంగారు పతకం లభించింది. హైదరాబాద్‌లో సోమవారం తెలంగాణ గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా పతకం అందుకున్నారు. హైదరాబాద్‌లోని సెంట్రల్ వర్సిటీలో ఎంపీఏ చదివారు. ప్రముఖ నాట్యాచారిణి అయిన తల్లి శైలశ్రీ వద్ద శిక్షణ ప్రారంభించారు. సోదరి రమ్య సాహితీతో కలిసి దేశంలో 500లకుపైగా ప్రదర్శనలిచ్చారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు నిర్వహించిన పోటీల్లో ప్రతిభచూపి బహుమతులు గెలిచారు.

'మానసిక ఆరోగ్యం ముఖ్యం'


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: ప్రతి ఒక్కరికీ మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల పోస్టర్‌లను మంత్రి రజిని సోమవారం పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా ఒత్తిడి అనేది రెండో అతి పెద్ద తీవ్రమైన వ్యాధిగా మారిందన్నారు. అందువల్ల యోగా, వ్యాయామం ద్వారా మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవల్సిన అవసరం ఉందన్నారు.

'సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం'



వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా అమలు చేస్తున్నందుకు సీఎం వైఎస్ జగన్‌కు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని ఏపీ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్ అన్నారు. ఈ పథకాల ద్వారా పేద వర్గాలకు చెందిన యువతుల వివాహాలను గౌరవంగా జరిపిస్తున్నందుకు, ఆ కుటుంబాలకు అండగా నిలుస్తున్నందుకు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు సోమవారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు.

'ప్రజలను రెచ్చగొట్టేందుకు చంద్రబాబు యత్నం'

తాడికొండ: చంద్రబాబు ఆయన బినామీలు ప్రజలను రెచ్చగొట్టేందుకు యత్నిస్తున్నారని బహుజన పరిరక్షణ సమితి నేతలు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 736వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు సోమవారం పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. పూలింగ్‌కు భూములిచ్చే సమయంలో అన్ని హక్కులను సీఆర్డీఏకు అప్పగిస్తూ అగ్రిమెంట్ చేశారని, ఆ నిబంధనలకనుగుణంగానే సీఎం వైఎస్ జగన్ రైతులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తుంటే.. ఎందుకు గొడవ చేస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. దళితులను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకే వాడుకుంటున్న చంద్రబాబు.. అమరావతి ఉద్యమంలోనూ వారిని కరివేపాకులా వాడుకుని వదిలేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నేతలు మాదిగాని గురునాథం, పెరికే వరప్రసాద్, ఈపూరి ఆదాం, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

తేజోనిధిగా సూర్య ప్రభపై..నక్షత్ర వెలుగులో చంద్రప్రభపై

మాడవీధుల్లో ఊరేగిన మలయప్ప స్వామి


సూర్యప్రభపై

తిరుమల కొండ మీద శ్రీవేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవ సంబరం అంబరాన్ని తాకేలా సాగుతోంది. ఏడో రోజు సోమవారం ఉదయం సూర్యప్రభపై ఊరేగుతూ స్వర్ణ కాంతులతో దివ్యతేజో మూర్తి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి చంద్రప్రభపై చల్లని చంద్రకాంతుల్లో భక్తులను అనుగ్రహించారు. శ్రీవేంకటేశ్వరుడికి సూర్యచంద్రులు రెండు నేత్రాలు. సూర్యుడు తేజోనిధి, ప్రకృతికి చైతన్య ప్రదాత, సకల రోగాల నివారకుడు. స్వర్ణ కాంతులీనే భాస్కరుడిని సప్తఅశ్వాల రథ సారధిగా చేసుకుని మలయప్ప మత్స్య నారాయణుడి అలంకారంలో స్వర్ణ కాంతులీనుతూ ఉదయం వేళ తిరుమాడ వీధుల్లో వైభవంగా విహరించారు. ఇక భగవంతుని మారు రూపమైన చంద్రుడిని వాహనంగా మలుచుకున్న వేంకటాచలపతి రాత్రి వేళలో తిరుమాడ వీధుల్లో ఊరేగారు. వాహనసేవల్లో భజన బృందాల కోలాహలం, సాంస్కృతిక కార్యక్రమాలు, కళాకారుల సందడి నడుమ స్వామివారు భక్తులకు తన దివ్య మంగళ రూపంతో మైమరిపించారు. పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు, ఈవో ఏవీ ధర్మారెడ్డి దంపతులు, ఢిల్లీ స్థానిక సలహా మండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, బోర్డు సభ్యులు ఎం.రాములు, మారుతిప్రసాద్, మధుసూదన్ యాదవ్ పాల్గొన్నారు.

నేడు రథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 7 గంటలకు మలయప్పస్వామి వారు మహారథంపై ఊరేగుతారు. గరుడ సేవ తర్వాత అంత ప్రాధాన్యత కలిగిన వాహన సేవ ఇదే. అలాగే, రాత్రి అశ్వావాహనంపై స్వామి వారు ఊరేగనున్నారు.

సర్వ దర్శనానికి 15 గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. 32 క్యూ కంపార్ట్‌మెంట్లు నిండి ఉన్నాయి. సర్వదర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. ఆదివారం అర్ధరాత్రి వరకు 82,463 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 35,385 మంది తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ.2.31 కోట్లు వేశారు.


చంద్రప్రభపై

- తిరుమల

దుర్గాదేవిగా బెజవాడ దుర్గమ్మ దర్శనం

- మూలానక్షత్రం రోజున అమ్మవారిని దర్శించుకున్న 3.50 లక్షల మంది
- సరస్వతీ దేవిగా ఆలయ చరిత్రలో తొలిసారిగా 24 గంటల పాటు దర్శనమిచ్చిన అమ్మవారు

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ)/ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ)/కాణిపాకం(యాదమరి): దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సోమవారం ఇంద్రకీలాద్రిపై కొలువైన్న జగజ్జనని దుర్గమ్మ దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గాష్టమి రోజున అమ్మవారు దుర్గాదేవిగా భక్తులను అనుగ్రహిస్తారు. సోమవారం కూడా పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చారు. రెండు రోజుల నుంచి ఇంద్రకీలాద్రికి వేలాదిగా భవానీలు వస్తున్నారు. దసరా ఉత్సవాల సందర్భంగా చిత్తూరు జిల్లా కాణిపాకం ఆలయం నుంచి స్వామి వారి పక్షాన అమ్మవారికి పట్టువస్త్రాలు, పసుపు కుంకుమలను ఆ ఆలయాధికారులు సమర్పించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా మల్లికార్జున మహా మంటపంలో జరిగిన వేదవిద్వత్ సభలో పండితుల వేదనాదాలతో అమ్మవారిని కీర్తించారు. దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ మధ్యాహ్నం నుంచి ఆలయంలో ఉండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మంత్రి ఆర్కే రోజా, సినీ నటి హేమ ఇతర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం శ్రీ గంగా సమేత దుర్గామల్లేశ్వరస్వామి వార్ల నగరోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

నేడు..శ్రీమహిషాసుర మర్దని దేవిగా..

కాగా, మంగళవారం నాడు శ్రీ మహిషాసుర మర్దని దేవిగా అమ్మవారు దర్శనమివ్వనున్నారు. అష్టభుజాలతో అవతరించి సింహవాహినియై, దుష్టుడైన మహిషాసురుడిని సంహరించి శ్రీదుర్గాదేవి దేవతల, ఋషుల, మానవుల కష్టాలను తొలగిస్తుంది. ఈ అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శిస్తే అరిషడ్వర్గాలు నశిస్తాయని భక్తుల విశ్వాసం.


అంతరాయంలో భక్తుల రద్దీ

సీఎం వచ్చినా యథావిధిగా కొనసాగిన దర్శనం

అమ్మవారిని దర్శించుకోవటానికి ముఖ్యమంత్రి వచ్చిన సందర్భంలో పూర్వం గంటల కొద్దీ దర్శనాలను నిలిపివేసేవారు. కానీ సీఎం జగన్ సాధారణ భక్తులకు ఇబ్బందులు కలిగించకూడదని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో సీఎం జగన్ ఇంద్రకీలాద్రికి వచ్చినప్పుడు కూడా ఉచిత దర్శనం క్యూలైన్లను యథావిధిగా కొనసాగించారు. ముఖ్యమంత్రి దర్శనం అవ్వగానే వీఐపీ క్యూలైన్లలోనూ భక్తులను అనుమతించారు.

సరస్వతీ దేవిగా 24 గంటల పాటు దుర్గమ్మ దర్శనం

దసరా ఉత్సవాల్లో భాగంగా మూలానక్షత్రం పర్వదినాన్ని పురస్కరించుకొని ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ సరస్వతీదేవిగా 24 గంటల పాటు నిరంతరాయంగా భక్తులకు దర్శనమిచ్చారు.ఆలయ చరిత్రలో ఇంత సుదీర్ఘకాలం అమ్మవారు దర్శనమివ్వటం ఇదే తొలిసారి. ఆదివారం సెలవు రోజు కావడంతో అమ్మవారిని దర్శించుకోవటానికి భక్తులు భారీగా వచ్చారు. శనివారం అర్ధరాత్రి ఒంటి గంటకు దర్శనాన్ని అధికారులు ప్రారంభించారు. 15 నిమిషాల పాటు ప్రముఖులను అనుమతించి ఆ తరువాత సాధారణ భక్తులను దర్శనానికి అనుమతించారు. అక్కడి నుంచి ఆదివారం అర్ధరాత్రి 12.55 నిమిషాల వరకు అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. లక్షలాదిగా భక్తులు ఇంద్రకీలాద్రికి వచ్చినా ఎక్కడా తొక్కిసలాట లేకుండా అందరికీ దర్శనం సజావుగా జరిగేటట్లు ప్రభుత్వం చూసింది. కాగా, మూలానక్షత్రం రోజున అమ్మవారిని సుమారు 3.50 లక్షల మంది దర్శించుకున్నట్లు అధికారులు అంచనా.

వాతావారణ పరిస్థితులను బట్టి తెప్పోత్సవం



విజయదశమి రోజున వాతావరణం పరిస్థితులను బట్టి తెప్పోత్సవం నిర్వహణపై నిర్ణయం తీసుకుంటామని దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఇంద్రకీలాద్రిపై మీడియా పాయింట్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. దసరా ఉత్సవాల్లో భాగంగా విజయదశమి రోజున శ్రీ గంగా పార్వతి (దుర్గా)సమేత మల్లేశ్వర స్వామి వార్లకు నిర్వహించే తెప్పోత్సవంపై ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. నదిలో నీటి ప్రవాహాన్ని బట్టి ఇరిగేషన్ అధికారులు అనుమతులను మంజూరు చేస్తారని చెప్పారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోతే శాస్త్ర ప్రకారం పూజలు నిర్వహించి నది ఒడ్డునే దర్శించుకోవడానికి అనుమతులిస్తామని పేర్కొన్నారు.

మహాకాళీ అవతారంలో రాజశ్యామల అమ్మవారు


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మంత్రి రోజా

సింహాచలం/నగరి: విశాఖ శ్రీశారదా పీఠంలో జరుగుతోన్న శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీ శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారు మహాకాళీ అవతారంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి విశేషంగా పూజలు నిర్వహించి హారతులు అందజేశారు. పీఠం ప్రాంగణంలో చండీహోమం, రాజశ్యామల హోమం, చతుర్వేద, దేవీ భాగవత పారాయణాన్ని నిర్వహించారు.

పీఠాన్ని సందర్శించిన మంత్రి రోజా

శ్రీశారదా పీఠాన్ని రాష్ట్ర మంత్రి ఆర్.కె.రోజా సోమవారం సందర్శించి రాజశ్యామల అమ్మవారికి పూజలు నిర్వహించారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. పీఠం ప్రాంగణంలో ఉన్న ఇతర దేవతా మూర్తుల ఆలయాలను దర్శించారు. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్రను కలిసి వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యే అదీప్‌రాజ్ పాల్గొన్నారు.

మహాగౌరిగా శ్రీశైల భ్రమరాంబ



శ్రీశైలం టెంపుల్: శ్రీశైల క్షేత్రంలో దసరా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దసరా నవరాత్రోత్సవాల్లో భాగంగా సోమవారం భ్రమరాంబాదేవి మహాగౌరి అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారిని, భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామిని నందివాహనంపై ఆశీనులను కావించి అలంకార మండపంలో ఉంచారు. మహాగౌరి అమ్మవారికి, నందివాహనాధీశులైన ఆదిదంపతులకు అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజా, హారతులిచ్చి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు. తరువాత వైభవంగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

ఉపాధి బకాయిలు రూ.1,453 కోట్లు ఇవ్వండి

కేంద్ర మంత్రికి ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు వినతి


కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్‌ను కలిసిన బూడి ముత్యాలనాయుడు, రెడ్డెప్ప, గురుమూర్తి

తిరుపతి అలిపిరి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రానికి రావాల్సిన బకాయిలు రూ.1,453 కోట్లు చెల్లించాలని కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌ను కోరగా, సానుకూలంగా స్పందించారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు తెలిపారు. తిరుపతి పర్యటనకు వచ్చిన కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్‌ను సోమవారం ముత్యాలనాయుడుతో పాటు ఎంపీలు రెడ్డెప్ప, గురుమూర్తి, సత్యవతి, ఉపాధి హామీ పథకం రాష్ట్ర డైరెక్టర్ చిన్నతాతయ్య, జేసీ బాలాజీ కలిశారు. రాష్ట్రానికి రావాల్సిన బకాయిలు, గిరిజనులు, రైతులకు సంబంధించిన పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. అనంతరం ముత్యాలనాయుడు విలేకరులతో మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని కాఫీ తోటల్లో కూడా ఉపాధి హామీ పథకం కింద పనులకు అవకాశం కల్పించాలని, పండ్ల తోటల రైతులకు ఐదు ఎకరాల వరకే ఉన్న వెసులుబాటును పది ఎకరాలకు పెంచాలని కోరినట్లు తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద గృహ నిర్మాణాలకు ఇస్తున్న 90 పని దినాలను సాధారణ 100 పని దినాలతో కలపకుండా అదనంగా కల్పించాలని, చెంచులకు 200 పని దినాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. రహదారులు, వంతెనల నిర్మాణం, నిధుల బకాయిలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లామని, అన్నింటిపై ఆయన సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.

పంచాయతీ బకాయిలు చెల్లించాం... దారి మళ్లించలేదు

పంచాయతీలకు సంబంధించిన విద్యుత్ బకాయిలకు 15వ ఆర్థిక సంఘం నిధులను జమ చేశామని ముత్యాలనాయుడు చెప్పారు. పంచాయతీల నిధులు దారి మళ్లించేందుకు అవకాశమే లేదని ఆయన స్పష్టంచేశారు. సర్పంచ్‌ల అధికారాలు హరించినది తెలుగుదేశం ప్రభుత్వమేనని అన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో సర్పంచ్‌లను డమ్మీలను చేసిన చరిత్ర టీడీపీకే దక్కుతుందన్నారు.

బాలుడి కిడ్నాప్.. కథ సుఖాంతం

- పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో కిడ్నాప్ చేసిన దుండగులు
- పోలీసులు వెంబడించడంతో నెల్లూరు జిల్లాలో వదిలేసి వెళ్లిన వైనం

చిలకలూరిపేట/కావలిరూరల్: పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ఏడేళ్ల బాలుడు కిడ్నాప్ అయ్యాడు. పోలీసులు అప్రమత్తమై నిఘా పెంచి వెంబడించడంతో దుండగులు ఆ బాలుడిని నెల్లూరు జిల్లాలో వదిలిపెట్టారు. గంటల వ్యవధిలోనే పోలీసులు బాలుడిని రక్షించి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. చిలకలూరిపేట అర్బన్, కావలి రూరల్ పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన మేరకు.. చిలకలూరిపేట పట్టణంలోని పెదనందిపాడు రోడ్డు మారుతీ నగర్‌కు చెందిన ఎస్.అరుణ చెన్నైకు చెందిన శరవణన్‌ను 12 ఏళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకుంది. వీరి కుమారులు తొమ్మిదేళ్ల రాజీవ్ సాయి, ఏడేళ్ల రాధీవ్ సాయి. శరవణన్ చెన్నైలో ధాన్యం వ్యాపారం చేస్తూ కుటుంబంతో అక్కడే నివాసం ఉంటున్నారు. ఇటీవల తల్లికి అనారోగ్యంగా ఉండటం, దసరా సెలవులు కావటంతో అరుణ పిల్లల్ని తీసుకుని చిలకలూరిపేట వచ్చింది. ఆదివారం రాత్రి పిల్లలు, బంధువులతో కలసి పోలేరమ్మ గుడికి వెళ్లిన అరుణ పూజల తరువాత పెద్ద కుమారుడితో ఇంటికి చేరుకుంది. అప్పుడు గుడివద్ద ఆడుకుంటున్న రాజీవ్‌సాయిని రాత్రి 9 గంటల సమయంలో తీసుకొచ్చిన వారి బంధువు దుర్గేశ్వరి.. అతడిని వారి ఇంటి రోడ్డు మలుపులో వదిలిపెట్టి తన ఇంటికి వెళ్లిపోయింది. కొంతసేపటి తరువాత రాజీవ్ సాయి వాళ్ల ఇంటికి వెళ్లింది. పిల్లవాడు ఎక్కడని అరుణ ప్రశ్నించటంతో కొంతసేపటి కిందటే రోడ్డు చివర వదిలివెళ్లినట్లు తెలిపింది. దీంతో బంధువులు గాలింపు చేపట్టారు. అర్ధరాత్రి 12గంటల సమయంలో చెన్నైలో ఉన్న బాబు తండ్రి శరవణన్‌కు గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌చేసి.. బాబును కిడ్నాప్ చేశామని, రూ.కోటి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో శరవణన్ కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చి చిలకలూరిపేట బయలుదేరారు. అరుణ చిలకలూరిపేట అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అర్బన్ సీఐ జి.రాజేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు గాలింపు చేపట్టారు.


రాజీవ్‌సాయి

కిడ్నాపర్ల ఫోన్ ఆధారంగా..

ఫోన్‌చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్న కిడ్నాపర్లతో శరవణన్ డబ్బు తీసుకుని కావలి వరకు వచ్చానని చెప్పారు. కావలి శివారు పెట్రోల్ బంకు వద్ద సిగ్నల్‌లైట్లు వేసి కారు నిలిపి ఉంచాలని కిడ్నాపర్లు అతడికి సూచించారు. చిలకలూరిపేట పోలీసులతోపాటు హైవేపై నిఘావేసిన నెల్లూరు జిల్లా గుడ్లూరు, కావలి పోలీసులు అక్కడ అనుమానాస్పదంగా ఉన్న కారును వెంబడించారు. పోలీసులు వెంటాడుతున్న విషయం గమనించిన దుండగులు కావలి సమీపంలోని ముసునూరు వద్ద కారు స్లోచేసి బాబును బయటకు తోసి పరారయ్యారు. పోలీసులు రాజీవ్‌సాయిని చిలకలూరిపేటలోని కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ విషయమై అర్బన్ సీఐ జి రాజేశ్వరరావు మాట్లాడుతూ ఫోన్ నంబరును, కారును గుర్తించామని, త్వరలోనే కారులో ఉన్న ముగ్గురు నిందితులను అరెస్టు చేస్తామని చెప్పారు. నెల్లూరు జిల్లా ఎస్పీ సీహెచ్.విజయారావు.. గుడ్లూరు సీఐ పి.సుబ్బారావు, ఎస్‌ఐ కె.ప్రసాద్‌రెడ్డి, కావలి రూరల్ ఎస్‌ఐ ఎం.వెంకటరావు, సిబ్బందిని అభినందించారు.

పోలీసుల పనితీరు భేష్: మంత్రి రజని

కిడ్నాప్‌కు గురైన బాలుడిని కాపాడి తల్లిదండ్రులకు అప్పగించటంలో చిలకలూరిపేట పోలీసుల కృషి ప్రశంసనీయమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. ఆమె సోమవారం రాత్రి రాజుసాయి ఇంటికి వెళ్లి అతడిని, కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కిడ్నాప్ విషయాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం రాత్రి తనకు చెప్పగానే సీఐతోపాటు, నరసరావుపేట డీఎస్పీ, పల్నాడు ఎస్పీల దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు చేపట్టాలని కోరినట్లు చెప్పారు. దీంతో పల్నాడు ఎస్పీ రవిశంకర్‌రెడ్డి రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి బాలుడిని గుర్తించినట్లు తెలిపారు. కిడ్నాపర్ల కోసం వేట కొనసాగించాలని పోలీసులను ఆదేశించినట్లు చెప్పారు. బాలుడి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

బోయకొండ అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ


అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడానికి వెళ్తున్న మంత్రి పెద్దిరెడ్డి దంపతులు

చౌడేపల్లె: రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలని బోయకొండ గంగమ్మకు మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరు చిత్తూరు జిల్లా తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి, ఎమ్మెల్సీ భరత్, టీటీడీ పాలక మండలి సభ్యుడు పోకల అశోక్‌కుమార్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డితో కలిసి సోమవారం అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలను సమర్పించారు. వీరికి ఆలయ కమిటీ చైర్మన్ శంకర్‌నారాయణ, ఈవో చంద్రమౌళి ఆలయ మర్యాదలతో మేళ తాళాల నడుమ పూర్ణకుంభ స్వాగతం పలికారు.

బినామీ ఆస్తులు కాపాడుకునేందుకే 'అమరావతి పాదయాత్ర'

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తణుకు అర్బన్: టీడీపీ నేతల బినామీ ఆస్తులను కాపాడుకునేందుకే అమరావతి రైతులు అంటూ బూటకపు పాదయాత్రలు చేస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం స్వార్థపరులు చేస్తున్న పాదయాత్ర అది అని, చంద్రబాబు బినామీలతో ఈ పాదయాత్ర చేపట్టారని ధ్వజమెత్తారు. ఎస్సీ, ఎస్టీల భూములతో వ్యాపారం చేసే వాళ్లు పాదయాత్ర చేస్తారా అని మండిపడ్డారు. రాష్ట్రంలో ఒకే ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలా అని ప్రశ్నించారు. అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాలని, రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో మూడు రాజధానులను ఏర్పాటుచేస్తే ఆయా రాజధానుల పరిసర ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందుతాయనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని తెలిపారు. గతంలో హైదరాబాద్ ఒక్క ప్రాంతాన్నే అభివృద్ధి చేసి ఎంత తప్పు చేశారో అందరికీ తెలిసిందేనన్నారు. ఓటుకు కోట్లు కేసులో అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు అర్ధంతరంగా హైదరాబాద్‌ను వదిలేసి రాష్ట్రానికి దరిద్రం పట్టించారని మండిపడ్డారు. ఆ దుర్మార్గుడు ఇప్పుడు అమరావతి రైతు పాదయాత్రతో కుళ్లు రాజకీయం చేయిస్తున్నారని విమర్శించారు.

క్లుప్తంగా...

మంగళ్‌యాన్ కథ ముగిసింది

బెంగళూరు: అంగారక (మార్స్) గ్రహంపై పరిశోధనల కోసం భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) చేపట్టిన మంగళ్‌యాన్ మిషన్ ముగిసింది. మార్స్ ఆర్బిటార్ క్రాఫ్ట్‌తో గ్రౌండ్ స్టేషన్‌తో సంబంధాలు తెగిపోయినట్లు ఇస్రో సోమవారం ధ్రువీకరించింది. 2013 నవంబర్ 5న ఆర్బిటార్ ప్రయోగం ప్రారంభించారు. ఆర్బిటార్ 300 రోజులపాటు ప్రయాణించి 2014 సెప్టెంబర్ 24న అంగారకుని కక్ష్యలోకి ప్రవేశించింది. ఈ ఎనిమిదేళ్ల కాలంలో అరుణ గ్రహం ఉపరితలంపై వాతావరణ పరిస్థితుల గురించి ఎప్పటికప్పుడు సమాచారం అందించింది. మంగళ్‌యాన్ జీవితకాలం ముగిసిందని, పని చేయడం ఆగిపోయిందని, ఆర్బిటార్‌ను ఇక రికవరీ చేయలేమని ఇస్రో అధికారులు స్పష్టం చేశారు. ఇతర గ్రహంపై పరిశోధనల విషయంలో మంగళ్‌యాన్ అద్భుత సాంకేతిక, శాస్త్రీయ ప్రయోగంగా మిగిలిపోతుందని ఒక ప్రకటనలో వెల్లడించారు.

డ్యాన్స్ చేస్తూ కొడుకు మృతి.. ఆ షాక్‌తో తండ్రి..!

పాల్ఘర్: గర్బా డ్యాన్స్ కార్యక్రమం ఓ కుటుంబంలో తీరని విషాదం నింపింది. డ్యాన్స్ చేస్తూ కొడుకు చనిపోగా, ఆతడిని ఆస్పత్రికి తీసుకెళ్లిన తండ్రి షాక్‌తో ప్రాణాలు విడిచాడు. ఈ ఘటన మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లా విరార్‌లో చోటుచేసుకుంది. పట్టణంలోని గ్లోబల్ సిటీ కాంప్లెక్స్‌లో శనివారం రాత్రి గర్బా డ్యాన్స్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. ఇందులో పాల్గొన్న మనీష్ నరప్జీ సోనిగ్రా(35) డ్యాన్స్ చేస్తూ పడిపోయాడు. ఆయన తండ్రి నరప్జీ సోనిగ్రా(66) అతడిని వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అయితే, మనీష్ అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఇది తెలిసి నరప్జీ సోనిగ్రా అక్కడే తుది శ్వాస విడిచారు. ఆకస్మిక మరణాలుగా పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నివేదిక అందాకే అసలు కారణాలు వెల్లడవుతాయని పోలీసులు పేర్కొన్నారు.

దుర్గా మంటపంలో ప్రమాదం.. ఐదుగురు సజీవ దహనం

భదోహి: దుర్గామాత పూజా మంటపంలో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగిన ఘటనలో ముగ్గురు చిన్నారులు సహా ఐదుగురు సజీవ దహనమయ్యారు. మరో 64 మంది గాయపడ్డారు. యూపీలోని భదోహి జిల్లా నరువా గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గా మంటపంలో ఆదివారం రాత్రి డిజిటల్ షో ఏర్పాటు చేశారు. చిన్నారులు, మహిళలు సుమారు 300 మంది హాజరయ్యారు. రాత్రి 9.30 గంటల సమయంలో మంటపంలో ఏర్పాటు చేసిన హాలోజన్ లైటు వేడెక్కి విద్యుత్ తీగలకు తాకి మంటలు చెలరేగాయి. క్షణాల్లో వ్యాపించి మంటపాన్ని పక్కనున్న టెంటును బుగ్గి చేశాయి. ఘటనలో గాయపడిన 69 మందిని ఆస్పత్రులకు తరలించారు. చికిత్స పొందుతూ ఐదుగురు చనిపోయారు. నిర్లక్ష్యం వహించిన మంటపం నిర్వాహకులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్పీ అనిల్ కుమార్ చెప్పారు. ఈ ఘటనపై యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

జేఈఈ మెయిన్స్-2021 హ్యాకింగ్ కేసులో రష్యన్ అరెస్ట్

న్యూఢిల్లీ: గత ఏడాది జరిగిన జేఈఈ మెయిన్స్ పరీక్షలో హ్యాకింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలున్న ఓ రష్యా పౌరుడిని సీబీఐ అదుపులోకి తీసుకుంది. మిఖాయిల్ షర్గిన్‌పై ఇప్పటికే సీబీఐ లుక్ అవుట్ సర్క్యులర్ జారీ చేసింది. ఇమిగ్రేషన్ బ్యూరో అప్రమత్తం చేయడంతో అజఖిస్తాన్ నుంచి వచ్చిన షర్గిన్‌ను సోమవారం ఢిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో అరెస్ట్ చేసినట్లు సీబీఐ అధికారులు తెలిపారు. హరియాణా రాష్ట్రం సోనెపట్‌లోని జేఈఈ మెయిన్స్ ఆన్‌లైన్ పరీక్షా కేంద్రంలోని కొందరు అభ్యర్థులకు హ్యాకింగ్ ద్వారా సమాధానాలను చేరవేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ గత ఏడాది సెప్టెంబర్‌లోనే అఫినిటీ ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్లతోపాటు మరికొందరిని అదుపులోకి తీసుకుంది. పెద్దమొత్తంలో డబ్బు చేతులు మారిన ఈ వ్యవహారంలో షర్గిన్ ప్రధాన హ్యాకర్‌గా వ్యవహరించినట్లు సీబీఐ అనుమానిస్తోంది. నిందితులు తమను ఆశ్రయించిన జేఈఈ మెయిన్స్ అభ్యర్థుల మార్కుల మెమోలు, యూజర్ ఐడీలు, పాస్‌వర్డులు, పోస్ట్ డేటెడ్ చెక్కులను ముందుగానే సేకరించి ఉంచుకుని, అడ్మిషన్లు పూర్తి చేసుకున్న వారి నుంచి రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షలు వసూలు చేసేవారని సీబీఐ అధికారులు చెప్పారు.

నిలకడగా ములాయం ఆరోగ్యం

గురుగ్రామ్: యూపీ మాజీ సీఎం ములాయం సింగ్ యాదవ్(82) తమ ఇంటెన్సివ్ కేర్ విభాగంలో చికిత్స పొందుతున్నారని మేదాంత ఆస్పత్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ములాయం కొడుకు అఖిలేశ్ యాదవ్ ఆస్పత్రికి ఆదివారం చేరుకున్నారు. 'ఆస్పత్రిలోని ఐసీయూలో చికిత్స పొందుతున్న మన నేత ములాయం ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. ఆయన ఆరోగ్యం గురించి ఎప్పటికప్పుడు సమాచారం వెల్లడి చేస్తాం'అంటూ ట్విట్టర్ ద్వారా పార్టీ కార్యకర్తలు, అభిమానులకు విజ్ఞప్తి చేశారు. ప్రధాని మోదీ, యూపీ సీఎం ఆదిత్యనాథ్ అఖిలేశ్‌తో ఫోన్‌లో మాట్లాడి ములాయం ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారని అధికారులు చెప్పారు.



సోమవారం అహ్మదాబాద్‌లోని సబర్మతీ ఆశ్రమంలో చరఖాతో రాష్ట్రపతి ముర్ము

కొత్త జాతిని గుర్తించిన స్వాంటే పాబో

డెనిసోవన్ పేరిట నూతన హోమినిన్ జాతి
- 'నియాండెర్తల్' జాతి జన్యుక్రమం నమోదు
- హోమోసేపియన్లలో 1–4 శాతం నియాండెర్తల్స్ జన్యుక్రమం



మనిషి కపాలంతో పాబో (ఫైల్)

సాక్షి, హైదరాబాద్: మానవ జాతి పుట్టిందెలా? వానరాల నుంచి అని చెప్పడం సులువే కానీ.. మానవులను పోలిన వానరాలూ బోలెడన్ని ఉండగా పరిణామ క్రమంలో కొన్ని నశించిపోయాయి. కొన్ని అవసరాలకు తగ్గట్టుగా పరిణామం చెందుతూ నేటి ఆధునిక మానవుడు 'హోమో సేపియన్'గా ఎదిగాయి. ఈ అద్భుత పరిణామ క్రమంలో కీలకమైన ఘట్టాలను పరిశోధించి మరీ ప్రపంచానికి తెలియజేసిన శాస్త్రవేత్త స్వాంటే పాబోకు ఈ ఏడాది వైద్యశాస్త్ర నోబెల్ అవార్డు దక్కింది. ఎప్పుడో అంతరించిపోయిన హోమోసేపియన్ దూరపు చుట్టం 'నియాండెర్తల్' జాతి జన్యుక్రమాన్ని నమోదు చేయడంతో పాటు ఇప్పటివరకూ అస్సలు గుర్తించని మరో బంధువు డెనిసోవన్ జాతిని గుర్తించినందుకు ఈ బహుమతి లభించింది. సుమారు 70 వేల ఏళ్ల క్రితం ఆఫ్రికాలో మొదలైన హోమో సేపియన్ల ప్రస్థానంలో పరిణామంతో నియాండెర్తల్, డెనిసోవన్ జాతుల జన్యువులూ చేరాయని, ఈ చేరిక ప్రభావం మనపై ఈ నాటికీ ఉందని పాబో గుర్తించారు. వైరస్, బ్యాక్టీరియా వంటి సూక్ష్మజీవుల కారణంగా వచ్చే జబ్బులకు మన రోగ నిరోధక వ్యవస్థ స్పందించే తీరు మనలో చేరిన నియాండెర్తల్, డెనిసోవన్ జాతి జన్యువులపై ఆధారపడి ఉందని పాబో పరిశోధనలు చెబుతున్నాయి.

ప్రత్యేక శాస్త్ర విభాగం

మానవ పరిణామంపై జరుగుతున్న పరిశోధనల్లో పాబో సరికొత్త శకానికి, విభాగానికి దారి వేశారంలో ఎలాంటి సందేహమూ లేదు. నియాండెర్తల్, డెనిసోవన్ జాతులపై పాబో చేసిన పరిశోధనల కారణంగా ఇప్పుడు 'పాలియో జినోమిక్స్' అనే కొత్త శాస్త్ర విభాగం ఒకటి ఉనికిలోకి వచ్చింది. హోమో సేపియన్లను, మానవుల్లాంటి ఇతర జాతులను (హోమినిన్లు) వేరు చేసే జన్యువులను గుర్తించడం ఈ శాస్త్రం ఉద్దేశం. హోమో సేపియన్లలోని ప్రత్యేక లక్షణాలను గుర్తించడం అన్నమాట.

అంతరించిపోయిన హోమినిన్ జాతి

హోమో సేపియన్లు ఎప్పుడో మూడు లక్షల సంవత్సరాల క్రితం ఆఫ్రికాలో పరిణామించారని పరిశోధనలు చెబుతున్నాయి. అయితే నియాండెర్తల్ జాతి ఆఫ్రికాకు అవతల... స్పష్టంగా చెప్పాలంటే యూరప్, పశ్చిమాసియా ప్రాంతానికి చెందిన వారు. నాలుగు లక్షల ఏళ్ల క్రితం నుంచి ముప్పై వేల ఏళ్ల క్రితం వరకూ వీరి మనుగడ కొనసాగింది. ఆ తరువాత ఈ హోమినిన్ జాతి అంతరించిపోయింది. కానీ, 70 వేల ఏళ్ల క్రితం ఆఫ్రికా నుంచి మధ్యాసియా ప్రాంతానికి వలస వెళ్లిన హోమో సేపియన్లు నియాండెర్తల్ జాతితో కలిశారని పాబో పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. ఆ తరువాతి కాలంలో హోమో సేపియన్లు క్రమేపీ ప్రపంచమంతా విస్తరించారన్నమాట. ఇరు జాతులు యురేసియా ప్రాంతంలో కొన్ని వేల సంవత్సరాల పాటు కలిసి జీవించాయని అంచనా. అయితే ఈ నియాండెర్తల్స్ గురించి మనకు తెలిసింది చాలా తక్కువ. 1990 చివరి నాటికి మానవ జన్యుక్రమ నమోదు పూర్తి కాగా.. హోమినిన్లతో మనకున్న సంబంధాలను వెతకడం మాత్రం మొదలు కాలేదు. నియాండెర్తల్స్ వంటి హోమినిన్ల జన్యుక్రమం ఏదీ అందుబాటులో లేకపోవడం దీనికి కారణం.

అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన పాబో

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నియాండెర్తల్స్ డీఎన్‌ఏను అధ్యయనం చేసేందుకు స్వాంటే పాబో ప్రయత్నించారు. వేల ఏళ్ల క్రితం నాటి.. అంతరించిపోయిన జాతి డీఎన్‌ఏ దొరకడం అంత ఆషామాషీ వ్యవహారం కాదు. కాలక్రమంలో ఆ డీఎన్‌ఏ చాలావరకు నాశనమైపోయి లేశమాత్రమే మిగిలి ఉంటుంది. పైగా బ్యాక్టీరియాతో కలుషితమయ్యే అవకాశాలు చాలా ఎక్కువ. ఈ నేపథ్యంలో ప్రఖ్యాత పరిణామ జీవశాస్త్ర నిపుణులు అలన్ విల్సన్ వద్ద స్వాంటే పాబో పోస్ట్ డాక్టరల్ విద్యార్థిగా నియాండెర్తల్ డీఎన్‌ఏ అధ్యయనానికి శ్రీకారం చుట్టారు. 1990లో జర్మనీలో మ్యూనిక్ యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ పురాతన డీఎన్‌ఏపై పరిశోధనలను కొనసాగించిన పాబో నియాండెర్తల్ మైటోకాండ్రియా నుంచి డీఎన్‌ఏను సేకరించి అధ్యయనం చేయాలని నిర్ణయించారు. క్రోమోజోముల్లోని డీఎన్‌ఏతో పోలిస్తే ఈ మైటోకాండ్రియల్ డీఎన్‌ఏ కాపీలు వేల సంఖ్యలో ఉంటాయి. కాబట్టి విశ్లేషణ విజయవంతమవుతుందని పాబో అంచనా. సుమారు 40 వేల ఏళ్ల క్రితం నాటి నియాండెర్తల్ ఎముక ముక్క నుంచి తొలిసారి ఆయన మైటోకాండ్రియల్ డీఎన్‌ఏను వేరు చేయగలిగారు. ఈ జన్యుక్రమంతో మానవులు, చింపాంజీల జన్యుక్రమాన్ని పోల్చి చూడటం సాధ్యమైంది. కణ కేంద్రక డీఎన్‌ఏను విశ్లేషించి నమోదు చేసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. కొత్త టెక్నాలజీ సాయంతో దాదాపు అసాధ్యమనుకున్న నియాండెర్తల్ జన్యుక్రమ నమోదును 2010లో పూర్తి చేశారు. ఈ జన్యుక్రమాన్ని హోమో సేపియన్ల జన్యుక్రమంతో పోల్చి చూసినప్పుడు ఇరుజాతుల ఉమ్మడి పూర్వ జాతి భూమ్మీద సుమారు ఎనిమిది లక్షల ఏళ్ల క్రితం ఉన్నట్లు తెలిసింది. వేర్వేరు ప్రాంతాల్లోని హోమో సేపియన్ల జన్యుక్రమాలను పోల్చి చూడటం ద్వారా మనకున్న ప్రత్యేకతలు తెలిశాయి. యూరోపియన్, ఆసియాకు చెందిన హోమోసేపియన్లలో 1–4 శాతం జన్యుక్రమం నియాండెర్తల్స్‌దని తెలిసింది.

పరిణామక్రమంపై పరిశోధనలకు నోబెల్

స్వీడిష్ శాస్త్రవేత్త స్వాంటే పాబోకు వైద్య శాస్త్ర నోబెల్

స్టాక్‌హోమ్: వైద్య శాస్త్రంలో స్వీడిష్ శాస్త్రవేత్త స్వాంటే పాబో(67)కు ప్రతిష్టాత్మక నోబెల్ బహుమతి దక్కింది. 2022 సంవత్సరానికి గాను ఆయనను ఈ బహుమతికి ఎంపిక చేసినట్లు నోబెల్ కమిటీ సోమవారం ప్రకటించింది. మానవ పరిణామ క్రమంలో ఆయన సాగించిన విశిష్టమైన పరిశోధనలు ఆదిమ మానవుల (హోమినిన్స్) కంటే ఆధునిక మానవులు ఏ విధంగా భిన్నమో తెలియజేస్తాయని పేర్కొంది. అంతేకాకుండా మనిషి శరీరంలోని రోగ నిరోధక వ్యవస్థ గురించి కీలక విషయాలను బహిర్గతం చేస్తాయని వెల్లడించింది. నియాండెర్తల్స్, డెనిసోవన్స్ వంటి హోమినిన్స్ జన్యువులు, ఆధునిక మానవుడి జన్యువుతు సరిపోల్చి చూసి, రెండింటి మధ్య తేడాలను వివరించే నూతన సాంకేతికతను స్వాంటే పాబో అభివృద్ధి చేశారని నోబెల్ కమిటీ ప్రశంసించింది. స్వాంటే పాబో తండ్రి సూనే బెర్గ్‌స్ట్రామ్ 1982లో వైద్య శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందడం గమనార్హం. పాబో జర్మనీలోని యూనివర్సిటీ ఆఫ్ మ్యూనిక్‌లో, మ్యాక్స్‌ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎవల్యూషనరీ ఆంత్రోపాలజీలో పరిశోధకుడిగా చేశారు. భౌతిక శాస్త్రంలో నోబెల్ విజేతను మంగళవారం, రసాయన శాస్త్రంలో విజేతను బుధవారం, సాహిత్యంలో విజేతను గురువారం, శాంతి బహుమతి విజేతను శుక్రవారం, ఆర్థిక శాస్త్రంలో విజేతను ఈ నెల 10వ తేదీన నోబెల్ కమిటీ ప్రకటించనుంది. నోబెల్ ప్రైజ్ గ్రహీతకు 9 లక్షల డాలర్ల (రూ.7.35 కోట్లు) నగదు అందజేస్తారు. ఈ ఏడాది డిసెంబర్ 10న నోబెల్ బహుమతుల ప్రదానం జరుగనుంది.

సరికొత్త హోమినిన్ గుర్తింపు

స్వాంటే పాబో పరిశోధనల్లో అత్యంత కీలకమైంది.. డెనిసోవన్ అనే సరికొత్త హోమినిన్ జాతి గుర్తింపు. సైబీరియా ప్రాంతంలోని ఓ గుహలో లభించిన 40 వేల ఏళ్ల క్రితం నాటి వేలి ఎముక ఆధారంగా ఇది జరిగింది. మంచులో కప్పబడి ఉండటం వల్ల ఈ ఎముకలోని డీఎన్‌ఏకు పెద్దగా నష్టం వాటిల్లలేదు. ఈ డీఎన్‌ఏ జన్యుక్రమాన్ని నమోదు చేసి నియాండెర్తల్స్, హోమోసేపియన్లతో పోల్చి చూసినప్పుడు అది ప్రత్యేకంగా ఉన్నట్లు తెలిసింది. ఈ సరికొత్త జీవజాతికి డెనిసోవ అని పేరు పెట్టారు. తదుపరి పరిశోధనల్లో డెనిసోవన్, హోమోసేపియన్ల మధ్య జన్యువుల ఆదాన ప్రదానాలు జరిగినట్లు తెలిసింది. హోమో సేపియన్లు ఆఫ్రికా నుంచి బయటకు వచ్చే సమయానికి యూరప్ పశ్చిమ ప్రాంతంలో నియాండెర్తల్స్, తూర్పు ప్రాంతంలో డెనిసోవన్లు ఉండేవారని స్పష్టమైంది. హోమోసేపియన్లు విస్తరిస్తున్న కొద్దీ ఈ రెండు జాతులతో కలవడం కూడా ఎక్కువైంది.

కారుణ్య నియామకం హక్కుకాదు

అది కేవలం ఊరట మాత్రమే: సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: కారుణ్య నియామకం అనేది హక్కు కాదని, బాధితులకు ఊరడింపు మాత్రమేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. హఠాత్ సంక్షోభాన్ని, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోవడానికి బాధిత కుటుంబానికి కారుణ్య నియామకం దోహదపడుతుందని ధర్మాసనం పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ప్రకారం ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో అందరూ సమానమేనని, ఆర్టికల్ 16 ప్రకారం చట్టంలో నిర్దేశించిన నిబంధనల మేరకు ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో అందరికీ సమాన అవకాశాలు కల్పించాలని తేల్చిచెప్పింది. 24 ఏళ్ల క్రితం మృతిచెందిన వ్యక్తి కుమార్తెకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగం ఇవ్వాలంటూ కేరళ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు గతవారం తోసిపుచ్చింది. కేరళలోని ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ ట్రావెన్‌కోర్ లిమిటెడ్‌లో పనిచేసే ఓ వ్యక్తి 1995లో ఏప్రిల్‌లో విధి నిర్వహణలో ఉండగానే మృతిచెందాడు. అప్పట్లో ఆయన కుమార్తె మైనర్. కారుణ్య నియామకం కింద తనకు ఉద్యోగం ఇవ్వాలంటూ మేజరైన తర్వాత ఆమె కంపెనీకి యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. ఇవ్వలేమంటూ యాజమాన్యం స్పష్టం చేసింది. దీంతో ఆమె కేరళ హైకోర్టును ఆశ్రయించింది. బాధితురాలికి కంపెనీలో చేర్చుకోవాలని సింగిల్ జడ్జి తీర్పునిచ్చారు. హైకోర్టు డివిజన్ బెంచ్ సైతం దీన్ని సమర్థించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ కంపెనీ యాజమాన్యం సుప్రీంకోర్టు పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ధర్మాసనం సెప్టెంబర్ 30న తీర్పును వెలువరించింది.

భారత గగనతలంలో అలజడి

న్యూఢిల్లీ: ఇరాన్ నుంచి చైనాకు ప్రయాణిస్తున్న విమానానికి వచ్చిన బాంబు బెదిరింపు కొద్దిసేపు భారత గగనతలంలో ఆందోళన, గందరగోళ పరిస్థితికి దారితీసింది. బాంబు బెదిరింపు వచ్చినప్పుడు ఆ విమానం భారత గగనతలంలో ప్రయాణిస్తోంది. సోమవారం ఉదయం ఇరాన్‌లోని టెహ్రాన్ నుంచి బయల్దేరిన విమానం చైనాలోని గ్వాంగ్జౌకు వెళ్తోంది. ఆది భారత గగనతలంలో ప్రయాణిస్తున్నప్పుడు బాంబు బెదిరింపు వచ్చింది. వెంటనే పాకిస్తాన్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్(ఏటీసీ) అధికారులు ఢిల్లీ ఏటీసీ అధికారులకు సమాచారం చేరవేశారు. అప్రమత్తమైన ఢిల్లీ ఏటీసీ వెంటనే విషయాన్ని భారత వాయుసేనకు తెలిపింది. సుఖోయ్ యుద్ధవిమానాన్ని ఆ మహాన్ డబ్ల్యూ581 ఎయిర్‌బస్ విమానానికి రక్షణగా పంపారు. జైపూర్ లేదా చండీగఢ్ ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండింగ్‌కు అవకాశమిస్తూ మహాన్ విమానం పైలట్లకు ఢిల్లీ ఏటీసీ అధికారులు సూచనలు చేశారు. ప్రయాణికులను భయాందోళనకు గురిచేయలేమంటూ ఈ ప్రతిపాదనను పైలట్లు తోసిపుచ్చారు. ఇదే సమయంలో బాంబు బెదిరింపు ఉత్తిదే అని తేలింది. దీంతో భారత గగనతలంలో చాలా దూరం వరకు సుఖోయ్ రక్షణగా వెంటరాగా విమానం ముందుకుసాగింది.

'లఖీంపూర్ ఖేరి'ని మర్చిపోం.. కేంద్రాన్ని మర్చిపోనివ్వం

నవంబర్ 26న దేశవ్యాప్త నిరసనలు

లఖీంపూర్ ఖేరి: 'లఖీంపూర్ ఖేరి ఘటనను మేం మర్చిపోం. కేంద్ర ప్రభుత్వాన్ని మర్చిపోనివ్వం. మంత్రి అజయ్ మిశ్రాను కేబినెట్ నుంచి తొలగించడం మినహా దేనికీ మేం ఒప్పుకోం'అని భారతీయ కిసాన్ సంఘ్ నేత రాకేశ్ తికాయత్ స్పష్టం చేశారు. యూపీలోని లఖీంపూర్ ఖేరి హింసాత్మక ఘటనలకు ఏడాది పూర్తయిన సందర్భంగా సోమవారం లఖీంపూర్ ఖేరిలోని కౌడియాలా ఘాట్ వద్ద సమావేశమైన రైతులనుద్దేశించి తికాయత్ మాట్లాడారు. సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) నేతృత్వంలో నవంబర్ 26వ తేదీన దేశవ్యాప్తంగా ఆరిప తలపెట్టిన ఆందోళనల్లో మంత్రిని తొలగింపు డిమాండ్ ఉంటుతామని చెప్పారు. అక్రమ కేసులు మోపి జైళ్లలో ఉంచిన నలుగురు రైతులను విడుదల చేయాలన్నారు. ఈ నలుగురు రైతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున సాయంగా అందజేస్తామని చెప్పారు. పంజాబ్ రాష్ట్రం ఫగ్వారాలో జాతీయ రహదారిపై రైతులు నిరసన తెలిపారు. అప్పటి హింసాత్మక ఘటనల్లో అమరులైన, గాయపడిన రైతుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లఖీంపూర్ ఖేరి ఘటనలో బాధిత రైతు కుటుంబాలకు ఇప్పటికీ న్యాయం జరగలేదని రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ పేర్కొన్నారు. 'కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎప్పటిలాగానే నేరస్తుల కొమ్ము కాస్తోంది. న్యాయం జరిగేదాకా రైతుల పోరు ఆగదు. ఆందోళనలు చేస్తున్నప్పటికీ రైతుల పంటలకు కనీస మద్దతు ధర అందడం లేదు. అమరులైన రైతుల కుటుంబాలకు న్యాయం జరగలేదు'అని ట్వీట్లు చేశారు. 3 సాగు చట్టాలను ఉపసంహరించుకోవాలంటూ గత ఏడాది అక్టోబర్ 3వ తేదీన లఖీంపూర్ ఖేరిలో నిరసన తెలుపుతున్న రైతులపైకి ఆజయ్ కుమారుడు ఆశిష్ కారు నడపడం, తర్వాత జరిగిన హింసలో మొత్తంగా 8 మంది చనిపోయారు.

అత్యంత అవినీతి ప్రభుత్వం

కర్ణాటకలో బీజేపీ సర్కార్‌పై రాహుల్



పాదయాత్రలో వృద్ధురాలితో రాహుల్

మైసూరు: దేశంలో అత్యంత అవినీతిమయ ప్రభుత్వం దేశంలో ఏదైనా ఉందంటే అది కర్ణాటకలో బీజేపీ సర్కారే అని కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ ఆరోపించారు. వదరోజుల దసరా సంబరాల్లో మునిగిపోయిన మైసూరు పట్టణానికి భారత్ జోడో యాత్ర చేరుకున్న సందర్భంగా సోమవారం అక్కడ రాహుల్ మాట్లాడారు. '40 శాతం ముడుపులను అలవాటుపడ్డ కర్ణాటక బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి వర్గాన్ని వేధిస్తోంది. ముఖ్యంగా రైతులు, కార్మికులు, చిరు వ్యాపారుల వ్యధలకు అంతేలేదు. ఈ కమీషన్ల వరదపారపై ప్రధానికి గతంలోనే రాష్ట్ర కాంట్రాక్టర్లు ఫిర్యాదుచేశారు. అయినా మోదీ దర్యలు శూన్యం' అని రాహుల్ అన్నారు. మరోవైపు రాహుల్ సోమవారం మైసూరు చాముండి కొండపై చాముండేశ్వరి దేవీ ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. కాగా, గురువారం యాత్రలో పాల్గొనేందుకు సోనియా మైసూరు చేరుకున్నారు.



ఢిల్లీలోని ఎర్రకోటను తలపించేలా కోల్‌కతాలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మంటపంలో లైట్‌షో

పదాధికారులు ప్రచారంలో పాల్గొనొద్దు

న్యూఢిల్లీ: రెండు వారాల్లో పార్టీ అధ్యక్ష పదవికి ఎన్నికలు ఉన్న నేపథ్యంలో ప్రచార కార్యక్రమాలలో పాటించాల్సిన నియమాలను కాంగ్రెస్ పార్టీ వెలువరించింది. 'అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేయాలనుకుంటే ముందుగా పదాధికారులు(ఆఫీస్ బేరర్లు) తమ పదవికి రాజీనామా చేయాలి. పార్టీ ప్రతినిధులు(డెలిగేట్స్) తమకు నచ్చిన అభ్యర్థికి బ్యాలెట్ పేపర్ విధానంలో ఓటు వేయవచ్చు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు, ఇన్‌చార్జ్‌లు, కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులు, పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలు, పార్టీలో ఉన్న పలు విభాగాల అధ్యక్షులు, పార్టీ సెల్స్‌లో ఉన్న వారు, అధికార ప్రతినిధులు... అభ్యర్థికి అనుకూలంగా/వ్యతిరేకంగా ప్రచారం చేయకూడదు. ప్రచారం చేయాలనుకుంటే ముందుగా పార్టీలో తమ పదవికి రాజీనామా చేయాలి' అని పార్టీ కేంద్ర ఎన్నికల ప్రాధికార విభాగం మార్గదర్శకాల్లో పేర్కొంది. అభ్యర్థులు రాష్ట్రాల్లో పర్యటిస్తున్నప్పుడు ఆయా రాష్ట్రాల పీసీసీ చీఫ్‌లు మర్యాదపూర్వకంగా కలవవచ్చని స్పష్టంచేసింది. 'ప్రచారానికి సంబంధించిన సమావేశ మందిరాలు, సౌకర్యాలు, ప్రచార ఉపకరణాలు సమకూర్చవచ్చు. డెలిగేట్స్‌ను ఓటింగ్ స్థలానికి వాహనాల్లో తరలించకూడదు. మార్గదర్శకాలను మీరితే చర్యలు తప్పవు' అని పార్టీ పేర్కొంది.

బెట్టింగ్ సైట్ల ప్రకటనలొద్దు

టీవీ చానళ్లకు కేంద్రం సూచన

న్యూఢిల్లీ: బెట్టింగ్ సైట్లకు సంబంధించిన వాణిజ్య ప్రకటనల ప్రసారంపై కేంద్రం సోమవారం మార్గదర్శకాలను విడుదలచేసింది. 'ఆన్‌లైన్ బెట్టింగ్ సైట్లను వాటికి సంబంధించిన వార్తా వెబ్‌సైట్లను, వాటి ఉత్పత్తులు/సేవల సంబంధ అంశాలను చూపే వాణిజ్య ప్రకటనలు ప్రసారం చేయరాదు'అని న్యూస్ వెబ్‌సైట్లు, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు, ప్రైవేట్ శాటిలైట్ చానళ్లకు కేంద్ర సమాచార, ప్రసార శాఖ సోమవారం సూచించింది. ఈ మార్గదర్శకాలను, చట్టాన్ని అతిక్రమిస్తే తీవ్ర స్థాయిలో చర్యలు ఉంటాయని ప్రైవేట్ శాటిలైట్ చానళ్లను కేంద్రం హెచ్చరించింది. వార్తలను ప్రచురించే పబ్లిషర్లు, డిజిటల్ మీడియాకూ ఇదే తరహా సూచనలిస్తూ విడిగా మార్గదర్శకాలను పంపింది. 'సొంత న్యూస్ వెబ్‌సైట్ల మాటున కొన్ని బెట్టింగ్ సంస్థలు తమకు తాము అడ్వర్‌టైజ్ చేసుకుంటున్నాయి. బెట్టింగ్ సంస్థల లోగోతో ఆ న్యూస్ వెబ్‌సైట్లకూ ఉంటున్నాయి. ఈ వెబ్‌సైట్లు ఏవీ భారత చట్టాలకు లోబడి అధీకృతయంత్రాంగం వద్ద రిజిస్టర్ కాలేదు. తప్పుడు వాణిజ్య ప్రకటనలు, వార్తలు ప్రసారం చేస్తూ బెట్టింగ్, గ్యాంబ్లింగ్‌ను ప్రోత్సహిస్తున్నాయి. వీటిలో కొన్ని స్పోర్ట్స్ న్యూస్ బ్లాగ్‌లు, క్రీడా వార్తల వెబ్‌సైట్లుగా చెలామణి అవుతున్న విషయాన్ని వినియోగదారుల వ్యవహారాల విభాగాలు అప్రమత్తం చేశాం' అని కేంద్ర సమాచార, ప్రసార శాఖ తెలిపింది.

శత్రువుల పాలిట 'ప్రచండ'మే

వైమానిక దళంలోకి అధునాతన, స్వదేశీ తేలికపాటి యుద్ధ హెలికాప్టర్లు



జోధ్‌పూర్ వైమానిక స్థావరంలో ప్రచండ్


సాక్షి, న్యూఢిల్లీ: స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన అధునాతన తేలికపాటి యుద్ధ హెలికాప్టర్ (ఎల్‌సీహెచ్) ప్రచండ్ భారత వైమానిక దళంలో చేరింది. సోమవారం రాజస్తాన్‌లోని జోధ్‌పూర్ వైమానికస్థావరంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్(సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్, ఎయిర్ చీఫ్ మార్షల్ వీఆర్ చౌదరి సమక్షంలో 4 లైట్ కంబాట్ హెలికాప్టర్లను వైమానిక దళంలోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రచండ్‌లో రాజ్‌నాథ్ కొద్దిసేపు ప్రయాణించారు. పర్వతప్రాంతాల్లో, ఎడారి వంటి ప్రతికూల వాతావరణంలో పగలూ, రాత్రి శత్రువులపై దాడి చేయగలగడం ప్రచండ్ ప్రత్యేకత. గగనతలంలోని లక్ష్యాలను గగనతలం నుంచే చేధించగల క్షిపణులను, ట్యాంక్ విధ్వంసక మిస్సైళ్లను, 20 ఎం ఎం తుపాకులను వీటిలో అమర్చవచ్చు. నిమిషానికి 750 తూటాలను పేల్చగల సత్తా వీటి సొంతం. పర్వతప్రాంతాల్లోని శత్రు సైన్యంపై, ట్యాంక్‌లు, బంకర్లు, డ్రోన్‌లపై ఇవి సులభంగా దాడిచేయగలవని ఆర్మీ ఉన్నతాధికారులు చెప్పారు. 22 ఏళ్ల క్రితం భారత్ కన్న కల ఇప్పుడు నెరవేరిందని రాజ్‌నాథ్ అన్నారు. 1999లో పాకిస్తాన్‌తో కార్గిల్ యుద్ధకాలంలో పర్వతప్రాంతాల్లో తేలికపాటి పోరాట హెలికాప్టర్ల ఆవశ్యకతను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం అప్పటి నుంచి చేసిన పరిశోధనల ఫలితమే ప్రచండ్ రూపంలో వచ్చిందన్నారు.

ఇంకొన్ని ప్రత్యేకతలు

ఈ హెలికాప్టర్లు గరిష్ట సంఖ్యలో ఆయుధాలతో పాటు మందుగుండు సామగ్రిని మోసుకెళ్లగలవు. గాలిలో ఎక్కువసేపు ఉండటానికి సరిపడా ఇంధనాన్ని నింపొచ్చు. ఎదురుగా, మంచుమయమైన హిమాలయ పర్వతాల్లోనూ పోరాడగలవు. ట్విన్ ఇంజన్లు ఉన్న ఈ హెలికాప్టర్ బరువు 5.8 టన్నులు. శత్రువుకు కనపడని రంగులో, తక్కువ శబ్దం చేస్తూ, రాడార్లకు, ఇన్‌ఫ్రారెడ్ సెన్సార్లకు చిక్కకుండా వెళ్లగలవు. హెలికాప్టర్లను అధునాతన, పట్టణ ప్రాంతాలలో ఉగ్రవాదులకు అవరోధాలను మోహరించవచ్చు. ఇక సైనిక వెర్షన్‌లో 96 హెలికాప్టర్లను తీసుకోవాలని ఆర్మీ భావిస్తోంది.

దుర్గా మండపంలో విగ్రహం వివాదం

- దుర్గాదేవి పాదాల వద్ద గాంధీజీ రూపురేఖల్లో అసురుడు
- సమర్థించుకున్న అఖిల భారత హిందూ మహాసభ
- వెల్లువెత్తుతున్న విమర్శలు



కోల్‌కతా: శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కోల్‌కతాలో అఖిల భారత హిందూ మహాసభ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గామాత విగ్రహం వివాదానికి కేంద్ర బిందువైంది. త్రిశూలంతో దుర్గామాత వధిస్తున్న మహిషాసురుడు.. గాంధీజీ రూపురేఖల్లో ఉండటమే ఇందుకు కారణం. బట్టతలతో, గుండ్రని కళ్లద్దాలతో ధోతీ ధరించినట్లు ఆ విగ్రహముంది. గాంధీజీని అవమానించారని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ఇలాంటి విగ్రహాన్ని ప్రతిష్ఠించాయని పశ్చిమబెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్‌సహా పలు పార్టీలు తీవ్రంగా విమర్శించాయి. అయితే, ఈ ఘటనను అఖిల భారత హిందూ మహాసభ పశ్చిమబెంగాల్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చంద్రచూర్ గోస్వామి సమర్థించుకున్నారు. 'అసురుడి ముఖం అలా ఉండటం కేవలం యాదృచ్ఛికం. అయినా, ఆ బొమ్మ చేతిలో రక్షణ కవచం ఉంది. గాంధీజీ ఆనేం ధరించడుకదా. అయినా నేతాజీ, భగత్‌సింగ్‌లే నిజమైన హీరోలు. గాంధీజీని విమర్శించాల్సిందే' అని ఆయన వ్యాఖ్యానించారు. ' ఇదే బీజేపీ, సంఘ్ పరివార్ నిజమైన భావజాలం. మిగతాదంతా డ్రామా. మహాత్ముడిని ఇలా అవమానిస్తారా?' అని టీఎంసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కునాల్ ఘోష్ ఆగ్రహం వ్యక్తంచేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు మండపానికి వెళ్లి రాక్షసుడి ముఖాన్ని మరో రూపంలోకి మార్చాలని నిర్వాహకులకు సూచించారు.

సాక్షి
విజయనగరం

మంగళవారం । 4 । అక్టోబర్ । 2022

సైబీరియన్ పక్షుల కిలకిలారావాలు



గజపతినగరం: గజపతినగరం మండలం లోగిశ గ్రామం సైబీరియన్ పక్షులకు నివాస ప్రాంతం. వర్షకాలం వచ్చిందంటే చాలు... వేలకిలోమీటర్ల దూరం నుంచి ఇక్కడి చింతచెట్లపై వాలిపోతాయి. చెరువులు, నదులు, పంట పొలాల్లో ఆహారం కోసం వేట సాగిస్తాయి. చింతచెట్లపై సేదతీరుతాయి. కిలాకిలారావాలతో కనువిందుకలిగిస్తాయి. సంతతిని వృద్ధిచేసుకుని తిరుగుప్రయాణం అవుతాయి. వీటిని తిలకించేందుకు సందర్శకులు లోగిశ గ్రామానికి వస్తుంటారు.

నేడు ల్యాబ్ అటెండెంట్ పోస్టులకు కౌన్సెలింగ్

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ వైద్య కళాశాల, జనరల్ ఆస్పత్రుల్లో ల్యాబ్ అటెండెంట్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని వైద్య కళాశాల ప్రిన్సిపాల్, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ కె.పద్మలీల సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు తమ ఒరిజనల్ ధ్రువపత్రాలతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు.

న్యూస్‌రీల్

క్రీడల్లో రాణిస్తున్న గరివిడి విద్యార్థినులు



క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి శ్రీరామ్ జూనియర్ కళాశాలకు చెందిన సీహెచ్ విశాలాక్షి తూర్పుగోదావరి జిల్లా భీమవరంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి రోప్‌స్కిప్పింగ్ ఫ్రీస్టైల్ విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 15, 16, 17 తేదీల్లో ఢిల్లీలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో తలపడనుంది. అలాగే, ఎం.భవాని, పి.హేమరాణిలు లాంగ్‌జంప్, 100 మీటర్ల పరుగుపందెంలో రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కళాశాలకు చెందిన వి.లావణ్య ఇటీవల జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికై ంది. జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ టి.కమలాకర్, ప్రిన్సిపాల్ ఎం.భాస్కరరావు, అకడమిక్ అడ్వైజర్ బి.రవి, పీడీ బి.శ్రీనివాసరావు, అధ్యాపకులు సోమవారం అభినందించారు.

సీతంలో ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు

- ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు నిర్వహణ
- ఇస్రో–సీతం సంయుక్తంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలు



ప్రదర్శించనున్న అంతరిక్ష నమూనాలతో కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావు

విజయనగరం అర్బన్: ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు సీతం ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్నారు. ఇస్రో–సీతం సంయుక్తంగా నిర్వహించే వారోత్సవాల్లో అంతరిక్ష ప్రయోగాల ప్రయోజనాలు, ఉపగ్రహాల ఉపయోగాలను విద్యార్థులకు తెలియజేసేలా ఉపగ్రహ వాహన నౌకల నమూనాలను ప్రదర్శించనున్నట్టు భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ చైర్మన్ ఎస్.సోమనాథ్, సత్య సంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ఎం.ఝాన్సీలక్ష్మి సోమవారం విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది అంతరిక్షం అనే నినాదంతో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల్లో వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు సోమనాథ్ తెలిపారు. విజయనగరం జిల్లా విద్యాధికారుల ఆధ్వర్యంలో పాఠశాల స్థాయిలో ప్రాథమిక పరీక్ష నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ పోటీలను సీతం కళాశాలలో నిర్వహించనున్నారు. విద్యార్థుల్లో అంతరిక్ష పరిజ్ఞానం పెంపొందించేందుకు, అంతరిక్ష విజయాలను సామాన్యుల చెంతకు తీసుకెళ్లాలన్న లక్ష్యంతోనే ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను షార్ నిర్వహిస్తోంది. పూర్తి వివరాల కోసం సెల్: 70134 07385 నంబర్‌ను సంప్రదించాలని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు తెలిపారు.

విశాఖవెళ్లి.. పింఛన్ అందజేసి...



వేపాడ: ఎరుకులమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శంకరి

వేపాడ: మండలంలోని రామస్వామిపేట గ్రామానికి చెందిన పింఛన్‌దారు కడవాటి ఎరుకులమ్మ అనారోగ్యంతో విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సపొందుతోంది. వలంటీర్ కె.శంకరి ఆమె వద్దకు సోమవారం వెళ్లి అక్టోబర్ నెల పింఛన్ డబ్బులు రూ.2,500లు అందజేశారు. వలంటీర్‌కు ఎరుకులమ్మ కృతజ్ఞతలు తెలిపారు. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో పింఛన్ కోసం పంచాయతీ కార్యాలయం వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేదని, ఇప్పుడు లబ్ధిదారులను వెతుక్కుని పింఛన్ అందజేసే సచివాలయ, వలంటీర్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మనసారా కృతజ్ఞతలు తెలిపారు. వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని సర్పంచ్ వడ్లమాని శర్మ పేర్కొన్నారు.

శరన్నవరాత్రి వైభవం



విజయనగరం పట్టణం రింగ్ రోడ్డులోని నాగమల్లిక స్వగృహంలో బొమ్మల కొలువు



దుర్గాదేవిగా బొబ్బిలి పట్టణానికి సమీపంలోని గొల్లపల్లిలో వెలిసిన దాడితల్లి



తెర్లాం మండలం అరసబలగలో దుర్గాదేవి మంటపం వద్ద సామూహిక కుంకుమ పూజలు

జిల్లాలో శరన్నవరాత్రి పూజలు వైభవంగా సాగుతున్నాయి. దుర్గాదేవికి సోమవారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పసుపు, కుంకుమలు సమర్పించారు. సామూహిక కుంకుమార్చనలు జరిపారు. శతాబ్దాల తరబడి సంప్రదాయం వస్తున్న బొమ్మల కొలువుతో చిన్నారులు సందడి చేశారు. జానపద నృత్యరీతులు, కలియుగ వైకుంఠం, పాలసముద్రంపై విష్ణువు, మానవుని వివిధ దశలను బొమ్మల రూపంలో ప్రదర్శించి మురిసిపోయారు.

– బొబ్బిలి/విజయనగరంటౌన్/తెర్లాం

చెరకు రైతుకు తీపికబురు

- సంకిలి సుగర్ ఫ్యాక్టరీకి చెరకు తరలింపునకు ప్రభుత్వం ఆదేశాలు
- రెండు నుంచి ఐదుకు కాటాల సంఖ్య పెంపు
- త్వరలో మద్దతు ధర ప్రకటించనున్న ఈఐడీ ప్యారీ లిమిటెడ్



రవాణా చార్జీల చెల్లింపు..

ఈఐడీ ప్యారీ ఇండియా కంపెనీకి చెరకు తరలించే రైతులకు దూరాన్ని బట్టి రవాణా చార్జీలను కూడా చెల్లిస్తోంది. గతేడాది భీమసింగి, ఎన్‌సీఎస్‌లకు దూరాన్ని బట్టి చార్జీలు చెల్లిస్తోంది. టన్నుకు రూ.2,900కు పైగా మద్దతు ధర చెల్లించిన కంపెనీ త్వరలోనే ఈ ఏడాది చెల్లించనున్న మద్దతు ధర ప్రకటించనుంది. మద్దతు ధరతో పాటు రవాణా చార్జీలు కలుపుకుని రైతుల ఖాతాలకు నేరుగా నిధులు జమచేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

బొబ్బిలి:

చెరకు రైతులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని భీమసింగి, ఎన్‌సీఎస్ సుగర్ ఫ్యాక్టరీల పరిధిలో రైతులు సాగుచేస్తున్న లక్షా20వేల టన్నుల చెరకు పంటను ఈ ఏడాది కూడా సంకిలిలోని ఈఐడీ సుగర్ ఫ్యాక్టరీకి తరలించేలా ఆదేశాలు జారీ చేసింది. బిల్లులు సకాలంలో చెల్లించాలని సూచించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తొలినుంచీ చెరకు రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. 2015 నుంచి చెరకు రైతులకు బకాయిలు పెడుతూ వస్తున్న ఎన్‌సీఎస్ యాజామాన్యికి చెందిన భూములను ఆర్‌ఆర్ యాక్టు కింద వేలం వేసి బకాయిలు చెల్లించింది. భీమసింగి సుగర్‌ఫ్యాక్టరీ ఇప్పటికే మూతపడగా, ఎన్‌సీఎస్ ఫ్యాక్టరీ కొంత కాలంగా మళ్లీ చెరకు క్రషింగ్ చేస్తామని, అనుమతులివ్వాలని ప్రభుత్వాన్ని కోరింది. అయితే, ఇప్పటికీ కంపెనీ ఓవరాయిలింగ్ చేయలేదు. ప్రభుత్వం సూచించిన విధంగా దాదాపు రూ.10 కోట్ల డిపాజిట్ చేసేందుకు నాన్చుతోంది. దీంతో రైతుల ప్రయోజనాలే పరమావధిగా మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్యేలు శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, అలజంగి జోగారావు, కలెక్టర్ల అందించిన నివేదిక ప్రకారం ప్రభుత్వం తాజాగా నిర్ణయం వెలువరించింది. ఈ ఏడాది కూడా సంకిలి సుగర్‌ఫ్యాక్టరీకి చెరకును తరలించాలని ఆదేశాలిస్తూ బొబ్బిలి సుగర్‌కేన్ డిప్యూటీ కమిషనర్ ఎన్‌వీఎస్ఎస్ సత్యనారాయణకు ఆదేశాలు జారీ చేసింది. జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా విజయనగరం జిల్లా పరిధిలోకి సంకిలిలోని ఈఐడీ ప్యారీ ఇండియా సుగర్స్ వచ్చిన సంగతి తెలిసిందే. ఈ ప్రాంత రైతులు సాగుచేసిన చెరకును ముందస్తుగా తరలించి గతేడాదివలే రైతుల ఖాతాల్లో త్వరగా బిల్లులు చెల్లించాలని ఆదేశాల్లో పేర్కొంది. ప్రభుత్వ సూచనల మేరకు కంపెనీ యాజమాన్యం తన ప్రతినిధులతో సర్వీస్ ఏరియాలను గుర్తిస్తోంది.

ఈ ఏడాది కాటాల సంఖ్య పెంపు!

జిల్లాలో మూతపడిన భీమసింగి, ఎన్‌సీఎస్ సుగర్ ఫ్యాక్టరీల పరిధిలో చెరకు తరలించేందుకు గతేడాది రెండు కాటాలను ఏర్పాటు చేసిన ఈఐడీ ప్యారీ ఈ ఏడాది మరో మూడు కాటాలను (కొనుగోలు కేంద్రాలు)అదనంగా ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతోంది. భీమసింగి పరిధిలో 1500 ఎకరాలు, ఎన్‌సీఎస్ సుగర్స్ పరిధిలో 22 వేల ఎకరాల్లో ఏటా సాగయ్యే చెరకు ఈ ఏడాది కాస్త తగ్గినా చెరకు ఉత్పత్తి మాత్రం గతేడాదిలా లక్ష టన్నులకు తగ్గకుండా తరలించే అవకాశం ఉంది. రెండు సుగర్‌ఫ్యాక్టరీల పరిధిలో లక్షా20వేల టన్నుల చెరకు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉన్నా... సంకిలి సుగర్‌ఫ్యాక్టరీకి దాదాపు లక్ష టన్నుల చెరకు తరలించేందుకు కంపెనీ ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తోంది.

మధ్యవర్తులు లేకుండా...

భీమసింగి, ఎన్‌సీఎస్ సుగర్ ఫ్యాక్టరీల పరిధిలోని చెరకును సంకిలిలోని ఈఐడీ ప్యారీ ఇండియాకు తరలించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆ ప్రకారమే మధ్యవర్తులు లేకుండా చెరకును తరలించేందుకు కసరత్తు చేస్తున్నాం. రైతులు ఈ విషయ్నా గమనించాలని కోరుతున్నాం.

– సత్యనారాయణ, సుగర్‌కేన్ డిప్యూటీ కమిషనర్, బొబ్బిలి

అక్రమార్కులపై ఉక్కుపాదం

- మైనింగ్ అక్రమతరలింపుపై నిఘా
- లక్ష్యాన్ని మించి జరిమానాలు వసూలు
- ఆరు నెలల్లో రూ.40 లక్షల ఫైన్

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లాలోని మైనింగ్ అక్రమ తరలింపుపై మైనింగ్ అధికారులు నిఘా పెంచారు. సమాచారం అందినదే తడవుగా దాడులు చేస్తున్నారు. ఇసుక, మట్టి, ఐరన్ ఓర్ అక్రమ తవ్వకాలకు చెక్ పెడుతున్నారు. లక్ష్యాన్ని మించి జరిమానాలు వసూలు చేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు సుమారు ఆరు నెలల వ్యవధిలో రూ.40 లక్షలు పైబడి జరిమానాలు వసూలు చేశారు.



ఎల్‌కోటలో గ్రావెల్ క్వారీలో తనిఖీ చేస్తున్న మైన్స్ అధికారులు

చర్యలు తప్పవు



మైనింగ్ అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు. గత ఆరు నెలల కాలవ్యవధిలో రోడ్ మెటల్, క్వార్ట్జ ,గ్రావెల్‌ను అక్రమంగా తవ్విని వారిపై చర్యలు తీసుకున్నాం. రూ.40లక్షలు పైగా అపరాధ రుసుం వసూలు చేశాం.

– ఎస్పీ మల్లేశ్వరరావు, ఎ.డి, మైన్స్, విజయనగరం

డిఫాల్టర్	మైనింగ్	అపరాధరుసుం
ఎస్‌వీఎస్ మూకాంబికా కన్‌స్ట్రక్షన్స్ ప్రవేట్ లిమిటెడ్	రోడ్డు మెటల్	రూ.55,463
వీరాంజనేయ బ్లూస్టోన్ క్రషర్	రోడ్డు మెటల్	రూ.1,24,960
శ్రీ కృష్ణమూర్తి స్టోన్ క్రషర్	రోడ్డు మెటల్	రూ.29,885
శ్రీ జి.శివప్రసాద్	రోడ్డు మెటల్	రూ.61,060
మహేశ్వరి స్టోన్‌క్రషర్	రోడ్డు మెటల్	రూ.180,000
సూర్యబ్లాక్‌స్టోన్ క్రషర్	రోడ్డు మెటల్	రూ.85,000
ఎ.వెంకటసుబ్బారావు	రోడ్డు మెటల్	రూ.34,250
కపిల్ కాంక్రీట్స్	రోడ్డు మెటల్	రూ.1,64,194
ఎస్.దుర్గాప్రసాద్	రోడ్డు మెటల్	రూ.33,612
ఐ.రామచంద్రుడు	రోడ్డు మెటల్	రూ.7,00,000
సాయిపరమేశ్వరి స్టోన్‌క్రషర్	రోడ్డు మెటల్	రూ.65,880
సింహాద్రి స్టోన్‌క్రషర్	రోడ్డు మెటల్	రూ.1,53,900
దేవి ఉమామహేశ్వరి స్టోన్‌క్రషర్	రోడ్డు మెటల్	రూ.1,50,243
శ్రీసాయిచైతన్య గ్రానైట్స్	రోడ్డు మెటల్	రూ.61,355
వేగి వెంకటరావు	రోడ్డు మెటల్	రూ.1,00,816
నవదుర్గా స్టోన్‌క్రషర్	రోడ్డు మెటల్	రూ.3,00,425
వాసవీ స్టోన్‌క్రషర్	రోడ్డు మెటల్	రూ.5,02,056
జై వీరాంజనేయ స్టోన్ క్రషర్	రోడ్డు మెటల్	రూ.2,01,598
జెకెమైన్స్	క్వార్ట్జ	రూ.25,000
ఆర్.సునీత	క్వార్ట్జ	రూ.52,112
పీఎస్‌కే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్‌లిమిటెడ్	గ్రావెల్	రూ.7,86,783
ట్రస్ట్ మెటల్స్ అండ్ మినరల్స్	మాంగనీస్, డోలమైట్	రూ.1,45,461
మొత్తం		రూ.40,14,153



చిన్నారుల నృత్యప్రదర్శన

కొండ గుడిలో దసరా సంబరం



అమ్మవారి అవతారంలో నృత్యం చేస్తున్న యువతి

- ప్రభుత్వం ఆధ్వర్యంలో అట్టహాసంగా దసరా ఉత్సవాలు
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు
- భరత నాట్యంతో ఆకట్టుకున్న చిన్నారులు
- అందరిపైనా దుర్గమ్మ ఆశీస్సులు ఉండాలి: రాజన్నదొర

పార్వతీపురం టౌన్:

గిరిజన సంప్రదాయ నృత్యాలు.. జానపద కళారూపాలు.. శాస్త్రీయ నృత్య ప్రదర్శనల నడుమ పార్వతీపురంలో సోమవారం నిర్వహించిన దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగాయి. పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కలెక్టర్ నిషాంత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఉత్సవాల్లో ముఖ్య అతిథులుగా డిప్యూటీసీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ పాలవలవిక్రాంత్, ఎమ్మెల్యే అలజంగి జోగారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ కొత్త జిల్లాలో దసరా ఉత్సవాలు నిర్వహించడం సంతోషదాయకమన్నారు. ముందుగా ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపారు. దుర్గమ్మ ఆశీస్సులు అందరిపైనా ఉండాలన్నారు. జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కలిసికట్టుకు కృషిచేద్దామన్నారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ మంచిపై విజయం సాధించడమే విజయదశమి పండగ అంతర్థామని, ప్రజలంతా అభివృద్ధి పథంలో పయనించాలని ఆకాంక్షించారు. రాష్ట్రప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి అండగా ఉండామన్నారు. కలెక్టర్ నిషాంత్‌కుమార్ మాట్లాడుతూ పర్యాటక రంగంతో పాటు అన్ని రంగాల్లో మిగతా జిల్లాలకు దీటుగా జిల్లా అభివృద్ధి బాటలో పయనించేందుకు సమన్వయంతో పనిచేద్దామని పిలుపునిచ్చారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా...

దసరా ఉత్సవాలు సోమవారం ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు వినోదాత్మకంగా సాగాయి. జానపద కళారూపాలు థింసా నృత్యం , తప్పెట గుళ్లు, కోలాట ప్రదర్శనలు, ఢీ బృందం ఆటాపాటా, రాజేశ్వరి బృందం లోటస్ డ్యాన్స్, జట్టు సంస్థ శాస్త్రీయ నృత్యాలు, జబర్దస్త్ టీం సభ్యులు రాజమౌళి, తన్మయి, గెడ్డం నవీన్‌ల హాస్యభరిత సన్నివేశాలు, ఆంధ్రా, రాజస్థాన్, కేరళ రాష్ట్రాల వస్త్రధారణలు చూపరులను ఆకట్టుకున్నాయి. వినోదాన్ని పంచాయి. బంగీ రన్నింగ్, ఆర్చరీ, డార్ట్ గేమ్, గన్‌షాట్, బాల్‌పూల్, ట్రంపోలైన్, స్లైడింగ్ బౌన్స్ తదితరవి చిన్నారులను అలరించాయి. నారాయణపురం చేనేత, పొందూరు ఖాదీ వస్త్ర ప్రదర్శన, ఐటీడీఏ పరిధిలోని వన్‌ధన్‌వికాస్ కేంద్రాల ఉత్పత్తులు, డ్వాక్రా, గిరిజన ఉత్పత్తులు కొనుగోలుదారులను ఆకర్షించాయి. వెలుగు విభాగం ఏర్పాటు చేసిన చెక్క బొమ్మలు, వెదురు బొమ్మలు, సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో సవర ఆర్ట్స్, మన్య దీపిక రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ చిరుధాన్యాలు, గోగునారు ఉత్పత్తులను ప్రదర్శించాయి. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ భావన, డీఎఫ్‌ఓ ప్రసూన, అడిషనల్ ఎస్పీ దిలీప్‌కిరణ్, డీఆర్‌ఓ జె.వెంకట్రావు, ఆర్డీఓ హేమలత, డీఎస్పీ శ్రావణి, మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ తదితరులు పాల్గొన్నారు.



చీరకట్టులో... తెలుగమ్మాయి...



తప్పెట గుళ్ల కళాకారుల పిరమిడ్ విన్యాసం



ఉత్సవంలో మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

క్లుప్తంగా

ఫైర్ డీజీ మాదిరెడ్డి ఆకస్మిక పర్యటన



5 కిలోమీటర్ల పరుగులో పాల్గొన్న ఫైర్ డీజీ మాదిరెడ్డి ప్రతాప్

విజయనగరం క్రైమ్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల స్పందన, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్ సోమవారం ఆకస్మిక జిల్లా పర్యటన చేశారు. ఉదయం ఫైర్ సిబ్బంది, యువతతో కలిసి ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు రాజీవ్ స్టేడియం నుంచి సన్ స్కూల్ వరకు 5 కిలోమీటర్ల పరుగు నిర్వహించారు. అనంతరం ఆస్పత్రుల్లో అగ్నిమాపక సేవలపై, స్కూల్ అసోసియేషన్స్‌తో ఎస్‌వీఎన్ హోటల్‌లో సమావేశమై వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖలో విశేషమైన సేవలందించిన అగ్నిమాపక సిబ్బంది ఎస్‌వీ.ప్రసాద్, రమేష్‌వర్మ, రామకృష్ణలను దుశ్శాలువతో ఘనంగా సత్కరించి, అభినందించారు. కార్యక్రమంలో రీజనల్ ఫైర్ అధికారి శ్రీనివాసులు, జిల్లా అగ్నిమాపక అధికారి కె.వినయ్, సహాయక జిల్లా అగ్నిమాపక అధికారి వి.సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

లోటస్ డయాగ్నోస్టిక్స్‌తో సెంచూరియన్ ఒప్పందం

నెల్లిమర్ల రూరల్: విశాఖపట్నానికి చెందిన లోటస్ డయాగ్నోస్టిక్స్‌తో సెంచూరియన్ విశ్వవిద్యాలయం సోమవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు సెంచూరియన్ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు, లోటస్ డయాగ్నోస్టిక్స్ ప్రతినిధి దేవరపు కాత్యాయని పరస్పర అవగాహన ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. వీసీ జీఎస్ఎన్ రాజు ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజానికి మంచి పౌరులను అందించాలనే లక్ష్యంతోనే ప్రముఖ సంస్థలతో ఎంఓయూలు కుదుర్చుకుంటున్నామ న్నారు. దీని వల్ల విద్యార్థులు ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు చేసుకునేందుకు వీలవుతుందని చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమణారావు, డీన్ ఆచార్యులు పాల్గొన్నారు.

36 మద్యం సీసాలు, సారాతో ఒకరి అరెస్టు



సారా, మద్యం సీసాలతో ఎస్ఈబీ అధికారులు, సిబ్బంది

బొబ్బిలి: పది లీటర్ల సారా, 36 మద్యం సీసాలతో పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం గ్రామానికి చెందిన కూర్మదాసు విశ్వేశ్వరరావును అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ సీఐ ఆర్ జైభీమ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సారా, మద్యం బాటిళ్లను సీతానగరం మండలంలోని బూర్జ గ్రామానికి చెందిన విశ్వేశ్వరరావు ఒడిశా నుంచి తీసుకువచ్చినట్టు గుర్తించామన్నారు. త్వరలోనే ఆ వ్యక్తిని కూడా పట్టుకుంటామని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అబ్బనీ కమ్మని దబ్బ..!

- మన్యంలో పుల్లదబ్బ సీజన్ ఆరంభం
- కావిడి ధర రూ.200–300
- 100 టన్నుల వరకు దిగుబడి
- 200 ఎకరాల్లో కొండపోడులో సాగు
- మైదాన ప్రాంతాల్లో డిమాండ్



గిరిజనులు పండించిన పుల్లదబ్బ



ట్రేలలో ఎగుమతికి సిద్ధంగా ఉంచిన వ్యాపారులు

సీతంపేట: మన్యంలో పుల్లదబ్బ సీజన్ ఆరంభమైంది. ఈ ఏడాది దిగుబడి పెరగడంతో మైదాన ప్రాంతాల వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. అంతగా పెట్టుబడులు అక్కర్లేక పోవడంతో భామిని, సీతంపేట ఏజెన్సీలో సుమారు 2 వందల ఎకరాల వరకు పంటను కొండపోడు వ్యవసాయంలో గిరిజనరైతులు పండిస్తారు. అక్కడక్కడ పోడులో వీటిని వేస్తారు. సుమారు 100 టన్నుల వరకు దిగుబడి వస్తుందని అంచనా. కావిడ దబ్బ రూ. 200 నుంచి రూ.300 వరకు విక్రయిస్తున్నామని గిరిజనులు తెలిపారు. గతేడాది ఇదేసీజన్లో ఒక్కో కావిడి ఇవే ధరలకు అమ్మేవారమని గిరిజనులు చెబుతున్నారు. హడ్డుబంగి, సోమగండి, గొయిది, శంభాం, కుశిమి, పెదరామ తదితర పంచాయతీల పరిధిలో దబ్బ ఎక్కువగా పండుతుంది.

వారపు సంతల్లో విక్రయాలు

ఒక్కో పుల్ల దబ్బ పండు మైదాన ప్రాంతాల్లో ఒక రూపాయికి విడిగా విక్రయిస్తారు. ఇక్కడ ఒక్కో పండు అర్ధరూపాయికి సరాసరి కొనుగోలు చేసిన వ్యాపారులు పట్టణాల్లో కిలోల వంతున విక్రయిస్తారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, ఒరిశా ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ఇక్కడికి వచ్చి కొనుగోలు చేస్తారు. సీతంపేటలో సోమవారం, మర్రిపాడులో బుధవారం, గురువారం దోనుబాయిలో కుశిమి, పొల్ల గ్రామాల్లో శనివారం వారపు సంతలకు వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. మరి కొందరు వ్యాపారులు నేరుగా గ్రామాలకే వెళ్లి ఖరీదు చేస్తున్నారు. పుల్లదబ్బ ఎక్కువగా పచ్చళ్లు తయారు చేసే చిన్నతరహా కంపెనీలకు విక్రయిస్తామని వ్యాపారులు చెబుతూ గిరిజన రైతులు నిర్ణయించిన ధరలు కాకుండా సిండికేట్‌గా మారి ధర నిర్ణయిస్తారు. దీంతో వారు చెప్పిన ధరలకు గిరిజనులు విక్రయించాల్సి ఉంటుంది. కొన్ని గ్రామాల్లో గిరిజనులు ముందుగా వ్యాపారుల నుంచి అడ్వాన్స్‌లు తీసుకుంటారు. పంట పక్వానికి వచ్చే సమయంలో వ్యాపారులకు సరుకు అప్పగిస్తారు.

వ్యాపారుల ధరకే విక్రయిస్తున్నాం



పైనాపిల్, సీతాఫలం తర్వాత ఆదాయాన్ని ఇచ్చేది దబ్బ పంట. కావిళ్లలో మోసుకుని తీసుకువస్తాం. వ్యాపారులు నిర్ణయించిన ధరకు అమ్మకాలు చేస్తున్నాం. – ఎస్.రైకన్న, అక్కన్నగూడ

పంట దిగుబడి బాగుంది



ఈ సంవత్సరం పంట దిగుబడి బాగుంది. కొండపోడు వ్యవసాయంలో పండిస్తాం కాబట్టి సేకరణ కష్టంగా ఉంటుంది. ఈ సీజన్ వచ్చేనెల వరకు ఉంటుంది. ఒడిశా వ్యాపారులు ఎక్కువగా కొనుగోలు చేస్తారు. – ఎస్.ఎల్లంగో, మెట్టుగూడ

ముచ్చటగా మూడో స్థానం

- బాల్‌బ్యాడ్మింటన్ రాష్ట్ర పోటీల్లో జిల్లా మహిళల సత్తా
- చిత్తూరు జిల్లాలో జరిగిన పోటీలు



రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో తృతీయ స్థానం సాధించిన జిల్లా మహిళల జట్టు

తెర్లాం: రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల పురుషులు, మహిళల సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లాకు చెందిన మహిళల జట్టు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 2వరకు చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తిలో మూడు రోజులపాటు నిర్వహించిన 8వ రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లాకు చెందిన పురుషులు, మహిళల జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో మహిళల జట్టు రాణించి రాష్ట్రస్థాయిలో తృతీయస్థానం సాధించి జిల్లాకు మంచిపేరు తీసుకువచ్చింది. మహిళల బాల్ బ్యాడ్మింటన్ జట్టు మరిన్ని రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని విజయం సాధించాలంటూ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు మహిళా జట్టు సభ్యులను అభినందించారు. బాల్ బ్యాడ్మింటన్ జిల్లా మహిళల జట్టు టీమ్‌కు అడ్వయిజరీ బోర్డు మెంబర్స్‌గా జగ్గారావు, సుందరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా శ్రీనివాసరావు, పీడీ, కోచ్‌లుగా నెమలాం, అజ్జాడ హైస్కూల్స్ పీడీలు జి.సింహాచలం, బి.సతీష్ వ్యవహరించారు.

సీఎం కప్ తైక్వాండో పోటీల్లో జిల్లాకు పతకాలు



సీఎం కప్ తైక్వాండో పోటీల్లో సాధించిన పతకాలతో జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన సీఎం కప్ తైక్వాండో పోటీలలో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. గత నెల 29 నుంచి ఈనెల 2వతేదీ వరకు జరిగిన అంతర్ జిల్లాల పోటీల్లో మొత్తం 16 పతకాలు దక్కించు కున్నారు. గోల్డ్ 3, సిల్వర్ 3, బ్రాంజ్ 10 పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు, కార్యదర్శి వేణుగోపాలరావులు సోమవారం అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించి జిల్లా పేరు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింప జేయాలని ఆకాంక్షించారు.

మూడు దుకాణాలు దగ్ధం



బొద్దాంలో అగ్నిప్రమాదంలో బూడిదైన దుకాణాలు

వేపాడ: మండలంలోని బొద్దాం జంక్షన్ వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు దుకాణాలు దగ్ధమయ్యాయి. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో జరిగిన ప్రమాదంలో ఎస్.తాతారావు టైలరింగ్ షాపుతో పాటు షాపులో ఉన్న బట్టలు మొత్తం కాలిపోయాయి. అలాగే ఎం.శంకర్ బార్బర్ షాపు, పర్నిచర్, జె.జగ్గుబాబు పాన్‌షాపుతో పాటు అందులో ఉన్న సరుకులు ఫ్రిజ్ బూడిదయ్యాయి. ఈ మూడు షాపుల్లో జరిగిన ఆస్తినష్టం సుమారు రూ.పది లక్షలు ఉంటుందని బాధితులు వాపోతున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఉపాధితో పాటు సర్వం కోల్పోయామని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 435.00
విజయనగరం	రూ. 439.00
శ్రీకాకుళం	రూ. 439.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	50,200–00
బంగారం(22సి. 10గ్రా.)	46,000–00
వెండి (కిలో)	60,700–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹133	₹236	₹ 246

గంజాయి తాగుతూ పట్టుబడిన నిందితులు

- కిలో గంజాయి స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలింపు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ఎల్.అప్పలనాయుడు



పట్టుబడిన గంజాయిని సీజ్‌చేసిన పోలీస్‌లు

గజపతినగరం: మండలంలోని పురిటి పెంట న్యూకాలనీ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెనుక భాగంలో ఆరిశెట్టి బాబ్జీ రైస్‌మిల్ సమీపంలో గంజాయి తాగుతూ పట్టుబడిన ముగ్గురు నిందితులతో పాటు వారికి విక్రయించిన వ్యక్తిని సోమవారం అదుపులోకి తీసుకున్నామని స్థానిక సీఐ ఎల్ అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు ఆయన విలేకరులతో మాట్లాడుతూ గంజాయి తాగుతున్నట్లు సమాచారం అందగానే సంఘటనా స్థలానికి ఎస్సై గంగరాజు, సిబ్బంది చేరుకుని నిందితులు, విక్రేతతో పాటు, 1000 గ్రాముల గంజాయి, రూ. 500 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుల్లో బి.సతీష్(డోశపాలెం),ఎమ్.అభిరామ్ (మానాపురం),బి.చైతన్య, (గజపతినగరం పురిటిపెంటన్యూకాలనీ) ఎం. వెంకటాపురం గ్రామానికి చెందిన విక్రేత బగ్గా శ్రీనివాసరావులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. . సమావేశంలో ఎస్సై గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తికి తీవ్రగాయాలు



చికిత్సపొందుతున్న రమేష్

పార్వతీపురం టౌన్: కదులుతున్న రైలు నుంచి దిగుతూ జారిపడి కొమరాడ మండలానికి చెందిన చింతాడ రమేష్ గాయాలపాలయ్యాడు. సోమవారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. కూలి పని చేసుకునే రమేష్ పని నిమిత్తం రాయగడ వెళ్లి తిరుగు ప్రయాణంలో రాయగడ, గుంటూరు ఎక్స్‌ప్రెస్‌లో వస్తుండగా, గుమడ రైల్వేస్టేషన్ దగ్గర నెమ్మదిగా వెళ్తున్న రైలు నుంచి ప్లాట్‌ఫాంపై గెంతడంతో పడిపోయి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన రైల్వే సిబ్బంది 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉరివేసుకుని మహిళ ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన చంద్రకళ(ఫైల్)

దెంకాడ: మండలంలోని గొడిపాలెం గ్రామానికి చెందిన ఒమ్మి చంద్రకళ(31) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై మహేష్ సోమవారం తెలిపారు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని డి.కొల్లాం గ్రామానికి చెందిన చంద్రకళకు, గొడిపాలెం గ్రామానికి చెందిన ఈశ్వరరావుతో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. ఆ దంపతులకు ఈక్షిత్, శశిధర్ అనే ఇద్దరు చిన్నారులు ఉన్నారు. ఆదివారం సాయంత్రం చంద్రకళ గొడిపాలెం గ్రామంలోని ఇంటిలో ఉరివేసుకుని ఉండడాన్ని గమనించిన కుటుంబసభ్యులు ఆమె తల్లిదండ్రులకు సమాచారం చేరవేశారు. దీంతో భర్త ఈశ్వర్రావు వేధింపుల కారణంగానే తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడినట్లు చంద్రకళ తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు ఈశ్వర్రావుపై వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మహేష్ తెలిపారు. తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి సమక్షంలో శవ పంచనామా చేసినట్లు వివరించారు.

వ్యక్తి ఆత్మహత్యా యత్నం

జామి: మండలకేంద్రంలో ఇల్లు కొనుగోలు విషయంలో మోసపోయానని మనస్తాపానికి గురైన స్థానికుడైన సూరెడ్డి ఎర్నాయుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సోమవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. ఎర్నాయుడు బజార్ సెంటర్‌లో టిఫిన్ కొట్టు పెట్టుకుని జీవిస్తున్నాడు.అదే గ్రామానికి చెందిన జామి అప్పలరాజు అనే వ్యక్తి ఇల్లు అమ్మేస్తానని చెప్పడంతో జె.వెంకటరమణ అనే వ్యక్తి మధ్యవర్తిత్వం ద్వారా ఎర్నాయుడు ఇల్లు కొనుగోలుకు ఒప్పందం చేసుకున్నాడు. ఇందుకోసం రూ.9లక్షలు చెల్లించాడు. ఇంటిని రిజిస్ట్రేషన్ చేయాలని ఎంత అడిగినా అప్పలరాజు ముందుకురాకపోవడంతో అనుమానం వచ్చి ఎర్నాయుడు ఆరా తీశాడు. అప్పటికే అప్పలరాజుకు రూ.7లక్షలు రుణం ఉందని తెలిసింది, ఇతరుల దగ్గర కూడా అప్పులు చేసి తీర్చలేక భార్యతో పాటు ఇతర ప్రాంతానికి రహస్యంగా వెళ్లిపోయిన విషయం తెలుసుకున్న ఎర్నాయుడు మోసపోయానని భావించాడు. అధికారులు, పెద్దలు న్యాయం చేయాలని కోరుతూ లేఖ రాసి సోమవారం టిఫిన్ దుకాణంలో ఉరి వేసుకున్నాడు. స్థానికులు గమనించి 108 వాహనంలో విజయనగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.





రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి



మృతిచెందిన ఆటో డ్రైవర్ ప్రకాష్

పార్వతీపురం టౌన్: రాయగడ నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే రైలునుంచి జారిపడి పార్వతీపురం బెలగాం రైల్వే గేటు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడని జీఆర్‌పీ హెచ్‌సీ వి.రమణ తెలిపారు. మృతుని శరీరం గుర్తుతెలియని విధంగా ఉండడంతో వివరాలు తెలియలేదన్నారు. మృతునికి తెల్లజుత్తు, తెల్లగెడ్డం, సుమారు 50నుంచి 60 సంవత్సరాలు ఉంటాయని, గులాబీరంగు లాల్చీ వేసుకుని ఉన్నాడని తెలిపారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే పార్వతీపురం బెలగాం రైల్వేస్టేషన్ వద్ద ఉన్న జీఆర్‌పీ ఔట్‌పోస్టులో సంప్రదించాలని కోరారు.

ఆటో బోల్తాపడి డ్రైవర్..

మండలంలోని తాళ్లబురిడి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పైలా ప్రకాష్(25) గ్రామంనుంచి పార్వతీపురం పట్టణానికి ఆటోడ్రైవ్ చేసుకుంటూ వస్తుండగా బోల్తా పడి మృతి చెందాడు. సోమవారం జరిగిన ఈ ప్రమాదంపై రూరల్ ఎస్సై సింహాచలం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామం నుంచి ప్రయాణికులను తీసుకుని వస్తున్న ఆటో పెదబొండపల్లి గ్రామ సమీపంలో బోల్తా పడడంతో ప్రమాదం జరిగి డ్రైవర్ ప్రకాష్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటోలో ఉన్న ఐదుగురు ప్రయాణికుల్లో నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. మరో ప్రయాణికురాలు ద్వారపురెడ్డి లక్ష్మికి తీవ్ర గాయాలవడంతో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రకాష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు రూరల్ ఎస్సై తెలిపారు.



రైతులకు కేంద్రం అన్యాయం



రాస్తారోకో చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

- వ్యవసాయ కార్మిక సంఘం నేతల ధర్నా

శృంగవరపుకోట: రైతుల మెడకు ఉరితాడు వేసి చోద్యం చూస్తున్నట్లు కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి ఉందని వ్యవసాయ కార్మిక సంఘం నేతలు ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వ్యవసాయ కార్మిక సంఘం నేతలు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం కార్యదర్శి బి.రాంబాబు మాట్లాడుతూ వ్యవసాయ చట్టాల రద్దు, విద్యుత్ బిల్లుల్లో రైతులకు నష్టం కలిగించే అంశాల సవరణ, మద్దతు ధరలపై చట్టం, ఉద్యమ సమయంలో కేసులు, ఉద్యమంలో చనిపోయిన 750మంది రైతుల కుటుంబాలను ఆదుకుంటున్నట్లు అందజేసిన లిఖిత పూర్వక హామీలను తుంగలో తొక్కి, వ్యవసాయ చట్టాలను వెనుక నుంచి తీసుకొస్తున్న కేంద్రం ఇప్పటికైనా రైతుల్ని మోసం చేసే చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల డిమాండ్లు నెరవేర్చకుంటే దేశవ్యాప్తంగా ఆందోళనలు, ఉద్యమాలకు సిద్ధమై ఢిల్లీలో రైతులు బుద్ధి చెప్పిన తీరుగా మోడీ సర్కారుకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్.ఆదినారాయణమూర్తి, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మద్దిల రమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాడి అప్పారావు, రైతు సంఘం జిల్లా నాయకులు గేదెల శ్రీను, కలిశెట్టి సన్నిబాబు, కె.దేముళ్లు, మామిడి ఈశ్వరరావు తదితరులు హాజరయ్యారు.

క్లుప్తంగా

పాలిథిన్ విక్రయాలపై ప్రత్యేక నిఘా

విజయనగరం: నగరంలో పాలిథిన్, ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగంపై ప్రజారోగ్య శాఖ నిఘాను పటిష్టం చేసింది. దసరా, పైడితల్లి అమ్మవారి ఉత్సవాల నేపథ్యంలో క్యారీ బ్యాగులు, నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలు, వినియోగం ఎక్కువగా జరుగుతాయన్న ముందస్తు ఆలోచనతో దాడులను విస్తృతం చేసింది. సచివాలయ పరిధిలో ప్లాస్టిక్ విక్రయాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. పట్టుబడిన వ్యాపారులకు జరిమానా విధిస్తున్నారు.

6న మండల సర్వసభ్య సమావేశం

నెల్లిమర్ల: ఈనెల 6న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ అంబళ్ల సుధారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10.30గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని విభాగాలకు చెందిన అధికారులు హాజరుకావాలని సూచించారు.

చురుగ్గా పారిశుధ్య పనులు



కాలువల్లో చెత్తను తొలగిస్తున్న దృశ్యం

విజయనగరం: ఈ నెల 10,11 తేదీలలో జరగనున్న పైడితల్లి జాతర నేపథ్యంలో కార్పొరేషన్ సిబ్బంది పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. మినీ జేసీబీలు, బాబ్‌కార్టుల సహాయంతో ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగిస్తున్నారు. కాలువల నుంచి వెలికితీస్తున్న చెత్తను వెనువెంటనే లారీల ద్వారా తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. కమిషనర్ ఆర్.. శ్రీరాములనాయుడు ఆదేశాల మేరకు ప్రధాన కాలువలను పరిశుభ్రం చేయడంతో పాటు వీధులలో ఉన్న కాలువలలో పూడికతీతను ముమ్మరం చేస్తున్నారు.

ఆధ్యాత్మికతను పెంపొందించాలి

విజయనగరం టౌన్: ఆధ్యాత్మిక విలువలు పెంపొందించే దిశగా టీటీడీ, ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నట్లు టీటీడీ ప్రొగ్రామింగ్ అధికారి జె.శ్యామ్ సుందర్ తెలిపారు. శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా స్థానిక కోట సత్తెమ్మతల్లి ఆలయంలో సోమవారం మహిళలతో లలితా సహస్రనామ పారాయణం, భజనలు నిర్వహించారు. అనంతరం వై.శిఖామణి భాగవతారిణితో పార్వతీకల్యాణం హరికథా గానాలాపన నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు రాంజీ, జి.తిరుపతిరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తరగతులు నిర్వహించడం దారుణం

విజయనగరం ఫూల్‌బాగ్: దసరా సెలవుల్లో కూడా పలు జూనియర్ కళాశాలల్లో తరగతులు నిర్వహించడం దారుణమని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హర్ష అన్నారు. ఈ మేరకు సోమవారం పలు కళాశాలలను సందర్శించి తరగతులు నిర్వహించడంపై ప్రశ్నించారు. దసరా సెలవులు ఇవ్వని కళాశాలల గుర్తింపు రద్దు చేస్తామని అధికారులు చెబుతున్నా, కొన్ని కార్పొరేట్ కళాశాలలు తరగతులు నిర్వహించడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు జె.రవికుమార్, కె.జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



అన్న సంతర్పణ కార్యక్రమం ప్రారంభిస్తున్న చిక్కాల, తదితరులు

నెల్లిమర్ల: ఉత్సవాలతో అన్నివర్గాల ప్రజల మధ్య సామరస్య వాతావరణం నెలకొంటుందని వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల నగర పంచాయతీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, వైస్‌చైర్మన్ కారుకొండ వెంకట కృష్ణారావు అన్నారు. పట్టణంలోని రామతీర్థం జంక్షన్‌లో శ్రీ విజయదుర్గ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత బూర సత్యనారాయణ, నిర్వాహక కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ చేయూత సంబరాలు

జామి: స్థానిక ఉన్నతపాఠశాల ఆవరణలో మంగళవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ చేయూత మూడోవిడత సంబరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సతీష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్ తెలిపారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎస్.కోట, గజపతినగరం ఎమ్మెల్యేలు కడుబండి శ్రీనివాసరావు, బొత్స అప్పలనరసయ్య పాల్గొంటారని చెప్పారు.

చీపురుపల్లిలో..

స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో చీపురుపల్లి, గరివిడి మండలాలకు సంబంధించి వైఎస్సార్ చేయూత మూడోవిడత సంబరాలను మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు సోమ వారం ఓ ప్రకటనలో తెలిపారు.

అడుగడుగునా సరస్వతీ నిలయాలు..

- విద్యాలయాలకు నిలయంగా భాసిల్లుతున్న నెల్లిమర్ల ప్రాంతం
- వైద్య కళాశాల, యూనివర్సిటీ, డైట్, గురుకుల కళాశాలల ఏర్పాటు
- అందుబాటులో కేజీ నుంచి పీజీ వరకు కోర్సులు



సెంచూరియన్ యూనివర్సిటీ

నెల్లిమర్ల:

విద్యాలయాలకు నిలయంగా నెల్లిమర్ల ప్రాంతం భాసిల్లుతోంది. ఈ ప్రాంతంలో కేజీ నుంచి పీజీ వరకు కోర్సులు అందుబాటులో ఉన్నాయి. జిల్లాలోనే ఏకైక వైద్య కళాశాల, యూనివర్సిటీ, ప్రభుత్వ డైట్ కళాశాల, పలు గురుకుల కళాశాలలు, పాఠశాలలు ఈ ప్రాంతంలో నెలకొల్పారు. త్వరలోనే ప్రభుత్వ డిగ్రీ కళాశాల కూడా ఈ ప్రాంతంలోని విద్యార్థులకు అందుబాటులోకి రానుంది. వివరాల్లోకి వెళితే.. జిల్లాలో ఏకైక వైద్య కళాశాల మిమ్స్ నెల్లిమర్ల పట్టణంలోనే ఉంది. రెండు దశాబ్దాల కిందట ఈ కళాశాలను ఇక్కడ ప్రారంభించారు. ఎంబీబీఎస్‌తో పాటు హోమియో, ఫార్మా, బీఎస్సీ నర్సింగ్‌తో పాటు పలు పారా మెడికల్ కోర్సులు ఈ కళాశాలలో అందుబాటులో ఉన్నాయి. దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఇక్కడ వేర్వేరు కోర్సులను అభ్యసిస్తున్నారు. ప్రతి ఏటా వేలాది మంది విద్యార్థులు ఈ కళాశాల నుంచి వివిధ డిగ్రీ పట్టాలను అందుకుంటున్నారు. ఇప్పటికే వేలాది మంది నిష్ణాతులైన వైద్యులను ఈ కళాశాల అందించింది.

సెంచూరియన్ యూనివర్సిటీ ఈ ప్రాంతంలోనే

ఒడిశా రాష్ట్రానికి చెందిన సెంచూరియన్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఈ ప్రాంతంలోనే ఉంది. నెల్లిమర్ల మండలంలోని టెక్కలి గ్రామ పరిధిలో 2016లో యూనివర్సిటీని నెలకొల్పారు. ఇంజినీరింగ్ డిగ్రీలో ఏడు రకాల కోర్సులు, బీఎస్సీలో ఆరు రకాల కోర్సులతో పాటు బ్యాచిలర్ ఆఫ్ మేనేజ్‌మెంట్, బీకాం, తదితర డిగ్రీ కోర్సులు ప్రస్తుతం ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. వివిధ జిల్లాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు ఈ యూనివర్సిటీలో విద్యనభ్యసిస్తున్నారు. ఈ యూనివర్సిటీ పదుల సంఖ్యలో పరిశ్రమలు, సంస్థలతో ఎంఓయూ కుదుర్చుకుని, ఉద్యోగాల కల్పనకు అవకాశం కల్పిస్తోంది.

ప్రభుత్వ డైట్ కళాశాల పట్టణంలోనే



ప్రభుత్వ డైట్ కళాశాల

జిల్లాలో ఏకైక విద్యా శిక్షణా సంస్థ (ప్రభుత్వ డైట్ కళాశాల) పట్టణంలోని వేణుగోపాలపురంలోనే ఉంది. సుమారు మూడు దశాబ్దాల కిందట ఈ కళాశాలను ఇక్కడ నెలకొల్పారు. ప్రతి ఏటా వందలాదిమంది విద్యార్థులు ఈ కళాశాలలో ఉపాధ్యాయ శిక్షణ పొందుతారు. రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన వేలాదిమంది విద్యార్థులు ఈ కళాశాలలో శిక్షణ పొంది ఉద్యోగాలు సాధించారు. అంతేగాకుండా ఉపాధ్యాయులకు అవసరమైన శిక్షణ సైతం ఈ కళాశాలలో అందిస్తారు.

అందుబాటులో గురుకులాలు..



ఎంజేపీఏపీ బీసీ బాలికల గురుకుల కళాశాల

పట్టణంలో పలు గురుకుల కళాశాలలు, పాఠశాలలు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. మహాత్మ జ్యోతిబా పూలే బీసీ బాలికల కళాశాల, పాఠశాలను సుమారు మూడు దశాబ్దాల కిందటే ఇక్కడ ప్రారంభించారు. ప్రత్యేకించి మత్స్యకార బాలుర కోసం ప్రత్యేకంగా ఎంజేపీఏపీ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాలను ఐదేళ్ల కిందట ఇక్కడ ప్రారంభించారు. స్థానిక వేణుగోపాలపురంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల, పాఠశాలను కూడా మూడు దశాబ్దాల కిందటే నెలకొల్పారు. అలాగే గిరిజన బాలుర కోసం ఆశ్రమ పాఠశాల, బాలికల కోసం కస్తూరిబా పాఠశాల, సతివాడలో మోడల్ పాఠశాల, కళాశాలలున్నాయి.

60 ఏళ్ల కిందటే జూనియర్ కళాశాల..




సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల

పట్టణంలో 60 ఏళ్ల కిందటే ప్రభుత్వ జూనియర్ కళాశాలను నెలకొల్పారు. స్థానిక నెల్లిమర్ల జూట్‌మిల్లు స్థాపకులు చోటియా, కనోరియా జ్ఞాపకార్థం సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభమైంది. ఈ కళాశాలలో చదువుకున్న వేలాదిమంది విద్యార్థులు పలు ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. పలువురు ఉన్నతమైన రాజకీయ పదవులను అలంకరించారు. కళాశాలతో పాటు ఇదే ప్రాంగణంలో ఉన్నత పాఠశాలను కూడా నెలకొల్పారు.

త్వరలోనే ప్రభుత్వ డిగ్రీ కళాశాల

పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. నియోజకవర్గానికి ఒకటి చొప్పున డిగ్రీ కళాశాలను అందుబాటులోకి తీసుకురావాలన్న ప్రభుత్వ ఆదేశాలతో, నియోజకవర్గ కేంద్రమైన నెల్లిమర్లలో కళాశాల స్థాపనకు సంబంధిత అధికారులు చర్యలు చేపడుతున్నారు. కళాశాల ప్రారంభమైతే ఈ ప్రాంతంలో కేజీ నుంచి పీజీ వరకు ప్రభుత్వ విద్య సైతం అందుబాటులోకి రానుంది.

లైట్లు వేశారు... కనెక్షన్ మరిచారు...



పూసపాటిరేగ ఫ్లైఓవర్

పూసపాటిరేగ: మండల కేంద్రం మీదుగా వెళ్లే జాతీయ రహదారిపై ఉన్న ఫ్లై ఓవర్‌పై లైట్లు వేసి కనెక్షన్ మరిచారు. చాలా కాలం కిందటే లైట్లు వేసినప్పటికి కనెక్షన్ ఇవ్వకపోవడంతో రాత్రి వేళల్లో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నిత్యం ఫ్లైఓవర్ సర్వీస్ రహదారి మీదుగా వంద లాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. హైవే కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్లే లైట్లు వెలగడం లేదని వాహన చోదకులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లైట్లుకు కనెక్షన్ ఇవ్వాలని కోరుతున్నారు. దీనిపై హైవే అధికారి పవన్ వద్ద ప్రస్తావించగా చర్యలు తీసుకుంటామన్నారు.

బాలకృష్ణన్ ఆశయ సాధనకు కృషి

విజయనగరం ఫూల్‌బాగ్: సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు, కేరళ రాష్ట్ర మాజీ కార్యదర్శి కామ్రేడ్ కొడియేరి బాలకృష్ణన్ మృతికి సీపీఎం విజయనగరం జిల్లా కమిటి సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో బాలకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ, బాలకృష్ణన్ విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు భావాలు కలిగి విద్యార్థి సంఘ అభివృద్ధికి కృషి చేశారన్నారు. అలాగే సీపీఎం నాయకుడిగా, ఎమర్జెన్సీ కాలంలో 16 నెలల జైలు జీవితాన్ని అనుభవించారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కృష్ణ,జగన్ మోహన్, బి.రమణ, కె. సురేష్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆనందమే లక్ష్యం



సీఎం జగన్ సందేశ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

లక్కవరపుకోట: పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల ముఖా ల్లో ఆనందం చూడడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నా రు. మండలంలోని సీతారాంపురం సచివాలయం పరిధి కళ్లెంపూడి గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం సోమవారం నిర్వహించా రు. ఎమ్మెల్యే కడుబండి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. గ్రామస్తు లు ఆయన దృష్టికి తీసుకువచ్చిన సమస్యల్లో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్ని సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తా నని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడ తూ గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని స్థాపించడమే ధ్యేయంగా సీఎం జగన్ గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను నెలకొల్పారని చెప్పారు. అర్హులందరికీ పథకాలను పారదర్శకంగా వారి ఇంటి ముంగిటకే అందిస్తున్నామని అన్నారు. సామాజిక పింఛన్‌లను లబ్ధిదారులకు ప్రతి నెలా ఒకటోతేది ఉదయాన్నే తలుపు తట్టి అందిస్తున్నామని, దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కానన్ని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో అమలు చేస్తున్నామని వివరించారు. నాడు -నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలలు, ఆస్పత్రులను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఎంపీపీ గేదెల శ్రీనివాస రావు, సీనియర్ నాయకులు కూరాకుల సూర్యారా వు, ఏడువాక వెంకటరమణ, గ్రామ మాజీ సర్పంచ్ లు వాకాడ సూర్యనారాయణ, వాకాడ రామకృష్ణ, జగ్గన్నదొర పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అందరిపైనా జగన్మాత ఆశీస్సులు

- నగరంలోని వివిధ ఆలయాల్లో పూజలు నిర్వహించిన కోలగట్ల



దుర్గాదేవికి పూజలు చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: దుర్గామాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆకాంక్షించారు. నగరంలోని న్యూ పూర్ణ జంక్షన్ టాక్సీ స్టాండ్‌లో శరన్నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన దుర్గామాతను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల సోమవారం దర్శించుకున్నారు. ఆ తర్వాత పాత బస్టాండ్ లోని శతకోటి సూర్యతేజ దుర్గామాత ఆలయాన్ని, శంకరమఠంలోని దుర్గామాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, కార్పొరేటర్ గుజ్జల నారాయణరావు, ఆయా ప్రాంతాల నిర్వాహకులు టీవీ శ్రీనివాసరావు, ద్వాదశి వేణు, కార్పొరేటర్ ద్వాదశ సుమతి, పార్టీ నాయకులు సైలాడ సత్యనారాయణ, లంక మహేష్, తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం..



దొడ్డిబాడువాలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స, తదితరులు

- ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స

డెంకాడ: రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండల కేంద్రమైన డెంకాడ పంచాయతీలోని దొడ్డిబాడువ, చందకపేట గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, తదితరులు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాల వల్ల పొందిన లబ్ధిని వివరించారు. ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, అర్హతే ప్రామాణికంగా పథకాలు మంజూరు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన లాంటి పథకాల అమలుతో మన రాష్ట్రానికి దేశంలోనే గుర్తింపు వచ్చిందన్నారు. వివిధ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారిని కూడా ఆర్థికంగా ఆదుకుంటున్న ఘనత జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, సొసైటీ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం, ఎంపీడీఓ స్వరూపారాణి, పలువురు అధికారులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలకు పటిష్ట భద్రత

- కలెక్టర్ సూర్యకుమారి



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

నెల్లిమర్ల: ఈవీఎంలకు పటిష్ట భద్రత కల్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎ. సూర్యకుమారి ఆదేశించారు. పట్టణంలోని మిమ్స్ సమీపంలోనున్న ఈవీఎం గోదాములను ఆర్‌డీఓ ఎం.గణపతిరావుతో కలిసి సోమవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బందోబస్తుపై ఆరా తీశారు. ఆమె వెంట నెల్లిమర్ల తహసీల్దార్ కేవీ రమణరాజు, నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీప్రసాద్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మహేష్, సీపీఐ నాయకుడు తాలాడ సన్నిబాబు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న తమ్మిన సిస్టర్స్ గాత్ర కచేరి



గాత్ర కచేరీ నిర్వహిస్తున్న తమ్మిన సిస్టర్స్

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడి ఆవరణలో సప్తస్వరాలయం స్కూల్ ఆఫ్ మ్యూజిక్ విద్యార్థులు తమ్మిన సిస్టర్స్ గాత్ర కచేరీ ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. శాస్త్రీయ సంగీతంలో భాగంగా పలు భజన కీర్తనలను చిన్నారులు షణ్ముఖప్రియ, సాహితీప్రియ ఆలపించారు. వయోలిన్‌పై రవికుమార్ సహకరించారు. అనంతరం ఆలయ సిబ్బంది వారిని ఘనంగా సత్కరించారు.

వికేంద్రీకరణతోనే సమాన అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

- విశాఖలోనే పరిపాలన రాజధాని ఏర్పాటు చేయాలి
- అమరావతి రైతులది రెచ్చగొట్టే యాత్ర
- టీడీపీ నేతల బుద్ధి మారాలని 5న పైడితల్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు
- ఏపీ డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: పరిపాలన వికేంద్రీకరణతోనే అన్ని ప్రాంతాల అభివృద్ధి సాధ్యపడుతుందని ఏపీ డిప్యూటీ స్పీకర్, విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రకటించిన విధంగా మూడు రాజధానుల్లో భాగంగా విశాఖను పరిపాలన రాజధానిగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం తన నివాసంలో విజయనగరం నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మాట తప్పని, మడమ తిప్పని నేతగా గుర్తింపు పొందారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం విశాఖను పరిపాలనా రాజధానిగా ఏర్పాటు చేస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కొందరి స్వార్థ ప్రయోజనాల కోసం అమరావతి రైతులు చేస్తున్న పాదయాత్ర ఉత్తరాంధ్ర ప్రజలను రెచ్చగొట్టే విధంగా ఉందని వ్యాఖ్యానించారు. అమరావతిలో రాజధాని ఏర్పాటు చేస్తే బాగుపడేది టీడీపీ నేతలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులేనని ఆరోపించారు.

ప్రత్యేక పూజలు

విశాఖలో పరిపాలన రాజధాని ఏర్పాటుపై ఉత్తరాంధ్ర టీడీపీ నేతల బుద్ధి మారాలని కోరుతూ ఈ నెల 5న విజయనగరంలోని పైడితల్లమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు కోలగట్ల తెలిపారు. పైడితల్లి జాతర అనంతరం నియోజకవర్గ స్థాయిలో చర్చావేదిక నిర్వహించడంతో పాటు అమరావతి రైతుల పాదయాత్రకు నిరసనగా జిల్లా కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. అలాగే పార్టీ సంస్థాగత కమిటీ నియామకాల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓం దుర్గా నమోస్తుతే..!



మహంకాళీదేవిగా కనకమహాలక్ష్మి అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో వనంగుడిలో కొలువైన దుర్గాదేవి



పూజలందుకుంటున్న గాజులరేగ సాలివీధి దుర్గాదేవి

విజయనగరం టౌన్: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా దుర్గాష్టమిని పురస్కరించుకుని అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు సోమవారం దర్శనమిచ్చారు. రైల్వేస్టేషన్ వద్దనున్న పైడితల్లి అమ్మవారి వనంగుడిలో కొలువైన దుర్గమ్మకు ఆలయ వేదపండితులు వెలువలపల్లి నరసింహాచార్యులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. గాజులరేగల సాలివీధిలో కొలువైన దుర్గాదేవికి జాంగ్రీలు, పుష్పాలతో అలంకరించారు. సిటీబస్టాండ్ వద్దనున్న కనకమహాలక్ష్మి అమ్మవారు మహంకాళీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఈ నెల 7న ద్విచక్రవాహనం వేలం

చీపురుపల్లి: మద్యం అక్రమ రవాణా కేసులో పోలీసులు సీజ్ చేసిన ద్విచక్ర వావనాన్ని జిల్లా ఎస్పీ ఎం.దీపిక ఆదేశాల మేరకు స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఈనెల 7న బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

2019 జూలై 20న మద్యం అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడిన కేసులో ఏపీ 35 హెచ్ 5792 నంబర్ గల హీరోహోండా ఫ్యాషన్ ప్లస్ బైక్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్, బొబ్బిలి డీఎస్పీ సమక్షంలో నిర్వహించనున్న బహిరంగ వేలంలో ఆసక్తి గల వారు పాల్గొనవచ్చని సూచించారు.

వికేంద్రీకరణకు మద్దతుగా దసరా పూజలు

- మాజీ మంత్రి కృష్ణదాస్ పిలుపు
- 108 కొబ్బరికాయలు కొట్టిన పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి


కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పోలాకి: రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు సమగ్రంగా అభివృద్ధి చెందాలన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా.. వికేంద్రీకరణకు మద్దతుగా దసరా రోజున ప్రత్యేక పూజలు చేయాలని వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ సోమవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. సీఎం సంకల్పానికి దేవుడి ఆశీర్వాదం కూడా తోడుకావాలని కోరుతూ పూజలుచేయాలని ఆయన సూచించారు. మండల పార్టీ అధ్యక్షులు తమ పరిధిలోని నేతలను, కార్యకర్తలను సమన్వయం చేసుకుని పూజలు చేయాలన్నారు. అలాగే, శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, కేంద్ర మాజీమంత్రి కిల్లి కృపారాణి, కళింగ కార్పొరేషన్ చైర్మన్ తిలక్‌లు మూడు రాజధానులకు మద్దతుగా సోమవారం పార్టీ కార్యకర్తలను చైతన్యం చేశారు. మరోవైపు.. పాతపట్నం నీలమణి దుర్గ ఆలయంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి మూడు రాజధానులు కోరుతూ 108 కొబ్బరికాయలు కొట్టారు.

అన్ని ఆలయాల్లో కొబ్బరికాయలు కొట్టండి

- విజయదశమి రోజున రాష్ట్రమంతా వికేంద్రీకరణకు ప్రార్థించాలి
- మంత్రి వేణు, మాజీమంత్రి కన్నబాబు పిలుపు

సాక్షి ప్రతినిధి, రాజమహేంద్రవరం: వికేంద్రీకరణను ఆకాంక్షిస్తూ రాష్ట్రంలో ప్రతిఒక్కరూ విజయదశమి రోజున కుల, మతాలకు అతీతంగా అన్ని ఆలయాల్లోను ప్రార్థించి కొబ్బరికాయలు కొట్టాలని మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీమంత్రి కురసాల కన్నబాబు పిలుపునిచ్చారు. ఇంతకంటే మంచి రోజు మరొకటి రాదన్నారు. రాజమహేంద్రవరంలో సోమవారం వారిద్దరూ మీడియాతో మాట్లాడారు. ఏ రోజూ ప్రజల కోసం ఆలోచించని చంద్రబాబుకు సద్బుద్ధి వచ్చేటట్లు, వికేంద్రీకరణకు మద్దతిచ్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది కొబ్బరికాయలు కొట్టాలన్నారు. అమరావతి నుంచి అరసవిల్లి వరకు రైతుల ముసుగులో బూటకపు పాదయాత్ర చేపట్టిన చంద్రబాబు బృందానికి ఆ దేవుడే సరైన బుద్ధి చెబుతారని వారన్నారు. పాదయాత్రతో అరసవిల్లి వెళ్లే వారు సూర్యభగవానుడ్ని ఏమని కోరుకుంటారని.. అమరావతి మాత్రమే బాగుండాలని కోరుకుంటారా.. లేక, రాష్ట్రమంతా సుభిక్షంగా ఉండాలని కోరుకుంటారా.. అని వేణు, కన్నబాబు ప్రశ్నించారు. అందుకే పాదయాత్ర చేస్తూ అరసవల్లి వెళ్లే వారు ఏమి కోరుకున్నా సూర్యభగవానుడు మాత్రం మెజార్టీ ప్రజల అభీష్టమైన వికేంద్రీకరణకే ఆశీర్వదిస్తారని పేర్కొన్నారు.

ఒకేసారి డబుల్ డిగ్రీలు

ఒకే సమయంలో రెండు కోర్సులపై యూజీసీ మార్గదర్శకాలు

- కొత్త విధానం అమలుకు ఉన్నత విద్యాసంస్థలకు సూచనలు
- జాతీయ నూతన విద్యా విధానానికి అనుగుణంగా నూతన పంథా

సాక్షి, అమరావతి: జాతీయ నూతన విద్యావిధానాన్ని అనుసరించి దేశవ్యాప్తంగా విద్యార్థులు ఏకకాలంలో రెండు కోర్సులు అభ్యసించేందుకు వీలుగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ మార్గదర్శకాలు జారీచేసింది. పీహెచ్‌డీ మినహా మిగిలిన కోర్సులకు నిబంధనలను అనుసరించి వీటిని విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని సూచించింది. అన్ని వర్సిటీలు, ఇతర ఉన్నత విద్యాసంస్థలు ఈమేరకు చర్యలు చేపట్టాలని తాజాగా ఆదేశించింది. ఈమేరకు జాతీయ విద్యా విధానం 2020 విధానాల్లో పూర్తిగా మార్పులు చేయాలని సూచించింది. విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ (ఓడీఎల్) విధానంలో నచ్చిన కోర్సులను అభ్యసించేందుకు అవకాశం కల్పించాలని, ఆన్‌లైన్ విద్య కార్యక్రమాలను సిద్ధం చేయాలని ఆయా విద్యాసంస్థలను యూజీసీ ఆదేశించింది.



ఇవీ మార్గదర్శకాలు

- ఒక విద్యార్థి ఫిజికల్ మోడ్‌లో రెండు విద్యా కార్యక్రమాలను పూర్తి సమయం కొనసాగించవచ్చు. తరగతి సమయాలు భిన్నంగా ఉండేలా చూడాలి.
- విద్యార్థి రెండు విద్యా కార్యక్రమాలను ఒకేసారి కొనసాగించవచ్చు. ఒకటి పూర్తి సమయం భౌతికంగా మరొకటి ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ (ఓడీఎల్)/ఆన్‌లైన్ మోడ్‌లో చేయవచ్చు. లేదా రెండూ ఓడీఎల్/ఆన్‌లైన్ ప్రోగ్రామ్‌లలో ఏకకాలంలో అభ్యసించవచ్చు.
- ఓడీఎల్/ఆన్‌లైన్ మోడ్ కింద డిగ్రీ లేదా డిప్లొమా ప్రోగ్రామ్‌లు యూజీసీ/చట్టబద్ధ సంస్థలు, ప్రభుత్వాలు గుర్తించిన కార్యక్రమాలకే పరిమితం కావాలి. ప్రభుత్వ అనుమతి ఉన్న సంస్థలే వీటిని చేపట్టాలి.



- యూజీసీ నోటిఫికేషన్ జారీ చేసినప్పటి నుంచి ఈ కొత్త విధానం అమల్లోకి వస్తుంది. ఇప్పటికే రెండు డిగ్రీలు చదువుతున్న విద్యార్థులు ఎవరైనా ఉంటే యూజీసీ నిబంధనలను అనుసరించి అనుమతి పొందాలి.

నూతన విధానం లక్ష్యాలు

- విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ఏకకాలంలో రెండు విద్యా కార్యక్రమాలను కొనసాగించేందుకు అనుమతించాలి.
- సైన్స్, సోషల్ స్టడీస్, ఆర్ట్స్ సహా ఇతర విభాగాల్లో అవకాశం కల్పించాలి.
- భాష, ప్రొఫెషనల్, టెక్నికల్, వొకేషనల్ విషయాలను కూడా అందుబాటులోకి తేవాలి.
- నచ్చిన అంశాలను నేర్చుకోవడంతోపాటు ఆసక్తి ఉన్న ఒకటి లేదా అంతకంటే ఎక్కువ అంశాలలో క్షుణ్నంగా అధ్యయనానికి వీలు కల్పించాలి.

వికేంద్రీకరణే లక్ష్యం

- అన్ని ప్రాంతాలూ బాగుండాలి: సజ్జల రామకృష్ణారెడ్డి
- అందులో అమరావతి ఒక భాగంగా ఉండాలి
- వేర్పాటువాదం తలెత్తకుండా ఉండేందుకే 3 రాజధానులు
- దీనికి అన్ని ప్రాంతాల ప్రజల మద్దతు బలంగా ఉంది
- చంద్రబాబు బృందం దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి
- వికేంద్రీకరణకు అమ్మవారి ఆశీస్సులు కోరుతూ 5న దేవాలయాల్లో పూజలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్దేశించిన వికేంద్రీకరణే ఏకైక మంత్రం అని, పార్టీ రాజకీయ లక్ష్యం అధికార వికేంద్రీకరణేనని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షులు, శాసనసభ్యులు, నియోజకవర్గ సమన్వయకర్తలతో వైఎస్సార్‌సీపీ సోమవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియచేశారు. అమ్మవారి ఆశీస్సులతో సీఎం జగన్ పాలనలో రాష్ట్రం బాగుండాలని, ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.



సమగ్రంగా తెలియచేద్దాం..

మన రాజకీయ లక్ష్యం అధికార వికేంద్రీకరణే. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు బాగుండాలనేదే సీఎం జగన్ ఉద్దేశం. అందులో అమరావతి ఒక భాగంగా ఉండాలి. మూడు రాజధానులకు ప్రజల మద్దతు ఉంది. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి అదే ఏకైక మంత్రం. వికేంద్రీకరణే నినాదంగా ప్రజల్లోకి వెళ్లాలి. రాజధాని ఒకటే ఉండాలంటూ చంద్రబాబు, దోపిడీకి అలవాటుపడిన ఆయన ముఠా చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి. భవిష్యత్తులో మళ్లీ వేర్పాటువాదం తలెత్తకుండా ఉండేందుకే మూడు రాజధానులు. ప్రజలకు వికేంద్రీకరణపై మరింత సమగ్రంగా తెలియజేయాలి.

దుర్మార్గపు పోకడలను తిప్పికొట్టేలా..

వికేంద్రీకరణ సామాజిక అభివృద్ధికి దోహదం చేస్తుంది. దీనికి మద్దతు ఇచ్చే వారితో చేయి కలిపి ప్రజల్లో చర్చ జరిగేటట్లు చేయాలి. టీడీపీ దుర్మార్గపు పోకడలను తిప్పికొట్టేలా కార్యాచరణ తయారు చేసుకోవాలని ఇటీవల సమావేశాల్లో సీఎం జగన్ దిశానిర్దేశం చేశారు. పార్టీ సీనియర్ నేతలతో చర్చించి ఈ కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించాం.

దశమి రోజు దేవాలయాల్లో పూజలు

ఈ నెల ఐదో తేదీన విజయదశమి రోజు రాష్ట్రంలోని అన్ని దేవాలయాలలో పెద్ద ఎత్తున పూజలు జరగాలి. కొబ్బరి కాయలు కొట్టి వికేంద్రీకరణకు అమ్మవారి ఆశీస్సులు కావాలని కోరుకోవాలి. సీఎం జగన్ రాష్ట్రంపైన, ప్రజలపైన మమకారంతో తెచ్చిన వికేంద్రీకరణ అజెండాకు అమ్మవారి ఆశీస్సులు కోరాలి. రాష్ట్రం అంతటికీ ప్రయోజనం చేకూరే ఆలోచనకు అమ్మవారి ఆశీస్సులు పొందాలి. దుర్మార్గమైన ఆలోచనలు చేసే చంద్రబాబు, టీడీపీ నేతల మనసు మారాలని ప్రార్థన చేయాలి. వికేంద్రీకరణవైపు వారి మనసు మళ్లేలా చేయాలని అమ్మవారిని వేడుకోవాలి. ఈ పూజలు విజయదశమి రోజు రాష్ట్రం అంతటా ప్రతిధ్వనించేలా చేయాలి.

రెచ్చగొట్టేందుకే యాత్ర

చంద్రబాబు ప్రకటించిన అమరావతి ఎండమావి లాంటిది. ఎప్పటికీ ఆచరణలోనికి రానిది. వికేంద్రీకరణకు వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టేందుకు టీడీపీ ఆధ్వర్యంలో తిరుపతికి పాదయాత్ర చేశారు. ఈరోజు అరసవెల్లికి పాదయాత్ర చేస్తున్నారు. అలజడులు సృష్టించటమే వారి లక్ష్యం. రాష్ట్ర ప్రజల కష్టాన్ని 29 గ్రామాల గోతుల్లో పోయాలంటున్నారు. మరి రాష్ట్రంలో 5 కోట్ల మంది పరిస్థితి ఏమిటి? పాదయాత్ర పేరుతో టీడీపీ నిర్వహిస్తున్న దండయాత్ర తూర్పు గోదావరి జిల్లాలోకి ప్రవేశించింది. ఇక్కడ్నుంచి విశాఖ మీదుగా అరసవల్లి వరకు వెళ్తుంది. ఈలోపు ప్రతిచోటా ఈ దండయాత్ర తప్పు అని ప్రజలకు తెలిసేలా చేయాలి. టీడీపీ ధోరణి వివిధ వర్గాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెడుతోందని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి.

దసపల్లా భూములపై ఆరోపణలు అవాస్తవం

- భూ యజమానులు, ప్రైవేటు సంస్థల మధ్యే వ్యాపార ఒప్పందాలు
- ఇది పూర్తిగా ప్రైవేటు వ్యవహారం
- ఇందులో ప్రభుత్వం, ప్రజాప్రతినిధులకు సంబంధంలేదు
- రాజకీయ పక్షాలు, మీడియావి తప్పుడు ఆరోపణలు
- ఉమ్మడి ప్రకటనలో ప్లాట్ల యజమానులు, వ్యాపారులు స్పష్టీకరణ

దొండపర్తి (విశాఖ దక్షిణ): దసపల్లా భూములపై ప్రతిపక్షాలు, ఒక వర్గం మీడియా చేస్తున్న ఆరోపణలను విశాఖకు చెందిన ప్లాట్ల యజమానులు తీవ్రంగా ఖండించారు. ఈ భూములు ప్రైవేటు వ్యక్తులకు సంబంధించినవని.. ఇందులో డెవలప్‌మెంట్ అగ్రిమెంట్లు సదరు భూ యజమానులు, కొన్ని ప్రైవేటు సంస్థల మధ్యే జరిగాయని స్పష్టంచేశారు. ఇవి పూర్తిగా ప్రైవేటు వ్యాపార అంశమన్నారు. ప్రభుత్వ పెద్దల ఒత్తిళ్ల మేరకు ఈ ఒప్పందాలు జరిగాయనడంలో ఎలాంటి వాస్తవం లేదని దసపల్లా ప్లాట్ల యజమానులు దసపల్లా రాఘవేంద్రరావు, దసపల్లా కోటేశ్వరరావు, వేములపల్లి సందీప్, చల్లా వీరరాఘవులు, దాట్ల సుబ్బరాజు, జాస్తి శరత్‌బాబు తదితరులు విడుదల చేసిన ఉమ్మడి ప్రకటనలో పునరుద్ఘాటించారు. దసపల్లా భూములకు దసపల్లా మహారాణి కమలాదేవి, ఆమె కుమారుడు దిగ్విజయ్ చంద్రదేవ్ భంజ్ హక్కుదారులని తెలిపారు. ఇదే విషయం దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కూడా 2012లో ధ్రువీకరించిందని గుర్తుచేశారు. దసపల్లా భూముల విషయంలో హక్కుదారులు ప్రభుత్వ ఒత్తిళ్లతోనే కొన్ని ప్రైవేటు సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నారని కొన్ని రాజకీయ పక్షాలు, మీడియా చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమన్నారు. ముఖ్యంగా ఈ విషయంలో రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి, అతని కుటుంబ సభ్యులకు ఎలాంటి సంబంధంలేదని స్పష్టంచేశారు. ఈ ప్రైవేటు భూముల వ్యాపార ఒప్పందంలో ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు సంబంధంలేదన్నారు.

దసపల్లా భూములపై సుప్రీం ఆదేశాల ప్రకారమే

- టీడీపీ అనుకూల మీడియా అసత్య కథనాలను ఖండిస్తున్నాం: విజయసాయిరెడ్డి
- దసపల్లా భూముల్లో శాశ్వత భవనాన్ని నిర్మిస్తున్న టీడీపీ
- రాణి కమలాదేవితో టీడీపీ కుమ్మక్కై శాశ్వత నిర్మాణం చేపట్టినట్లా?

సాక్షి, అమరావతి: విశాఖ దసపల్లా భూముల్లో 82 ఎకరాలకు సంబంధించి టీడీపీ హయాంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు, అప్పటి అడ్వకేట్ జనరల్ సూచనల మేరకే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. ఈ భూముల విషయంలో టీడీపీ అనుకూల పత్రికలు అసత్య కథనాలు ప్రచురించటాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు సోమవారం ఢిల్లీలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

- దసపల్లా భూముల వివాదంపై వివిధ అప్పీళ్ల దశలు ముగిసిన అనంతరం హైకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశాలను సుప్రీం కోర్టు ఆమోదించింది. సర్వే నెంబర్ 1197, 1196, 1028, 1027 భూములకు రాణి కమలాదేవిని యజమానిగా నిర్ధారిస్తూ సుప్రీం కోర్టు తీర్పు వెలువరించింది. దీన్ని తప్పనిసరిగా అమలు చేయడం మినహా మరో మార్గం లేదని 2015 ఫిబ్రవరి 25న టీడీపీ హయాంలోనే సుప్రీం కోర్టు అడ్వకేట్ జనరల్ వేణుగోపాల్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. కొందరు వ్యక్తుల స్వార్థ ప్రయోజనాల కోసం కొన్ని పత్రికలు దీనిపై తప్పుడు కథనాలు ప్రచురించాయి.
- గతంలో సర్క్యూట్ హౌస్ (ప్రభుత్వ అతిథి గృహం), తూర్పు నౌకా దళంతోపాటు ఇతర కార్యాలయాల ఏర్పాటుకు సేకరించిన దసపల్లా భూములకు ప్రభుత్వం పరిహారం చెల్లించింది. అవి ప్రభుత్వ భూములైతే పరిహారం చెల్లించాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో వాటికి వచ్చిన నష్టమేమీ లేదు. వాటిని కూల్చేస్తారంటూ కొందరు చేస్తున్నది కేవలం దుష్ప్రచారమే. అందులో ఎలాంటి వాస్తవం లేదు.



- దసపల్లా భూములను ప్రభుత్వం 22 ఏ జాబితా నుంచి తొలగిస్తే 40 ఎకరాల పరిధిలో ఉన్న 500 మంది గృహాల యజమానులు, అపార్ట్‌మెంట్లలో నివసిస్తున్న వారికి ప్రయోజనం కలుగుతుంది. 64 మంది ప్లాట్ల యజమానులు మాత్రమే తమ పరిధిలో ఉన్న 20% భూమిని అస్యూర్ డెవలపర్స్‌కు అప్పగించారు. మిగిలిన వారెవరూ ఇవ్వలేదు.
- దసపల్లా భూముల వ్యవహారం కోర్టు పరిధిలో ఉన్నందువల్ల యాజమాన్య హక్కులు ఖరారయ్యే వరకూ తాత్కాలిక నిర్మాణం చేపట్టాలని అప్పటి కలెక్టర్ టీడీపీకి భూమి ఇచ్చారు. ఆ తర్వాత రాణి కమలాదేవికి అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలతో ఆ స్థలంలో టీడీపీ శాశ్వత భవన నిర్మాణాన్ని చేపట్టింది. అంటే రాణి కమలాదేవితో కుమ్మక్కై టీడీపీ శాశ్వత నిర్మాణాలు చేపట్టినట్లా?
- ఇది ఒక ప్రైవేట్ ఆస్తికి సంబంధించిన అంశం. ఇది ప్రభుత్వ భూమి కాదు. ఈ విషయాన్ని హైకోర్టు, సుప్రీం కోర్టు కూడా స్పష్టం చేశాయి. న్యాయస్థానాల తీర్పులు కూడా మా ప్రభుత్వ హయాంలో వచ్చినవి కావు. అవి గత ప్రభుత్వంలో వచ్చిన తీర్పులు. తీర్పును అమలు చేయని పక్షంలో ధిక్కారంగా పరిగణించి చర్యలు తీసుకుంటామని సుప్రీంకోర్టు హెచ్చరించిన నేపథ్యంలో కోర్టు తీర్పును అమలు చేయటం మినహా ప్రభుత్వం ముందు మరో మార్గం లేదు. ఈ ప్రైవేట్ భూముల వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం, మా పార్టీ ప్రమేయం నిరాధార ఆరోపణలే. నాపై, నా కుటుంబ సభ్యులపై చేసిన ఆరోపణలు అసంబద్ధం, అవాస్తవాలు.
- దసపల్లా భూములపై సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయటం మినహా మరో మార్గం లేని పరిస్థితుల్లో అవి కొందరు ప్రైవేట్ వ్యక్తులకు దక్కాయి. వాటిని ఏం చేసుకుంటారన్నది పూర్తిగా వారి ఇష్టం.

వికేంద్రీకరణతోనే అభివృద్ధిలో సమతుల్యత

▶ మొదటి పేజీ తరువాయి

వారు విమర్శించారు. హైదరాబాద్‌లో పెట్టిన రూ.వేల కోట్ల పెట్టుబడులను అప్పట్లో ఉమ్మడి రాష్ట్రం నలుమూలలా పెట్టి ఉంటే మనం ఇంతగా నష్టపోయే వారం కాదన్నారు. ఆ పొరపాటును మళ్లీ పునరావృతం చేసేందుకు గత టీడీపీ ప్రభుత్వం ఇప్పుడు రోడ్డెక్కడం మూర్ఖత్వంగా వారు అభివర్ణించారు. పాలనా వికేంద్రీకరణపై తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో సోమవారం రాజమహేంద్రవరం ఎంపీ, పార్లమెంటులో వైఎస్సార్‌సీపీ చీఫ్‌విప్ మార్గాని భరత్‌రామ్ ఆధ్వర్యంలో విభిన్న రంగాలకు చెందిన మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి చాంబర్ ఆఫ్ కామర్స్, విద్యావేత్తలు, వైద్యులు, సాహితీవేత్తలు పెద్ద సంఖ్యలో వచ్చారు. ముఖ్యఅతిథిగా రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు హాజరై మాట్లాడారు.

నిపుణుల సూచనలకు అనుగుణంగానే..

నిపుణుల కమిటీ సూచనలకు అనుగుణంగానే పాలనా వికేంద్రీకరణ చేస్తున్నట్లు ధర్మాన చెప్పారు. దేశంలో అత్యున్నతమైన మేధావులు ప్రొ. మహావీర్, కేటీ రవీంద్రన్, అంజలీమోహన్ తదితరులతో ఏర్పాటైన శివరామకృష్ణ కమిటీ ఇచ్చిన నివేదికను టీడీపీ అధినేత చంద్రబాబు తుంగలోకి తొక్కడమే కాక నారాయణ కమిటీని వేసి తప్పు మీద తప్పు చేశారన్నారు. రాష్ట్ర విభజన తరువాత పార్లమెంటు చేసిన పునర్నిర్మాణ చట్టంలో తీసుకొచ్చిన సెక్షన్-6 మరే రాష్ట్ర విభజన సమయంలో చేయలేదన్నారు. ఇక విభజన చట్టంలో పేర్కొన్న సెక్షన్-6లోని సిఫార్సులను ఎందుకు ఆమోదించలేదో చంద్రబాబు బదులివ్వాలని ధర్మాన డిమాండ్ చేశారు. కమిటీ నివేదికను అమలుచేయడం తప్ప మరో గత్యంతరం లేదన్నారు. అందుకే అన్ని రకాలుగా అనువైన విశాఖపట్నం సిటీ కాస్మోపాలిటన్ నగరంగా ఉండటంతో దానిని కార్యనిర్వాహణ రాజధానిగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి ముందుకెళ్తున్నారన్నారు.

అబద్ధాలు ఆడటమే బాబు ఎజెండా: వేణు

చంద్రబాబు ప్రధాన ఎజెండా అబద్ధాలు అడటమని.. వాటిని ఎల్లో మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని మంత్రి చెల్లుబోయిన వేణు విమర్శించారు. అమరావతిని రాజధాని చేస్తానని చంద్రబాబు వికేంద్రీకరణ చేస్తామని తాముచెప్పి ఎన్నికలకు వెళ్తే ప్రజలు వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టారన్నారు.

కమిషన్ నివేదిక బుట్టదాఖలు: బోస్

ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ శివరామకృష్ణన్ కమిషన్ నివేదికను చంద్రబాబు చెత్తబుట్టలో వేయడంతోనే ప్రాంతీయ విభేదాలు తలెత్తాయన్నారు. కోర్టులు ప్రతి విషయంలో జోక్యం చేసుకోవడంపై పునరాలోచించుకోవాలని కోరారు. సుప్రీంకోర్టు కూడా రాజధాని విషయం ఆ రాష్ట్రానికి సంబంధించిన అంశమని చెప్పిందని.. కోర్టులన్నా, జడ్జిలన్నా తనకు గౌరవం ఉందన్నారు.

పాలనాపరంగా విశాఖ మేలు : భరత్‌రామ్

రాష్ట్రంలో అద్భుత నగరమైన విశాఖపట్నం పాలనాపరంగా ఎంతో సౌలభ్యంగా ఉంటుందని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అభిప్రాయపడ్డారు. తక్కువ పెట్టుబడితో రాష్ట్రానికి అద్భుతమైన రాజధానిగా, నంబర్‌వన్ సిటీగా విశాఖను తీర్చిదిద్దాలని సీఎం జగన్ నిర్ణయించారన్నారు. రాజధాని పేరుతో టీడీపీ తన ఉనికి కాపాడుకునేందుకు ప్రయత్నిస్తోందని భరత్‌రామ్ ఎద్దేవా చేశారు. మాజీమంత్రి కురసాల కన్నబాబు మాట్లాడుతూ 2014లో కేవలం సీనియర్ అనే కారణంతో ప్రజలు బాబుకు పట్టంకట్టిన పాపానికి నేడు ఇన్ని అనర్థాలకు ఆయన కారణమయ్యారన్నారు.

ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, గెడ్డం శ్రీనివాసనాయుడు, సత్తి సూర్యనారాయణరెడ్డి, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల జడ్పీ చైర్మన్లు విప్పర్తి వేణుగోపాలరావు, కవురు శ్రీనివాసరావు, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, విభిన్న రంగాలకు చెందిన మేధావులు పాల్గొన్నారు.

ఇన్‌సైడర్ ట్రేడింగ్‌వల్లే ఆటంకాలు



రాజధాని పేరుతో అమరావతిలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగింది. అందుకే వికేంద్రీకరణకు ఆటంకాలు కల్పిస్తున్నారు. వికేంద్రీకరణవల్ల ఎటువంటి నష్టమూ ఉండదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్రం కాకినాడలో ఉంటే జిల్లా కోర్టు రాజమహేంద్రవరంలో ఉండేది. దానివల్ల ఎవ్వరికీ ఎటువంటి ఇబ్బందీ కలగలేదు.

– డాక్టర్ కర్రి రామారెడ్డి, ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు

జగన్ నిర్ణయం శాస్త్రీయం



వికేంద్రీకరణ ద్వారా రాష్ట్రం త్వరితగతిన అభివృద్ధి చెందుతుంది. సీఎం జగన్ తీసుకున్న నిర్ణయాల్లో మూడు చోట్ల రాజధానుల ఏర్పాటు అనేది శాస్త్రీయమైనది. చంద్రబాబు తన కోటరీకి లాభం చేకూర్చేలా ఆలోచిస్తున్నారు. రాష్ట్ర ప్రజలందరికీ న్యాయం చేకూర్చాలని జగన్ భావిస్తున్నారు.

– జార్జి విక్టర్, మాజీ వైస్‌చాన్సలర్, నన్నయ విశ్వవిద్యాలయం

అభివృద్ధిలో సమానత్వం



రాష్ట్ర భౌగోళిక పరిస్థితులను బట్టి రాజధానిని నిర్ణయించాలి. జమ్మూ కశ్మీర్ వంటి రాష్ట్రాలకు రెండు రాజధానులున్నాయి. ఒకటి కంటే ఎక్కువ రాజధానులున్నంత మాత్రాన అభివృద్ధి జరగదనుకుంటే పొరపాటు. చాలా రాష్ట్రాలు అభివృద్ధి సాధించాయి కదా! పాలనా వికేంద్రీకరణతో శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకూ అభివృద్ధిలో సమానత్వం వస్తుంది.

– గన్ని భాస్కరరావు, ఐఎంఏ అధ్యక్షుడు

● తెలంగాణ

మోగిన మునుగోడు నగారా

- ఉపఎన్నిక షెడ్యూల్ ప్రకటించిన కేంద్ర ఎన్నికల సంఘం
- నవంబర్ 3న పోలింగ్, 6న ఓట్ల లెక్కింపు.. ఫలితాలు

సాక్షి, న్యూఢిల్లీ/హైదరాబాద్: మునుగోడు అసెంబ్లీ స్థానానికి ఉపఎన్నిక నగారా మోగింది. నవంబర్ 3న పోలింగ్ జరగనుండగా అదే నెల 6న ఓట్ల లెక్కింపు, ఫలితాలను ప్రకటిస్తారు. మునుగోడు సహా దేశవ్యాప్తంగా ఆరు రాష్ట్రాల్లోని ఏడు శాసన సభ నియోజకవర్గాలకు ఉప ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం ప్రకటించింది. ఉప ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో తక్షణమే సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గాల పరిధి కలిగి ఉన్న జిల్లా/జిల్లాల్లో పూర్తిస్థాయి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిందని ఎన్నికల సంఘం వెల్లడించింది. మునుగోడు అసెంబ్లీ స్థానం నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల పరిధిలో ఉండటంతో ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఆ రెండు జిల్లాల్లో ఎన్నికల కోడ్ అమల్లో ఉండనుంది. 2022 జనవరి ఒకటి అర్హత తేదీగా ప్రకటించిన ఓటర్ల జాబితాను ఉప ఎన్నికల కోసం వినియోగించనున్నారు. మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యేగా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రాజీనామా చేయడంతో అక్కడ ఉపఎన్నిక అనివార్యమైంది. రాజగోపాల్‌రెడ్డి బీజేపీలో చేరినప్పటికీ ఆయన్ను పార్టీ అభ్యర్థిగా బీజేపీ ఇంకా అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. మరోవైపు కాంగ్రెస్ మాజీ ఎంపీ పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పాల్వాయి స్రవంతిని ఆ పార్టీ అధిష్టానం ఇప్పటికే అభ్యర్థిగా ప్రకటించింది. అయితే అధికార టీఆర్‌ఎస్ మాత్రం ఇంకా అభ్యర్థి పేరును అధికారికంగా ప్రకటించలేదు.

ఇదీ ఉప ఎన్నికల షెడ్యూల్...

నోటిఫికేషన్ ప్రకటన	ఈ నెల 7
నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ	ఈ నెల 14
నామినేషన్ల పరిశీలన	ఈ నెల 15
నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ	ఈ నెల 17
పోలింగ్	నవంబర్ 3
ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన	నవంబర్ 6
ఎన్నికల ప్రక్రియ ముగింపు	నవంబర్ 8

అనుమానం వద్దు.. 5నే టీఆర్‌ఎస్ భేటీ

సాక్షి, హైదరాబాద్: టీఆర్‌ఎస్ సర్వసభ్య సమావేశం ఈ నెల 5న పార్టీ రాష్ట్ర కార్యాలయం తెలంగాణభవన్‌లో యథావిధిగా జరుగుతుందని ఆ పార్టీ అధినేత, సీఎం కె.చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. ప్రగతిభవన్‌లో ఆదివారం జరిగిన మంత్రులు, పార్టీ జిల్లా అధ్యక్షుల సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు దసరా రోజు ఉదయం 11 గంటలకు తెలంగాణభవన్‌కు చేరుకోవాలని ఆహ్వానితుల జాబితాలోని వారికి సూచించారు. మునుగోడు ఉపఎన్నిక నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో దసరా రోజు జరిగే టీఆర్‌ఎస్ సర్వసభ్య సమావేశంపై దాని ప్రభావం ఉండదని పేర్కొన్నారు. సర్వసభ్య సమావేశానికి ఆహ్వానాలు అందినవారు ఎలాంటి అనుమానాలకు తావులేకుండా నిర్దేశిత సమయానికి రావాలని కేసీఆర్ పునరుద్ఘాటించారు. తెలంగాణభవన్‌లో ఈ నెల 5న జరిగే ఈ భేటీకి రాష్ట్రమంత్రులు, టీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర కార్యవర్గం, అనుబంధ విభాగాల అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, డీసీసీబీ, డీసీఎంఎస్, జిల్లా పరిషత్, గ్రంథాలయ సంస్థల చైర్మన్లు, టీఆర్‌ఎస్ 33 జిల్లాల అధ్యక్షులు హాజరుకావాలని ఆదేశించారు.

సీఎం జగన్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్న ఉత్తరాంధ్రవాసులు

- వద్దనుకునే టీడీపీ నేతల మనసు మారాలని దుర్గాదేవికి ప్రార్థనలు
- విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం గంటస్తంభం: విశాఖను పరిపాలన రాజధానిగా చేయాలన్న సీఎం వైఎస్ జగన్ నిర్ణయాన్ని ఉత్తరాంధ్ర వాసులంతా స్వాగతిస్తున్నారని వైఎస్సార్‌సీపీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. జెడ్పీ కార్యాలయంలోని తన చాంబర్‌లో సోమవారం మీడియాతో మాట్లాడారు. ప్రజాభీష్టం మేరకు అభివృద్ధి వికేంద్రీకరణకు సీఎం జగన్ కట్టుబడి ఉన్నారని చెప్పారు. అమరావతిని రూ.లక్ష కోట్లతో అభివృద్ధి చేస్తామంటూ గ్రాఫిక్స్‌తో రాష్ట్ర ప్రజలను చంద్రబాబు మోసం చేశారని ధ్వజమెత్తారు. పాదయాత్ర చేస్తోంది అమరావతి రైతులు కాదని, భూములు కొనుగోలు చేసిన పెట్టుబడిదారులేనని తెలిపారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో పాటు కింది స్థాయి ప్రజా ప్రతినిధులు సైతం ఉత్తరాంధ్ర ప్రయోజనాల కోసం పోరాడుతున్నట్లు శ్రీనివాసరావు చెప్పారు. పరిపాలన రాజధాని రావాలన్న ప్రజల ఆకాంక్షను నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. రాజధానిగా విశాఖకు మద్దతు పలికేలా ఉత్తరాంధ్ర టీడీపీ నేతల మనసు మార్చాలని దసరా రోజున మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో దుర్గాదేవికి పూజలు చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ సురేష్‌బాబు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కేవీ సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న మజ్జి శ్రీనివాసరావు

కేసులో ఓడిపోతామనే సీబీఐ విచారణ జాప్యం

- గాలి జనార్దనరెడ్డి



సాక్షి, బళ్లారి: తనపై తప్పుడు కేసు బనాయించిన సీబీఐ అధికారులు కేసులో.. ఓడిపోతామన్న భయంతోనే విచారణను ఆలస్యం చేస్తున్నారని, తనను వేధింపులకు గురిచేస్తున్నారని కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్దనరెడ్డి ఆరోపించారు. ఆయన సోమవారం బళ్లారి నగరంలోని శ్రీకనక దుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తనపై కేసు నమోదు చేసి 13 ఏళ్లయిందని, అప్పటి నుంచి సీబీఐ అధికారులు కేసును సరిగా నడపడం లేదన్నారు. బళ్లారిలో ఉండేందుకు సుప్రీం కోర్టు తనకు అనుమతిచ్చినందున 14 నెలల నుంచి తాను అక్కడే ఉన్నట్టు తెలిపారు. కేసు ముగిసే వరకు బళ్లారిలో ఉండరాదని సీబీఐ అధికారులు వాదించడం సరికాదని.. ప్రాణమున్నంత వరకు తాను బళ్లారిలోనే ఉంటానని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు, న్యాయ వ్యవస్థపై తనకు సంపూర్ణ విశ్వాసం ఉందని చెప్పారు.

పొన్నియిన్ సెల్వన్...
అది ఒక చరిత్ర పుస్తకం.
అది ఒక సాహిత్య సుమం.
అది ఒక సామాజిక దృశ్యకావ్యం.
వీటన్నింటికీ దర్పణాలు ఈ ఆభరణాలు.
ఆభరణం చరిత్రను చెబుతుంది.
ఆభరణం కూడా కథను నడిపిస్తుంది.
ఆ ఆభరణాలకు రూపమిచ్చిన డిజైనర్...
ప్రతీక్ష ప్రశాంత్ పరిచయం ఇది.



'పొన్నియిన్ సెల్వన్' చిత్రంలో ఐశ్వర్యారాయ్



'పొన్నియిన్ సెల్వన్' చిత్రంలో తాను డిజైన్ చేసిన ఆభరణాలను చూపిస్తున్న ప్రతీక్ష ప్రశాంత్

ఆభరణమూ చరిత్ర చెబుతుంది

ప్రతీక్ష ప్రశాంత్... ప్రఖ్యాత దర్శకుడు మణిరత్నం తెరకెక్కించిన పొన్నియిన్ సెల్వన్ సినిమాలో ఆమె కీలకమైన బాధ్యతలు నిర్వర్తించారు. తన క్రియేటివిటీతో తెరకు కళాత్మకతను పొదిగారామె. ఆ సినిమాలో నటీనటులు ధరించిన ఆభరణాలను రూపొందించిన ప్రతీక్ష ప్రశాంత్... సినిమా కోసం తనకు ఏ మాత్రం అవగాహన లేని చోళ రాజుల గురించి తెలుసుకున్నారు. వారి జీవన శైలి, వారికి ఇతర దేశాలతో ఉన్న వర్తక వాణిజ్యాలు, ఆచార వ్యవహారాలు, ధార్మికజీవనం... అన్నింటినీ ఔపోశన పట్టారు ప్రతీక్ష. ఆ అనుభవాలు ఆమె మాటల్లోనే తెలుసుకుందాం.

"మాకు సినిమా ప్రపంచంతో ఏ మాత్రం పరిచయం లేదు. మా ఇంట్లో వాళ్లు మహా బిడియస్తులు. మా పూర్వికులు నిజాం కుటుంబాలకు ఆభరణాలు తయారు చేశారు. హైదరాబాద్‌లో ఆరు దశాబ్దాలుగా ఆభరణాల తయారీ, అమ్మకాల వ్యాపారంలో ఉన్నారు. కానీ వాళ్ల ఫొటోలు కూడా ఎక్కడా కనిపించవు. అలాంటిది ఒక్కసారిగా నేను సినిమా కోసం పని చేయడం ఊహించని మలుపు అనే చెప్పాలి. సినిమాకు ఆర్నమెంట్ డిజైనర్‌గా కంటే ముందు నా గురించి చెప్పాలంటే... మాది గుజరాతీ కుటుంబం. నేను పుట్టింది, పెరిగింది మాత్రం ముంబయిలో. మా నాన్న లాగే ఆర్కిటెక్చర్ చేశాను. పెళ్లితో కిషన్‌దాస్ ఆభరణాల తయారీ కుటుంబంలోకి వచ్చాను. నాకు ఉత్తరాది కల్చర్‌తోపాటు హైదరాబాద్ కల్చర్ తో మాత్రమే పరిచయం. అలాంటిది తమిళనాడుకు చెందిన ఒక పీరియాడికల్ మూవీకి పని చేయవలసిందిగా ఆహ్వానం అందడం నిజంగా ఆశ్చర్యమే. ఆ సినిమాకు డ్రెస్ డిజైనర్‌గా పనిచేసిన 'ఏకా లఖానీ'కి నాకు కామన్ ఫ్రెండ్ సినీ నటి అదితి రావు హైదరీ. ఆమె ఆర్నమెంట్ డిజైనింగ్‌లో నా స్కిల్ గురించి ఏకా లఖానీకి చెప్పడంతో నాకు పిలుపు వచ్చింది. మణిరత్నం గారితో మాట్లాడిన తరవాత నేను చేయాల్సిన బాధ్యత ఎంత కీలకమైనదో అర్థమైంది. కొంచెం ఆందోళన కూడా కలిగింది. ఎందుకంటే నాకు చోళుల గురించి తెలియదు. ఆభరణాలు అర్థం కావడానికి కొన్ని పెయింటింగ్స్ చూపించారు. వాటిని చూసి యథాతథంగా చేయడం నాకు నచ్చలేదు. అందుకే చోళుల గురించి అధ్యయనం చేశాను.



చారిత్రక దృశ్యమాలిక

ఈ సినిమా కోసం మూడేళ్లు పని చేశాను. నాలుగు వందల మంది డాన్సర్స్‌తో చిత్రీకరించిన విజయగీతం చాలా పెద్దది. సినిమా కోసం 450 ఆభరణాలు బంగారంతో చేశాం. ఐశ్వర్యారాయ్, త్రిష, విక్రమ్, జయం రవి, కార్తి, శోభిత... వంటి ముఖ్యపాత్రలతోపాటు మరికొన్ని ప్రధాన పాత్రలకు బంగారు ఆభరణాలు, చిన్న పాత్రలకు గిల్టు ఆభరణాలు చేశాం. దర్బార్ సన్నివేశాలు, యుద్ధఘట్టాలు, డాన్సులు... సన్నివేశాన్ని బట్టి ఆభరణం మారుతుంది. అలాగే ఒక్కో పాత్ర హెయిర్ స్టయిల్ ఒక్కో రకంగా ఉంటుంది. తలకు అలంకరించే ఆభరణాలు కూడా మారుతాయి. ప్రతి ఆభరణమూ చోళుల కాలాన్ని స్ఫురింపచేయాలి. చోళుల రాజ చిహ్నం పులి. రాజముద్రికల మీద పులి బొమ్మ ఉంటుంది. ఉంగరం మీద కొంత కథ నడుస్తుంది. కాబట్టి ఆ సీన్‌లో చిన్న డీటెయిల్ కూడా మిస్ కాకుండా పులితోపాటు పామ్ ట్రీ కూడా ఉండేటట్లు దంతంతో ఆభరణాన్ని రూపొందించాం. కల్కి కృష్ణమూర్తి రాసిన ప్రఖ్యాత తమిళ నవలకు, చారిత్రక ఘట్టాలకు దృశ్యరూపం ఇచ్చే ప్రయత్నంలో ఎక్కడా లోపం జరగకూడదనేది మణిరత్నం గారి సంకల్పం. ఆ ప్రయత్నంలో సక్సెస్ అయ్యాననే అనుకుంటున్నాను.

– ప్రతీక్ష ప్రశాంత్,
ఆర్నమెంట్ డిజైనర్

విదేశీ మణిమాణిక్యాలు

చోళులు ధరించిన ఆభరణాల్లో ఉన్న మాణిక్యాలు మామూలు మాణిక్యాలు కాదు. అవి బర్మా రూబీలు. బర్మాతో చోళులకు ఉన్న వర్తక వాణిజ్యాల గురించి తెలిస్తేనే నేను ఆభరణంలో బర్మా రూబీ వాడగలుగుతాను. టాంజానియా, గోల్కొండతో కూడా మంచి సంబంధాలుండేవి. మరకతాలు, వజ్రాల్లో ఆ మేరకు జాగ్రత్త తీసుకున్నాం. అలాగే చోళులు శివ భక్తులు, చేతికి నాగ వంకీలను ధరిస్తారు. తలకు పెద్ద కొప్పు పెట్టి, ఆ కొప్పుకు సూర్యవంక, చంద్రవంక, నాగరం వంటి ఆభరణాలను ధరిస్తారు. ఆభరణాల్లో కమలం వంటి రకరకాల పూలు- లతలు, నెమలి, రామచిలుక వంటి పక్షులు, దేవతల రూపాలు ఇమిడి ఉంటాయి. ముక్కు పుడక నుంచి చేతి వంకీ, ముంజేతి కంకణం, వడ్డాణం, తల ఆభరణాలు... వేటికవి తన వంతుగా కథను చెబుతాయి, కథకు ప్రాణం పోస్తాయి. రంగస్థలం అయితే తల వెనుక వైపు ఆభరణాల మీద ఎక్కువ దృష్టి పెట్టాల్సిన అవసరం ఉండక పోవచ్చు. కానీ సినిమాలో ముఖ్యంగా మణిరత్నం మూవీలో కెమెరా పాత్ర చుట్టూ 360 డిగ్రీల్లో తిరుగుతుంది. కాబట్టి ఎక్కడా రాజీ పడడానికి వీల్లేదు. పైగా ఇప్పుడు ప్రేక్షకులు ఒకప్పటిలాగ సినిమా చూసి బాగుందనో, బాగోలేదనో ఒక అభిప్రాయంతో సరిపుచ్చడం లేదు. పాత్ర అలంకరణ నుంచి, సన్నివేశం నేపథ్యం వరకు ప్రతిదీ నిశితంగా గమనిస్తున్నారు, పొరపాటు జరిగితే సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టి ఆటపట్టిస్తారు. అలాగే ఒకసారి ఐశ్వర్య ధరించిన ఆభరణాన్ని మరోసారి పొరపాటున త్రిషకు అలంకరించామంటే ఇక అంతే.

అప్పట్లో కోర్సుల్లేవు

ఇక నా ఆర్నమెంట్ డిజైనర్ కెరీర్ విషయానికి వస్తే... నేను ఇందులో ఎటువంటి కోర్సూ చేయలేదు. ఇప్పటిలాగ పాతిక- ముప్పై ఏళ్ల కిందట కోర్సులు లేవు కూడా. మా మామగారికి సహాయంగా స్టోర్‌లోకి అడుగుపెట్టాను. నిపుణులైన మా కారిగర్స్ తమ అనుభవంతో పని నేర్పించారు. ప్రతి పనినీ ఆసక్తితో నేర్చుకున్నాను. ఇప్పటికీ రోజూ మధ్యాహ్నం వరకు నా ఆర్కిటెక్చర్ ఆఫీస్, మధ్యాహ్నం నుంచి ఆర్నమెంట్ స్టోర్ చూసుకుంటూ ఉంటాను. ఈ సినిమాకి పని చేయడం నా జీవితంలో ఒక విశిష్టమైన ఘట్టం" అన్నారామె.

– వాకా మంజులారెడ్డి
ఫొటోలు: నోముల రాజేశ్ రెడ్డి

ఈ నల్లని రాళ్లలో ఏ కన్నులు దాగి ఉన్నాయో తెలియదుగానీ, పచ్చటి ప్రకృతిలో ఎన్నో రహస్యాలు దాగి ఉన్నాయి. పుస్తకాల దగ్గరే ఉంటే ప్రయోగశాలకే పరిమితం అయితే ఆ రహస్యాలు అక్కడే ఉండిపోతాయి. అందుకే... 'ల్యాబ్ టు ఫీల్డ్' నినాదంతో హిమాలయాలలోని మారుమూల ప్రాంత జీవావరణ వ్యవస్థను అధ్యయనం చేయడానికి తన బృందంతో కలిసి ప్రకృతి యాత్ర చేసింది శాస్త్రవేత్త ధృతి బెనర్జీ.

ప్రయోగశాల నుంచి ప్రకృతి ఒడిలోకి

కొత్తదారి





నూటైదు సంవత్సరాల చరిత్ర ఉన్న జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జెడ్‌ఎస్‌ఐ)కి తొలి మహిళా డైరెక్టర్‌గా చరిత్ర సృష్టించింది ధృతి బెనర్జీ. మొదటి నుంచి తనకు అన్వేషణ అంటే అంతులేని ఇష్టం. అంతరించిపోయే దశలో ఉన్న జీవులు ఏమిటి? అంతరించే దశలో నుంచి కొన్ని జీవులు ఎలా బయటపడ్డాయి? కొత్త జీవులు ఏమిటి... జన్యుశాస్త్రం, పురాజీవశాస్త్రం, జీవావరణ శాస్త్రం... ఇలా ఎన్నో దారుల్లో తన ప్రయాణం కొనసాగేది.

యానిమల్ సైకాలజీలో పీహెచ్‌డీ చేసిన బెనర్జీకి మన పురాణాలు, సంస్కృతి ద్వారా జీవవైవిధ్యం విలువ గురించి తెలియజేయాలని కోరిక.

గత సంవత్సరం 'జెడ్‌ఎస్‌ఐ' డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన బెనర్జీ 'ల్యాబ్ నుంచి ఫీల్డ్'కు అనే నినాదాన్ని ఇచ్చింది.

'ప్రయోగశాల ఏం తెలియజేస్తుందో అంతకంటే ఎక్కువగా ప్రదేశాలు తెలియజేస్తాయి' అంటున్న బెనర్జీ తన మాటలను ఆచరణలోకి తీసుకువచ్చింది.



ధృతి బెనర్జీ

తాజాగా...ఏడుగురు సభ్యుల 'ఆల్-ఉమెన్' బృందంతో కలిసి హిమాలయాలలోని మారుమూల ప్రాంతాలలోకి వెళ్లింది బెనర్జీ. ఆమెతో పాటు ఈ బృందంలో ఉన్న శాస్త్రవేత్తలు... ఇందుశర్మ, అవతార్ కౌర్, దీపా జైస్వాల్, దేబ్‌శ్రీ దామ్, అపర్ణ కల్వా, శాంతబల గురుమయుమ్.

హిమాచల్‌ప్రదేశ్‌లోని రోహ్‌తంగ్ నుంచి పరిశోధన యాత్ర ప్రారంభమైంది. మియర్, ఉదయ్‌పూర్, గెపాన్ లోయలు, షింకుల, బరలాచ కనుమలు, సూరజ్ తాల్ సరస్సు...ఇలా ఎన్నో చోట్ల ఈ బృందం తన పరిశోధనలు కొనసాగిస్తుంది.

హిమాలయన్ మర్మోట్ నుంచి అరుదైన సీతాకోకచిలుకల వరకు ఎన్నో విషయాలను రికార్డ్ చేస్తారు. వాతావరణంలోని మార్పుల ప్రభావం జీవజాలంపై ఎలా ఉందో తెలుసుకోవడానికి ఈ సమాచారం ఉపయోగపడుతుంది.

బెనర్జీ తాజా పరిశోధనల్లో 'ఎన్‌జీఎస్'కు ప్రాధాన్యత ఇస్తోంది. 'అప్పుడు ఎలాగో- ఇప్పుడు అలాగే' అనే పాత టెక్నాలజీతో సర్దుకుపోకుండా నెక్ట్స్-జెనరేషన్ సీక్వెన్సింగ్(ఎన్‌జీఎస్) టెక్నాలజీతో తన బృందంలో ఉత్సాహాన్ని నింపుతోంది.

'చిన్న చిన్న కీటకాలు కూడా జీవవైవిధ్యానికి ఎంతో ఉపయోగపడుతున్నాయి. వాటి గురించి లోతైన పరిశోధన చేయడానికి ప్రత్యేకమైన పరికరాలు అవసరం' అంటున్న బెనర్జీ భవిష్యత్‌లో ఇలాంటి యాత్రలు మరిన్ని చేయబోతున్నట్లు ప్రకటించింది. 'ల్యాబ్ నుంచి ఫీల్డ్'కు అనే లక్ష్యానికి ప్రధాన అవరోధం నిధుల సమస్య. తన నాయకత్వ లక్షణాలతో ఈ సమస్య లేకుండా చేసింది బెనర్జీ.

శతవసంతాలకు పైగా చరిత్ర ఉన్న 'జెడ్‌ఎస్‌ఐ'లో మహిళల ప్రాతినిధ్యం తక్కువగా ఉంది. అయితే ధృతి బెనర్జీలాంటి శాస్త్రవేత్తలు నవతరానికి స్ఫూర్తిని ఇస్తున్నారు. దీనివల్ల 'జెడ్‌ఎస్‌ఐ'లో చేరుతున్న మహిళల సంఖ్య పెరుగుతోంది. ఇది మంచి విషయమే కదా!

బ్రౌన్ బంగారం

WORLD COTTON DAY
COTTON FOR GOOD

సాగుబడి
హస్త కార్తె :
అక్టోబర్ 9 వరకు

కృత్రిమ రంగులద్దే అవసరం లేనందున బ్రౌన్ కాటన్ సాగుతో పర్యావరణానికి మేలు

జన్యుమార్పిడి చేయని బ్రౌన్ కాటన్ సూటి వంగడాలకు సిఐసిఆర్ రూపకల్పన

ఎకరానికి 8 క్వింటాళ్ల దిగుబడినిచ్చే బ్రౌన్ కాటన్ వంగడాలు

3 రకాల్లో రెండు దక్షిణాది రాష్ట్రాల్లో సాగుకు అనువైనవి

సేంద్రియ, ప్రకృతి సేద్యానికి.. తిరిగి విత్తుకోవడానికి కూడా అనువైనవి

అక్టోబర్ 7న 'ప్రపంచ పత్తి దినోత్సవం' జరుపుకోనున్న సందర్భంగా ప్రత్యేక కథనం



పత్తి అంటే ఎవరికైనా చప్పున గుర్తొచ్చేది తెల్ల బంగారమే. వేరే రంగులో ఉండే దూది కనిపిస్తే దానికి కృత్రిమంగా రంగులద్ది ఉంటారనే భావిస్తాం. అయితే, గోధుమ రంగు దూదిని పండించే పత్తి రకాలు సహజసిద్ధంగానే ఉన్నాయంటే ఆశ్చర్యం కలుగుతుంది. వీటినే నాచురల్లీ కలర్డ్ కాటన్ రకాలు అని, బ్రౌన్ కాటన్ రకాలు అని పిలుస్తుంటారు. సహజసిద్ధమైన బ్రౌన్ కాటన అటవీ రకాలను అభివృద్ధి పరచి మహారాష్ట్ర నాగపూర్‌లోని కేంద్రీయ పత్తి పరిశోధనా స్థానం (ఐసిఏఆర్- సిఐసిఆర్) శాస్త్రవేత్తలు అధిక దిగుబడినిచ్చే 3 సరికొత్త బ్రౌన్ కాటన్ సూటి వంగడాలను అభివృద్ధి చేశారు. వైదేహి-1, సిఎస్‌హెచ్ 17395 అనే రకాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో వాణిజ్య స్థాయిలో సాగుకు ఉపయోగపడతాయి. వీటితో పాటు మహారాష్ట్ర తదితర సెంట్రల్ జోన్ రాష్ట్రాలకు ఉపయోగపడే మరో రకాన్ని కూడా అధికారికంగా విడుదల చేశారు. జన్యుమార్పిడి చేయకుండా రూపొందించిన నాన్ బీటీ రకాలు ఈ బ్రౌన్ పత్తి సూటి రకాలు. ఇతర పత్తితో కలిసిపోకుండా దూరం పాటిస్తూ సాగు చేసుకుంటే.. ఈ పత్తి నుంచి వేరు చేసిన గింజలనే తదుపరి పంటకు విత్తనాలుగా వాడుకోవచ్చు. విత్తనాన్ని ప్రతి ఏటా కొనాల్సిన అవసరం ఉండదు.

ప్రధాన శాస్త్రవేత్త డా. వినితా గొట్మరె తదితర శాస్త్రవేత్తలు 15 ఏళ్ల పాటు కొనసాగించిన పరిశోధనల ఫలితంగా రూపుదాల్చిన ఈ వంగడాలు చీడపీడలకు తట్టుకొని రైతులకు మంచి దిగుబడులనివ్వగలవని సిఐసిఆర్ సంచాలకులు డాక్టర్ వై.జి. ప్రసాద్ 'సాక్షి సాగుబడి'తో చెప్పారు.

బ్రౌన్ కాటన్‌తో ప్రయోజనాలేమిటి?

బ్రౌన్ కాటన్ రకాలు అనేక చీడ పీడలను తట్టుకొని వర్షాధారంగా కూడా మంచి దిగుబడులను ఇవ్వగలవు. కాబట్టి ఈ రకం పత్తి సాగు వల్ల ప్రకృతి వనరులపై, పర్యావరణంపై దుష్ప్రభావం తక్కువగా ఉంటుంది. అందువల్లనే ప్రపంచ వ్యాప్తంగా చైతన్యవంతులైన వినియోగదారులు ఆర్గానిక్ కాటన్ మాదిరే బ్రౌన్ కాటన్ వాడకాన్ని ప్రోత్సహిస్తున్నారు.



సిఐసిఆర్-హెచ్ కాటన్ 58

తెల్ల దూదితో రంగు వస్త్రాలను ఉత్పత్తి చేసే క్రమంలో జౌళి పరిశ్రమదారులు కృత్రిమ రసాయన రంగులద్దుతూ ఉంటారు. వాషింగ్, బ్లీచింగ్, డైయింగ్ ప్రక్రియల కారణంగా భారీగా మురుగు నీరు విడుదలవుతుంది. చాలా సందర్భాల్లో పూర్తిగా శుద్ధి చేయకుండానే విడుదల చేసే ఈ కలుషిత జలాల వల్ల పర్యావరణంతో పాటు భూమిని, నీటి వనరులను కలుషితం చేస్తున్నాయి. ఫలితంగా మనుషులతోపాటు పశువులకు, జలచరాలకు తీరని హాని జరుగుతోంది. పర్యవసానంగా ఆ పరిసర ప్రాంత ప్రజలు కేన్సర్, చర్మవ్యాధులు, పనిసంబంధమైన ఆస్మా లేదా అలర్జీలు, జీర్ణకోశ, శ్వాసకోశ వ్యాధులు, కిడ్నీ జబ్బుల పాలవుతున్నారు. ఈ నేపథ్యంలో రంగులద్దే ప్రక్రియలో రసాయనాల వాడకాన్ని తగ్గించడానికి సహజసిద్ధమైన గోధుమ రంగు పత్తి ఉత్పత్తి ఉపకరిస్తుంది. గతంలో అందుబాటులో ఉన్న దేశవాళీ బ్రౌన్ కాటన్ రకాల్లో దూది పటుత్వ లోపం తదితర సమస్యలను అధిగమించే విధంగా ఈ వంగడాలను సిఐసిఆర్ అభివృద్ధి పరచటం విశేషం.



వైదేహి-1 రకం

వైదేహి-1 రకం

సిఐసిఆర్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన బ్రౌన్ కాటన్ రకాల వరుసలో వైదేహి-1 మొదటిది. దక్షిణాది రాష్ట్రాల్లో వాణిజ్యస్థాయి లో సాగుకు అనువైనది. ప్రభుత్వ ఆమోదంతో గత ఏడాది నోటిఫై అయ్యింది. ముదురు గోధుమ రంగు దూదిని అందిస్తుంది. 3 అటవీ రకాల్లోని సుగుణాలతో రూపొందిన అమెరికన్ కాటన్ (గాస్పిం హిర్సుటం) సూటి రకం వంగడం ఇది. బెట్టను తట్టుకునే లక్షణం ఉండటం వల్ల ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటిస్తే వర్షాధారంగా హెక్టారుకు 14-15 క్వింటాళ్ల వరకు, నీటిపారుదలతో 20 క్వింటాళ్ల వరకు దిగుబడినిస్తుందని సిఐసిఆర్ చెబుతోంది.

వైదేహి-1 రకం ముదురు గోధుమ రంగు దూది పింజ పొడవు 22.5 ఎం.ఎం. ఉంటుంది. పటుత్వం 3.95. సూర్యరశ్మి బాగా సోకే విధంగా మొక్క నిర్మాణం ఉంటుంది. కాబట్టి, కాయతొలిచే పురుగును తట్టుకుంటుంది. పచ్చదోమ, తెల్లదోమ, పేనుబంక వంటి రసంపీల్చే పురుగులను తట్టుకుంటుంది. అటవీ రకాల మాదిరిగా బాక్టీరియా తెగులుతో పాటు అల్టర్నేరియా ఆకుమచ్చ, గ్రే మిల్‌డ్యూ, సెర్కోస్పొర ఆకుమచ్చ, తుప్పు తెగులు వంటి శిలీంధ్రపు తెగుళ్లను సమర్థవంతంగా తట్టుకుంటుంది. విత్తన మొలక శాతం బాగుంటుంది. స్పిన్నింగ్‌కు అనువైన రకం. అధిక దిగుబడినిచ్చే ఈ ముదురు గోధుమ రంగు పత్తి రకం రైతులకు మంచి ఆదాయాన్ని అందిస్తుందని డా. ప్రసాద్ తెలిపారు.

సిఐసిఆర్-హెచ్ కాటన్ 58

సిఐసిఆర్-హెచ్ కాటన్ 58 (సిఎస్‌హెచ్ 17395) రకం బ్రౌన్ కాటన్ వంగడం ఈ ఏడాదే విడుదలైంది. ఏపీ, తెలంగాణ సహా దక్షిణాది రాష్ట్రాల్లో వాణిజ్య స్థాయిలో సాగుకు అనువైనది. ఈ రకం కూడా హెక్టారుకు 20 క్వింటాళ్ల వరకు దిగుబడినివ్వగలదు. పింజ పొడవు 23.7 ఎం.ఎం. ఉంటుంది. బ్యాక్టీరియా తెగులుతోపాటు ఆల్టెర్నేరియా ఆకు మచ్చ, గ్రే మిల్‌డ్యూ తెగుళ్లను సమర్థవంతంగా తట్టుకుంటుంది. సెర్కోస్పొర ఆకుమచ్చ, తుప్పు తెగుళ్లను మోస్తరుగా తట్టుకుంటుంది. మొలక శాతం బాగుంటుంది. చీడపీడలను దీటుగా తట్టుకునే ఈ సూటి రకం బ్రౌన్ కాటన్ సాగు దక్షిణాది రైతులకు మంచి ఆదాయాన్ని ఇవ్వగలుగుతుందని సిఐసిఆర్ ఆశిస్తోంది.

బ్రౌన్ కాటన్ నాన్-బీటీ రకాలు సేంద్రియ సేద్యానికి అనువైనవి

గోధుమ రంగు పత్తి(బ్రౌన్ కాటన్)ని ఉత్పత్తి చేసే నాన్‌బీటీ (జన్యుమార్పిడి చేసినవి కాదు) సూటి వంగడాలను 15 ఏళ్ల పాటు శ్రమించి రూపొందించాం. సాధారణ పద్ధతితో పాటు సేంద్రియ / ప్రకృతి సేద్య పద్ధతుల్లో కూడా సాగు చేసుకోవడానికి అనువైన సూటి రకాలు ఇవి. పత్తి నుంచి విత్తనాలు తీసి తిరిగి మళ్లీ విత్తుకోవచ్చు. అయితే, ఇతర తెల్ల రకం పత్తి పొలాలకు కనీసం 50 మీటర్ల దూరంలో బ్రౌన్ కాటన్ రకాలను సాగు చెయ్యాల్సి ఉంటుంది. రైతులు ఈ జాగ్రత్త పాటించాలి.

ఈ రకం పత్తి కాయలు పగిలిన మొదట్లో కాయ లోపలి దూది తెల్లగానే ఉంటుంది. అయితే, ఎండ తగిలిన తర్వాత దూది క్రమంగా గోధుమ లేదా ముదురు గోధుమ రంగులోకి మారుతుందని రైతులు గమనించాలి. 60/75x30 సెం.మీ. దూరంలో (అంటే.. సాళ్ల మధ్య 2/రెండున్నర అడుగుల దూరం, మొక్కల మధ్య అడుగు దూరంలో) విత్తుకోవచ్చు. ఎకరానికి 2 నుంచి 2.5 కేజీల విత్తనం అవసరమవుతుంది. బ్రౌన్ కాటన్ నాన్‌బీటీ రకాల విత్తనాల కోసం రైతులు ఈ క్రింది ఈ-మెయిల్ ద్వారా సంప్రదించవచ్చు.



– డా. వై.జి. ప్రసాద్, డైరెక్టర్,
సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాటన్ రీసెర్చ్,
నాగపూర్-440010, మహారాష్ట్ర
cicrnagpur@gmail.com

సాధారణంగా బీటీ పత్తిరకాల పింజ 28-31 ఎం.ఎం. మధ్యలో ఉంటుంది. ఈ రెండు మధ్యస్థ పింజ రకాలు. పింజ పొడవు 22.8-23.7 ఎం.ఎం. ఉంటుంది. అయినా, వీటి జిన్నింగ్‌కు సమస్యలు ఉండవని డా. ప్రసాద్ తెలిపారు.

సహజమైన రంగు పత్తి కావటం వల్ల ఒనగూడే పర్యావరణ, ఆరోగ్య ప్రయోజనాల రీత్యా ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లలో బ్రౌన్ కాటన్‌కు ప్రాధాన్యం పెరుగుతోంది. దక్షిణాది రాష్ట్రాల్లో కొన్ని సంస్థలు బ్రౌన్ కాటన్ ఒప్పంద సాగుకు శ్రీకారం చుట్టాయి. ఈ నేపథ్యంలో సిఐసిఆర్ నాన్ బీటీ రకాలు రైతులకు ఉపయోగకరంగా ఉంటాయని ఆశిద్దాం.

ఇతర పత్తి రకాలతో ఈ విలక్షణ వంగడాలు కలుషితం కాకుండా రైతులు జాగ్రత్త పడాలి. పత్తి కోసం సాగు చేసినా, విత్తనం కోసం సాగు చేసినా ఇతర రకాల పత్తి పొలాల నుంచి 50 మీటర్ల దూరం పాటించటం తప్పనిసరి. కంచె పంటగా జొన్న/ సజ్జ/ మొక్కజొన్నను పొలం చుట్టూ 4 సాళ్లు వేసుకోవటం ద్వారా తెల్ల బీటీ పత్తితో బ్రౌన్ కాటన్ కలుషితం కాకుండా కాపాడుకోవచ్చు.

– పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

పత్తి తీసే రోబో సిద్ధం!

- 4 చేతులతో కూడిన ఈ రోబో విద్యుత్ బ్యాటరీతో పని చేస్తుంది
- రోజుకు 200 కేజీల పత్తిని మనిషిలాగానే జాగ్రత్తగా తీస్తుంది





మన దేశంలో 1.20 లక్షల హెక్టార్లకు పైగా పత్తి సాగవుతోంది. సకాలంలో పత్తి తీత కూలీలను దొరికించుకొని, సకాలంలో పత్తి తీతను పూర్తి చేయటం రైతులకు కత్తి మీద సాము లాంటిదే. కూలీల కొరతతో సతమతమవుతున్న రైతుల తిప్పలు తప్పించగల రోబో అందుబాటులోకి రానున్నాయి.

బెంగళూరుకు చెందిన గ్రోబో మాక్ అనే స్టార్టప్ కంపెనీ పత్తిని మనుషులు తీస్తున్నంత సున్నితంగా, సులభంగా తీసే రోబోను రూపొందించింది. పరీక్షలన్నిటినీ పూర్తి చేసుకొని మార్కెట్‌లోకి తేవడానికి సిద్ధమవుతోంది. ఎలక్ట్రిక్ రీచార్జబుల్ బ్యాటరీ ఆధారంగా నడిచే సెమీ అటానమస్ ఎలక్ట్రిక్ వాహనానికి నాలుగు రోబోటిక్ చేతులను అమర్చారు. ఒక్కో రోబోటిక్ చేయి రోజుకు 50 కిలోల పత్తి తీస్తుంది. దీనితో రోజుకు 200 కిలోల పత్తిని తీయొచ్చు. అవసరమనుకుంటే మరిన్ని చేతులను జోడించుకోవచ్చని దీని ఆవిష్కర్తలు చెబుతున్నారు.

విద్యుత్ రోబో పత్తి చేనులో స్వతంత్రంగా కదులుతూ పని చేస్తుంది. స్టీరియో కెమెరా ద్వారా రోబోటిక్ చేయి పత్తిని గుర్తిస్తుంది. పత్తి మొక్క మీది నుంచి చేయి దూదిని పట్టుకొని తీయగానే.. వాక్యూమ్ మెకానిజమ్ ద్వారా దూది వెనుక వైపు ఉన్న బుట్టలోకి పడుతుంది. చేతులు పత్తిని తీసే పనిలో ఉండగానే ఎలక్ట్రిక్ వాహనం తనంతట తానుగా ముందుకు కదులుతుంటుంది.

ఈ రోబో కేవలం పత్తి తీయడానికే కాదు.. పత్తి సీజన్ మొదటి నుంచి చివరి వరకు రైతుకు ఉపయోగపడుతుంది. కీటక నాశినులు/ కషాయాల పిచికారీకి కూడా దీన్ని ఉపయోగించుకోవచ్చని ఆవిష్కర్తలు అంటున్నారు. పని సులువు చేయటమే కాదు, ఖర్చులు తగ్గించుకోవడానికి కూడా రైతులకు ఈ రోబో పనికొస్తుందంటున్నారు.

పత్తి తీసేలా దీన్ని తయారు చేసిన గ్రీన్ రోబో మెషినరీ ఇంజినీర్ల బృందం మున్ముందు బెండకాయలు, వంకాయలు, టమాటోల కోతకు ఉపయోగపడే రోబోలను కూడా తయారు చేయబోతోందని గ్రోబోమాక్ సీఈవో మనోహర్ సంబంధం చెబుతున్నారు. సెమీ కండక్టర్ ఇంజినీరైన ఆయన స్వయాన పత్తి రైతు కావటం విశేషం! ఈ రోబో ఖరీదు ఎంతనే విషయం ఇంకా వెల్లడి కాలేదు.



నవంబర్‌లో మైసూరు దేశీ విత్తనోత్సవం

మైసూరులోని కర్ణాటక రాష్ట్ర ఓపెన్ యూనివర్సిటీ ఆవరణలో నవంబర్ 11 నుంచి 13వ తేదీ వరకు జాతీయ విత్తనోత్సవం జరగనుంది. ఆ తేదీల్లోనే మైసూరులో ఆషా నెట్‌వర్క్ ఆధ్వర్యంలో జాతీయ సేంద్రియ రైతు సమ్మేళనం జరగనున్న సందర్భంగా జాతీయ స్థాయి దేశీ విత్తనోత్సవాన్ని సైతం నిర్వహిస్తున్నారు. దేశం నలుమూలల నుంచి వచ్చే 100కు పైగా దేశీ విత్తన పరిరక్షక బృందాలు సుమారు 5 వేలకు పైగా వివిధ దేశవాళీ పంటల విత్తనాలను ప్రదర్శిస్తారు. విక్రయిస్తారు. సేంద్రియ సేద్యం, దేశీ విత్తనాల వైభవాన్ని తెలియజెప్పే పుస్తకాలను కూడా ప్రదర్శిస్తారు. వివరాలకు.. 94482 40676, 94255 54950, 99017 13351.



టి20 ప్రపంచకప్ టోర్నీకి బుమ్రా దూరం

వెన్ను గాయంతో బాధపడుతున్న భారత పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా వచ్చే టి20 వరల్డ్ కప్ నుంచి తప్పుకున్నాడు. బుమ్రా పూర్తిగా కోలుకోలేదంటూ వైద్యబృందం నివేదిక ఇచ్చిన అనంతరం బీసీసీఐ సోమవారం అధికారికంగా ఈ విషయాన్ని ప్రకటించింది. బుమ్రా గాయాన్ని పూర్తిగా సమీక్షించడంతో పాటు నిపుణులతో సంప్రదించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు బోర్డు వెల్లడించింది. బుమ్రా స్థానంలో ఎంపిక చేసే ఆటగాడి పేరును త్వరలోనే ప్రకటిస్తామని బీసీసీఐ పేర్కొంది.

జొకోవిచ్ ఖాతాలో 89వ సింగిల్స్ టైటిల్

సెర్బియా టెన్నిస్ స్టార్, ప్రపంచ మాజీ నంబర్‌వన్ జొకోవిచ్ తన కెరీర్‌లో 89వ సింగిల్స్ టైటిల్ సాధించాడు. టెల్ అవీవ్ ఓపెన్ టోర్నీలో జొకోవిచ్ విజేతగా నిలిచాడు. ఫైనల్లో జొకోవిచ్ 6-3, 6-4తో యూఎస్ ఓపెన్ మాజీ చాంపియన్ మారిన్ సిలిచ్ (క్రొయేషియా)పై గెలుపొందాడు. చాంపియన్‌గా నిలిచిన జొకోవిచ్‌కు 1,44,415 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. కోటీ 17 లక్షలు)తోపాటు 250 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.




'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మేఘన

మేఘన మెరిసె...

- ఆంధ్రప్రదేశ్ క్రికెటర్ అద్భుత ఇన్నింగ్స్
- ఆసియా కప్ టి20 టోర్నీలో భారత మహిళలకు రెండో గెలుపు

సిల్హెట్ (బంగ్లాదేశ్): మహిళల ఆసియా కప్ టి20 టోర్నమెంట్‌లో సబ్బినేని మేఘన (53 బంతుల్లో 69; 11 ఫోర్లు, 1 సిక్స్) వీరవిహారం చేసింది. దీంతో భారత జట్టు డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 30 పరుగుల తేడాతో మలేసియాపై నెగ్గింది. మొదట బ్యాటింగ్ చేపట్టిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 181 పరుగుల భారీస్కోరు చేసింది. ఓపెనర్లు మేఘన, షఫాలీ వర్మ (39 బంతుల్లో 46; 1 ఫోర్, 3 సిక్సర్లు) ధాటిగా ఆడారు. ఆంధ్రప్రదేశ్ క్రికెటర్ మేఘన 38 బంతుల్లోనే (8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీని అధిగమించడంతో భారత్ కేవలం 12 ఓవర్లలోనే 100 స్కోరు చేసింది. ఓపెనర్లిద్దరు 13.5 ఓవర్లలో 116 పరుగులు జోడించాక మలేసియా బౌలర్ వినిఫ్రెడ్ దురైసింగం బౌలింగ్‌లో మేఘన నిష్క్రమించింది. తర్వాత రిచా ఘోష్ (19 బంతుల్లో 33 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్) కూడా చెలరేగడంతో భారత పరుగుల జోరు కొనసాగింది. నూర్ దానియా వేసిన 19వ ఓవర్లో వరుస బంతుల్లో షఫాలీ వర్మ, కిరణ్ నావ్‌గిరె (0) అవుటయ్యారు. తర్వాత భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన మలేసియా వర్షంతో ఆట నిలిచే సమయానికి 5.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 16 పరుగులు చేసింది. ఆ తర్వాత మళ్లీ ఆట సాధ్యపడలేదు. తొలి ఓవర్లోనే వినిఫ్రెడ్ (0)ను దీప్తి శర్మ డకౌట్ చేసింది. నాలుగో ఓవర్లో వాన్ జులియా (1)ను రాజేశ్వరి బౌల్డ్ చేసింది. డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం 5.2 ఓవర్లలో 47 పరుగులు చేయాల్సి ఉండగా... 16 పరుగులే చేయడం వల్ల మలేసియా అమ్మాయిలు 30 పరుగుల తేడాతో ఓడారు. మరో మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై పాకిస్తాన్ తొమ్మిది వికెట్లతో గెలిచింది. ఈ టోర్నీలో వరుసగా రెండో విజయం సాధించిన భారత జట్టు నేడు జరిగే మ్యాచ్‌లో యూఏఈతో ఆడుతుంది.


రోహిత్

క్లీన్‌స్వీప్‌పై భారత్ గురి

- నేడు దక్షిణాఫ్రికాతో చివరి టి20
- మ్యాచ్‌కు కోహ్లి, రాహుల్ దూరం
- రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం

ఇండోర్: ఆస్ట్రేలియాపై సిరీస్ సొంతమైంది. ఇప్పుడు దక్షిణాఫ్రికాపై కూడా మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ దక్కింది. ఇక శనివారం ప్రపంచ కప్ కోసం ఆస్ట్రేలియాకు బయలుదేరేముందు మరో మ్యాచ్ మాత్రమే మిగిలి ఉంది. అయితే రెండు సిరీస్‌లు సాధించినా, ఒక ప్రధాన సమస్య మాత్రం జట్టును ఇంకా ఇబ్బంది పెడుతోంది. అదే పేస్ బౌలింగ్ పేలవ ప్రదర్శన. మెగా ఈవెంట్‌కు ముందు మిగిలిన ఆఖరి పోరులో భారత టీమ్ మేనేజ్‌మెంట్ దానిని పరిష్కరించుకునే ప్రయత్నం చేస్తుందా అనేదే భారత్ కోణంలో కీలక అంశం. మరోవైపు క్లీన్‌స్వీప్‌నకు గురి కాకుండా చివరి మ్యాచ్‌లోనైనా నెగ్గి పరువు కాపాడుకోవాలని సఫారీ టీమ్ భావిస్తోంది. ఈ నేపథ్యంలో నేడు ఇరు జట్లు చివరి టి20 మ్యాచ్‌లో ఆడనున్నాయి.

షహబాజ్‌కు చాన్స్!

చివరి టి20 మ్యాచ్ కోసం భారత జట్టు ఇద్దరు బ్యాటర్లు కోహ్లి, కేఎల్ రాహుల్‌లకు విశ్రాంతినిచ్చింది. ఈ రెండు స్థానాలు మినహా ఇతర జట్టులో భారత్ ఎలాంటి మార్పు చేసే అవకాశం లేదు. కోహ్లి దూరం కావడంతో స్టాండ్‌బైలో ఉన్న ఏకైక బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌కు తుది జట్టులో స్థానం లభించనుంది. మరో ప్రత్యామ్నాయ బ్యాటర్ లేడు కాబట్టి ఆల్‌రౌండర్ షహబాజ్ అహ్మద్‌ను ఎంపిక చేయవచ్చని తెలుస్తోంది. బౌలింగ్ విషయంలో భారత్ వ్యూహం ఎలా ఉండబోతోంది అనేది కీలకం. దీపక్ చహర్, అర్ష్‌దీప్, అక్షర్, అశ్విన్ ఖాయం కాగా... హర్షల్‌కు బదులుగా సిరాజ్ రూపంలో ప్రత్యామ్నాయం సిద్ధంగా ఉంది. అయితే వరల్డ్‌కప్ జట్టులో ఉన్న హర్షల్ ఇటీవలే గాయం నుంచి కోలుకున్నాడు కాబట్టి అతడికే మరో అవకాశం ఇవ్వడమే మంచిదని టీమ్ మేనేజ్‌మెంట్ ఆలోచన.


షేక్ యాసిన్


సత్య జ్యోతి


సౌమ్య

ఆంధ్రప్రదేశ్‌కు మూడు పతకాలు

అహ్మదాబాద్: జాతీయ క్రీడల్లో సోమవారం ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు మూడు పతకాలు సొంతం చేసుకున్నారు. మహిళల వెయిట్‌లిఫ్టింగ్ 87 కేజీల విభాగంలో టి.సత్యజ్యోతి కాంస్య పతకాన్ని సాధించింది. సత్యజ్యోతి మొత్తం 201 కేజీలు (స్నాచ్‌లో 90+క్లీన్ అండ్ జెర్క్‌లో 111) బరువెత్తి మూడో స్థానంలో నిలిచింది. కోమల్ (మహారాష్ట్ర; 210 కేజీలు) స్వర్ణం నెగ్గగా... ఉష (కర్ణాటక; 209 కేజీలు) రజతం దక్కించుకున్నారు.

రిథమిక్ జిమ్నాస్టిక్స్‌లో భాగంగా మహిళల ట్రాంపోలిన్ ఈవెంట్‌లో షేక్ యాసిన్ రజత పతకం కైవసం చేసుకుంది. ఫైనల్లో షేక్ యాసిన్ తన విన్యాసాలతో అలరించి 40.5 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచింది. రాహీ (మహారాష్ట్ర; 42.8 పాయింట్లు) స్వర్ణం, సిద్ధి బ్రీడ్ (మహారాష్ట్ర; 40.3 పాయింట్లు) కాంస్య పతకం గెల్చుకున్నారు.

మహిళల అథ్లెటిక్స్ హెప్టాథ్లాన్ ఈవెంట్‌లో సౌమ్య మురుగన్ ఆంధ్రప్రదేశ్‌కు కాంస్య పతకాన్ని అందించింది. తమిళనాడుకు చెందిన సౌమ్య విజయవాడలోని దక్షిణ మధ్య రైల్వేలో క్లర్క్‌గా పని చేస్తోంది. జాతీయ క్రీడల్లో రైల్వేస్ జట్టు లేకపోవడంతో ఆమె ఆంధ్రప్రదేశ్ తరఫున పోటీపడింది. ఏడు అంశాల (100 మీటర్ల హర్డిల్స్, హైజంప్, షాట్‌పుట్, 200 మీటర్లు, లాంగ్‌జంప్, జావెలిన్ త్రో, 800 మీటర్లు) సమాహారమైన హెప్టాథ్లాన్‌లో సౌమ్య మొత్తం 5,254 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచింది.

మహిళల ఆర్చరీ కాంపౌండ్ టీమ్ విభాగంలో కె.శరణ్య, ఎం.సూర్య హంసిని, బి.షణ్ముఖ నాగ సాయి, ఆర్. రూపచంద్ర హాసినిలతో కూడిన ఆంధ్రప్రదేశ్ జట్టు ఫైనల్ చేరి కనీసం రజతం ఖాయం చేసుకుంది. సెమీఫైనల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు 228–225తో ఢిల్లీని ఓడించింది.

ఇంగ్లండ్‌దే టి20 సిరీస్

ఆఖరి మ్యాచ్‌లో పాక్ ఓటమి

లాహోర్: 17 ఏళ్ల తర్వాత పాకిస్తాన్ పర్యటనకు వచ్చిన ఇంగ్లండ్ టి20 సిరీస్‌ను పట్టుకెళ్లింది. 7 మ్యాచ్‌ల సిరీస్‌ను ఇంగ్లండ్ 4–3తో కైవసం చేసుకుంది. ఆదివారం రాత్రి జరిగిన ఆఖరిపోరులో ఇంగ్లండ్ 67 పరుగుల తేడాతో పాకిస్తాన్‌పై గెలుపొందింది. ముందుగా ఇంగ్లండ్ 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. డేవిడ్ మలాన్ (47 బంతుల్లో 78 నాటౌట్; 8 ఫోర్లు, 3 సిక్స్) దంచేశాడు. ఆఖర్లో బ్రూక్ (29 బంతుల్లో 46 నాటౌట్; 1 ఫోర్, 4 సిక్సర్లు) భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. తర్వాత భారీలక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన పాకిస్తాన్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 142 పరుగులే చేయగలిగింది. ఆరంభంలోనే ఓపెనర్లు రిజ్వాన్ (1), బాబర్ ఆజమ్ (4) వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. మసూద్ (43 బంతుల్లో 56; 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించగా, తర్వాత వచ్చిన వారిలో ఖుష్‌దిల్ షా (27; 1 ఫోర్, 1 సిక్స్) మెరుగ్గా ఆడాడు. మిగతా వారంతా విఫలమయ్యారు. వోక్స్ 3, డేవిడ్ విల్లే 2 వికెట్లు తీశారు.



ప్రిక్వార్టర్ ఫైనల్లో భారత మహిళల జట్టు

- ఈజిప్ట్‌పై 3–1తో విజయం
- రెండు మ్యాచ్‌ల్లో నెగ్గిన శ్రీజ

చెంగ్డూ (చైనా): ప్రపంచ టేబుల్ టెన్నిస్ (టీటీ) టీమ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ, మనిక బత్రా, దియా చిటాలె, రీత్ టెన్నిసన్, స్వస్తిక ఘోష్‌లతో కూడిన భారత మహిళల జట్టు ప్రిక్వార్టర్ ఫైనల్ దశకు అర్హత సాధించింది. సోమవారం జరిగిన గ్రూప్–5 చివరి లీగ్ మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 3–1తో ఈజిప్ట్‌ను ఓడించింది. తొలి మ్యాచ్‌లో జాతీయ చాంపియన్ శ్రీజ 11–6, 11–4, 11–1తో హనా గోడాపై నెగ్గగా... రెండో మ్యాచ్‌లో మనిక 8–11, 11–6, 11–7, 2–11, 11–8తో దీనా మెష్రెఫ్‌ను ఓడించడంతో భారత్ 2–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. మూడో మ్యాచ్‌లో దియా 11–5, 10–12, 11–9, 9–11, 4–11తో యుస్రా హెల్మీ చేతిలో ఓడిపోయింది. నాలుగో మ్యాచ్‌లో శ్రీజ 11–8, 11–8, 9–11, 11–6తో దీనా మెష్రెఫ్‌పై గెలుపొందడంతో భారత విజయం ఖరారైంది. నాలుగు జట్లున్న గ్రూప్–5లో భారత్ ఐదు పాయింట్లతో రెండో స్థానంలో, జర్మనీ ఆరు పాయింట్లతో టాపర్‌గా నిలిచాయి.


శ్రీజ

హ్యాట్రిక్ విజయం...

కజకిస్తాన్‌తో జరిగిన గ్రూప్–2 లీగ్ మ్యాచ్‌లో భారత పురుషుల జట్టు 3–2తో గెలిచి వరుసగా మూడో విజయం నమోదు చేసింది. నేడు ఫ్రాన్స్‌తో మ్యాచ్‌లో భారత్ గెలిస్తే ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుతుంది. కజకిస్తాన్‌తో పోటీలో తొలి మ్యాచ్‌లో సత్యన్ 11–1, 11–9, 11–5తో డెనిస్ జొలుదెవ్‌పై గెలిచాడు. రెండో మ్యాచ్‌లో హర్మీత్ దేశాయ్ 6–11, 8–11, 9–11తో కిరిల్ చేతిలో ఓడిపోయాడు. మూడో మ్యాచ్‌లో మానవ్ ఠక్కర్ 12–10, 11–1, 11–8తో కుర్మంగలియెవ్‌పై నెగ్గాడు. నాలుగో మ్యాచ్‌లో సత్యన్ 11–6, 5–11, 14–12, 9–11, 6–11తో కిరిల్ చేతిలో ఓటమి చెందడంతో స్కోరు 2–2తో సమమైంది. నిర్ణాయక ఐదో మ్యాచ్‌లో హర్మీత్ 12–10, 11–9, 11–6తో డెనిస్ జొలుదెవ్‌ను ఓడించి విజయాన్ని ఖాయం చేశాడు.



సౌరాష్ట్ర పోరాటం

రాజ్‌కోట్: రెస్ట్ ఆఫ్ ఇండియాతో జరుగుతున్న ఇరానీ కప్‌లో సౌరాష్ట్ర లోయర్ ఆర్డర్ బ్యాటర్స్‌తో పోరాడుతోంది. మిడిలార్డర్‌లో షెల్డన్ జాక్సన్ (71; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు), అర్పిత్ (55; 7 ఫోర్లు, 1 సిక్స్), లోయర్ ఆర్డర్‌లో ప్రేరక్ మన్కడ్ (72; 9 ఫోర్లు), జైదేవ్ ఉనాద్కట్ (78 బ్యాటింగ్; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధసెంచరీలతో కదంతొక్కారు. దీంతో ఓవర్‌నైట్ స్కోరు 49/2తో మూడో ఆట కొనసాగించిన సౌరాష్ట్ర రెండో ఇన్నింగ్స్‌లో 8 వికెట్ల నష్టానికి 368 పరుగులు చేసింది. ప్రస్తుతం 92 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. రెస్ట్ ఆఫ్ ఇండియా బౌలర్లలో సౌరభ్, కుల్దీప్ సేన్ చెరో 3 వికెట్లు తీశారు. ఇంకా రెండు రోజుల ఆట మిగిలుంది.

భారత్ X పాకిస్తాన్

దుబాయ్: వరల్డ్ కప్‌లో భారత్ తొలి మ్యాచ్ పాకిస్తాన్‌తో... పురుషుల క్రికెట్‌లో ఎన్నో సార్లు కనిపించిన, వినిపించిన ఈ మాట ఇప్పుడు మహిళల క్రికెట్‌లో కూడా... వచ్చే ఏడాది దక్షిణాఫ్రికా వేదికగా జరిగే మహిళల టి20 వరల్డ్‌కప్ షెడ్యూల్‌ను అంతర్జాతీయ క్రికెట్ మండలి విడుదల చేసింది. కేప్‌టౌన్‌లో ఫిబ్రవరి 12న జరిగే గ్రూప్ '2' మ్యాచ్‌లో భారత్, పాకిస్తాన్ తలపడతాయి. ఫిబ్రవరి 10 నుంచి 26 వరకు ఈ టోర్నీ జరుగుతుంది. గ్రూప్ '2'లో భారత్, పాక్‌లతో పాటు ఇంగ్లండ్, వెస్టిండీస్, ఐర్లాండ్ ఉన్నాయి. దక్షిణాఫ్రికాతో పాటు శ్రీలంక, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, బంగ్లాదేశ్ గ్రూప్ '1'లో పోటీ పడతాయి. రెండు గ్రూప్‌ల నుంచి టాప్–2 టీమ్‌లు సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తాయి.

సినిమా


సుధీర్ బాబు

ఏ.. బీ.. కథేంటి?

అర్జున్ ప్రసాద్ ఒక్కడే. కానీ అతని లోపల ఇద్దరున్నారు. ఒకరు ఏ, మరొకరు బీ. అయితే 'ఏ' జీవితం గురించి 'బీ'కి తెలియదు. కానీ 'ఏ'కి తెలిసిన భాషలు, స్కిల్స్, పోలీస్ ట్రైనింగ్ 'బీ'లో ఉన్నాయి. కానీ, అర్జున్‌కి మాత్రం 'ఏ'గా ఉండటమే ఇష్టం. ఇక పోలీసాఫీసర్‌గా అర్జున్ పరిష్కరించాలనుకున్న కేసు ఏంటి? ఏ, బీల కహానీ ఏంటి? అనే కథతో 'హంట్' చిత్రం సాగుతుంది. అర్జున్ ప్రసాద్ పాత్రలో సుధీర్ బాబు హీరోగా వి. ఆనంద ప్రసాద్ నిర్మిస్తున్న చిత్రం 'హంట్'. మహేశ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో శ్రీకాంత్, 'ప్రేమిస్తే' ఫేమ్ భరత్ ప్రధాన పాత్రలు పోషించారు. సోమవారం ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. ''ఇదొక స్టైలిష్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ. ఇటీవలే షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం రీ రికార్డింగ్ దశలో ఉంది. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం'' అని వి. ఆనంద ప్రసాద్ అన్నారు. ''ఇంటర్నేషనల్ టెర్రరిజమ్‌ను టచ్ చేస్తూ తెరకెక్కించిన పోలీస్ థ్రిల్లర్ మూవీ ఇది. అర్జున్ ప్రసాద్ క్యారెక్టర్ కోసం సుధీర్ బాబుగారు ఎంతో హార్డ్ వర్క్ చేశారు'' అని మహేశ్ అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: జిబ్రాన్, కెమెరా: అరుళ్ విన్సెంట్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: అన్నే రవి.


జగపతిబాబు

రుద్రంగి నాది!

జగపతిబాబు, ఆశిష్ గాంధీ, విమలా రామన్, మమతా మోహన్ దాస్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రుద్రంగి'. 'బాహుబలి, ఆర్ఆర్ఆర్' చిత్రాలకు రైటర్‌గా చేసిన అజయ్ సామ్రాట్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. రసమయి ఫిలిమ్స్ బ్యానర్‌పై ఎమ్మెల్యే, కవి, గాయకుడు రసమయి బాలకిషన్ నిర్మించారు. 'రుద్రంగి' ఫస్ట్ లుక్, టైటిల్ మోషన్ పోస్టర్‌ని సోమవారం చిత్రబృందం విడుదల చేసింది. 'రుద్రంగి నాది.. రుద్రంగి బిలాంగ్స్ టు మీ' అంటూ జగపతిబాబు చెప్పే డైలాగ్ వినిపిస్తుంది. జాలి, దయ లేని భీమ్ రావ్ దొరగా జగపతిబాబుని పరిచయం చేశారు. ''త్వరలో సినిమాని రిలీజ్ చేస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: నాఫల్ రాజా ఐఏఎస్, కెమెరా: సంతోష్ శన మోని.

లూసిఫర్‌లో లేనిది గాడ్ ఫాదర్‌లో ఉంది!

- మోహన్ రాజా



"మలయాళ 'లూసిఫర్' కి నేను పెద్ద అభిమానిని. ఆ సినిమాని గొప్పగా ప్రేమించి ఇంకా గొప్పగా తీసిన సినిమా 'గాడ్ ఫాదర్' అని డైరెక్టర్ మోహన్ రాజా అన్నారు. చిరంజీవి హీరోగా మోహన్ రాజా దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గాడ్‌ఫాదర్'. సల్మాన్ ఖాన్, నయనతార, సత్యదేవ్ కీలక పాత్రలు చేశారు. కొణిదెల సురేఖ సమర్పణలో ఆర్‌బి చౌదరి, ఎన్వీ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా రేపు (బుధవారం) విడుదల అవుతోంది. ఈ సందర్భంగా మోహన్ రాజా పంచుకున్న విశేషాలు.

- నేను పుట్టింది తమిళనాడులో అయినా దర్శకుడిగా జన్మనిచ్చింది తెలుగు చిత్రపరిశ్రమ. మా నాన్నగారు (ఎడిటర్ మోహన్) వేసిన బాటలో నేను, తమ్ముడు ('జయం' రవి) ప్రయాణిస్తున్నాం. తెలుగులో 10 ఏళ్లలో 9 వరుస హిట్లు అందుకున్నారు నాన్నగారు. రవిని హీరోగా చేసేందుకు తమిళ ఇండస్ట్రీకి షిఫ్ట్ అయ్యాం. నా తొలి తెలుగు చిత్రం 'హనుమాన్ జంక్షన్' విడుదలై 21 ఏళ్లు అయింది. ఇన్నేళ్ల తర్వాత తెలుగులో 'గాడ్ ఫాదర్' చేయడం గర్వంగా ఉంది. ఇన్నేళ్లు తెలుగుకి దూరంగా ఉన్నాననే భావన కలగ లేదు.. ఎందుకంటే ఆరు తెలుగు సినిమాలను వరుసగా తమిళ్‌లో రీమేక్ చేశా.
- ఎన్వీ ప్రసాద్‌గారు నాకు చిన్నప్పటి నుండి తెలుసు. నన్ను మళ్లీ తెలుగులోకి రమ్మని పిలిచేవారు. ఒక సారి మహేశ్‌బాబు దగ్గరికి కూడా తీసుకెళ్లారు. 'తని వరువన్' (ధ్రువ) నుండి రామ్ చరణ్‌తో పరిచయం. 'ధ్రువ –2' గురించి చర్చలు జరుపుతున్న సమయంలో 'లూసిఫర్' రీమేక్ ప్రస్తావన వచ్చింది. ఈ సినిమాకి దర్శకుడిగా నా పేరుని ఎన్వీ ప్రసాద్‌గారు సూచించడంతో చిరంజీవిగారు, చరణ్‌లు ఓకే అన్నారు. 'లూసిఫర్' లో నాకు దొరికిన ఒక కొత్త కోణం చిరంజీవిగారికి చాలా నచ్చింది.
- 'లూసిఫర్'లో లేని ఒక కోణం 'గాడ్‌ఫాదర్'లో ఉంటుంది. కథని అలాగే ఉంచి ఫ్రెష్ స్క్రీన్ ప్లే చేశాను. ఇందులోని పది పాత్రలు చాలా సర్‌ప్రైజింగ్‌గా ఉంటాయి. 'గాడ్‌ఫాదర్' చిరంజీవిగారి ఇమేజ్‌కి తగ్గ కథ. ఈ కథకి సరిపడే ఇమేజ్ ఉన్న హీరోలు ఇండియాలో ఓ ముగ్గురు మాత్రమే ఉంటారు.
- 'లూసిఫర్' లో పృథ్వీరాజ్ సుకుమారన్ చేసిన పాత్రలో సల్మాన్ ఖాన్‌గారు బాగుంటుందనే ఆలోచన నాదే. రామ్‌చరణ్ అడగ్గానే చిరంజీవిగారిపై ఉన్న ప్రేమతో ఈ మూవీ ఒప్పుకున్న సల్మాన్‌కి థ్యాంక్స్. చిరంజీవి, సల్మాన్ ఖాన్‌లాంటి మెగాస్టార్లని డైరెక్ట్ చేయడం చాలా ఒత్తిడిగా ఉంటుంది.. అయితే చిరంజీవిగారు ఇచ్చిన ప్రోత్సాహం మర్చిపోలేను.
- చిరంజీవిగారితో మా నాన్నగారు 'హిట్లర్' అనే హిట్ మూవీ నిర్మించారు. నేను 'గాడ్‌ఫాదర్' అనే హిట్ ఇవ్వబోతుండటం హ్యాపీ. మలయాళంలో 'లూసిఫర్ 2' మొదలైంది. ప్రస్తుతం నా దృష్టి 'గాడ్ ఫాదర్' పైనే ఉంది. అయితే ఈ సినిమా సీక్వెల్‌కి మంచి కంటెంట్ ఉంది.

వారు లేకుంటే ఇండస్ట్రీ లేదు

- సునీల్ నారంగ్


సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు

''**వం**దకి ఎనభైశాతం మంది మధ్యతరగతి ప్రేక్షకులే సినిమాలు చూస్తారు. వారు లేకుంటే ఇండస్ట్రీ లేదు.. అందుకే మిడిల్‌క్లాస్ వారిని దృష్టిలో పెట్టుకునే 'ది ఘోస్ట్' టికెట్ ధరలు నిర్ణయించాం'' అని నిర్మాత సునీల్ నారంగ్ అన్నారు. అక్కినేని నాగార్జున, సోనాల్ చౌహాన్ జంటగా ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ది ఘోస్ట్'. నారాయణ్ దాస్ నారంగ్ ఆశీస్సులతో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు, శరత్ మరార్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 5న విడుదలవుతోంది. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో సునీల్ నారంగ్ మాట్లాడుతూ– ''నాన్నగారితో(నారాయణ్ దాస్) ఉన్న అనుబంధంతో నాగార్జునగారు ఈ సినిమా చేసినందుకు థ్యాంక్స్. ప్రవీణ్ సత్తారు అద్భుతంగా తీశాడు. ప్రేక్షకులు ఓటీటీకి అలవాటు పడ్డారు.. రెండు వారాల తర్వాత ఓటీటీలో వస్తుందని అనుకుంటున్నారు. ఎక్కువ మొత్తంలో టికెట్ ధర పెట్టి సినిమా చూసేందుకు ఇష్టపడటం లేదు. సినిమా చాలా బాగుందనే టాక్ వస్తే తప్ప థియేటర్‌కి వెళ్లడం లేదు. అలాగే టికెట్, క్యాంటీన్‌లో ధరలు కూడా తగ్గితే చిన్న సినిమాకి కూడా ప్రేక్షకులు మునుపటిలా థియేటర్‌కి వస్తారు. ఓటీటీని నియంత్రించాలనే చర్చలు జరుగుతున్నాయి'' అన్నారు. పుస్కూర్ రామ్మోహన్ రావు మాట్లాడుతూ– ''గ్రేట్ ఫ్యామిలీ ఎమోషన్స్ ఉన్న కంప్లీట్ మాస్ యాక్షన్ మూవీ 'ది ఘోస్ట్'. నాగార్జున కెరీర్లో భారీ బడ్జెట్ చిత్రమిది. సంక్రాంతిలానే దసరా కూడా సినిమా పండగ. రెండు పెద్ద చిత్రాలు (గాడ్‌ఫాదర్, ది ఘోస్ట్) రావడం ప్రేక్షకులకు సినిమా పండగలా ఉంటుంది. మా సినిమా తొమ్మిదిరోజులు బాగా ఆడితే చాలు.. ఈ నెల 14వ తారీఖు వరకూ.. ఇక నాగార్జునగారి ట్రెండ్ సెట్టర్ 'శివ' కూడా అక్టోబర్ 5 విడుదలయింది. ఆ సెంటిమెంట్ ప్రకారం అక్టోబర్ 5న 'ది ఘోస్ట్' రిలీజ్ చేస్తున్నాం. ప్రస్తుతం మా బ్యానర్‌లో రూపొందిన 'ప్రిన్స్' దీపావళికి విడుదలవుతుంది. సందీప్ కిషన్‌తో ఓ సినిమా, సుధీర్ బాబుతో ఒక మూవీ, శేఖర్ కమ్ముల– ధనుష్ కాంబోలో ఓ చిత్రం చేస్తున్నాం. అలాగే వెంకటేష్‌గారితో ఒక సినిమా ఉంటుంది'' అన్నారు.

ఆ ఆలోచన లేదు

- వర్ష బొల్లమ్మ



''**నా**కు సహజత్వానికి దగ్గరగా ఉండే కథలంటే ఇష్టం. 'స్వాతిముత్యం' కథలో కొత్తదనం ఉంది. ప్రేమ, వినోదంతో కూడిన కుటుంబ కథా చిత్రంగా రూపొందిన ఈ సినిమా ప్రేక్షకులను అలరిస్తుంది'' అని హీరోయిన్ వర్ష బొల్లమ్మ అన్నారు. గణేష్, వర్ష బొల్లమ్మ జంటగా లక్ష్మణ్ కె. కృష్ణ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'స్వాతిముత్యం'. సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 5న విడుదల కానుంది. ఈ సందర్భంగా వర్ష బొల్లమ్మ మాట్లాడుతూ–''సితార ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌లో అవకాశం అనగానే చేయాలనుకున్నాను. అలాగే కథ నచ్చడంతో 'స్వాతిముత్యం' చేయాలని ఫిక్స్ అయ్యాను. నా నిజ జీవితానికి దగ్గరగా ఉండే పాత్ర ఇది. ఇందులో భాగ్యలక్ష్మి అనే టీచర్ పాత్ర చేశాను. బయట సరదాగా ఉంటాను, కానీ విద్యార్థుల ముందు కాస్త కఠినంగా ఉంటాను. నిజ జీవితంలోని నా గురువుల స్ఫూర్తితో ఈ సినిమాలో సహజంగా నటించాను. ఇందులో గణేష్ పాత్ర చాలా అమాయకంగా ఉంటుంది. నా పాత్ర కొంచెం డామినేటింగ్‌గా ఉంటుంది. ప్రేక్షకులు మధ్యతరగతి అమ్మాయిగా నన్ను చూడటానికి ఇష్టపడుతున్నారనుకుంటున్నాను. అందుకే అలాంటి పాత్రలు ఎక్కువ పేరు తీసుకొస్తున్నాయి. లక్ష్మణ్‌గారి రచన నాకు చాలా నచ్చింది. టాప్ హీరోయిన్ అవ్వాలనే ఆలోచన నాకు లేదు.. నటిగా మంచి పేరు తెచ్చుకోవాలనుంది. కమర్షియల్ సినిమాల్లోనూ నటనకు ప్రాధాన్యమున్న పాత్రలు చేస్తాను. ప్రతినాయిక ఛాయలున్న సైకో పాత్ర బాగా చేయగలననే నమ్మకం ఉంది. 'ఆర్ఆర్ఆర్' లో 'కొమురం భీముడో..' పాటలో ఎన్టీఆర్‌గారి నటన చాలా నచ్చింది. ఆయన నటనకు నేను ఫ్యాన్. ప్రస్తుతం సందీప్ కిషన్‌తో ఓ సినిమాలో నటిస్తున్నాను. మరో రెండు తెలుగు, తమిళ సినిమాలు కూడా ఉన్నాయి'' అన్నారు.

డంపింగ్ యార్డ్‌లో...

ముఖేష్ గుప్తా, అనన్య నాగళ్ల హీరో హీరోయిన్లుగా రూపొందుతున్న చిత్రం 'నవాబ్'. రవిచరణ్ దర్శకత్వంలో నమో క్రియేషన్స్ పతాకంపై ఆర్‌ఎం నిర్మిస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో రవిచరణ్ మాట్లాడుతూ – ''నా మొదటి సినిమా 'నల్లమల'కు మంచి ఆదరణ లభించింది. ఆ ఉత్సాహంతో 'నవాబ్' తెరకెక్కిస్తున్నాం. పూర్తిగా డంపింగ్ యార్డ్‌లో సాగే కథతో ఈ సినిమా ఉంటుంది. దీని కోసం పదెకరాల్లో డంపింగ్ యార్డ్ సెట్ వేశాం. మా హీరో ముఖేష్ గుప్తా తెలుగు కాదు. ఆర్నెళ్లు తెలుగు నేర్చుకుని అద్భుతంగా నటిస్తున్నారు'' అన్నారు. ''ఓ మంచి కథతో రూపొందుతున్న 'నవాబ్'లో హీరోగా నటించడం ఆనందంగా ఉంది'' అన్నారు ముఖేష్ గుప్తా.


రవిచరణ్, ముఖేష్ గుప్తా

ఇండియా టు పాకిస్థాన్

'భద్రం బీ కేర్ ఫుల్ బ్రదర్' చిత్రంతో సుపరిచితుడైన చరణ్ హీరోగా కరిష్మా హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రం 'రోరి'. చరణ్ రోరి హీరోగా నటించి, స్వీయదర్శకత్వంలో రూపొందిస్తున్నారు. సీటీఎఫ్ స్టూడియోస్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రం టీజర్ సోమవారం విడుదలైంది. ఈ సందర్భంగా చరణ్ రోరి మాట్లాడుతూ– ''హైదరాబాద్ పొలిటికల్ బ్యాక్‌డ్రాప్‌లో జరిగే ఓ కుర్రాడి కథ ఇది. అనుకోని పరిస్థితుల్లో పాకిస్థాన్ వెళ్లే ఆ కుర్రాడు హిందువులని కలిసి వారి కష్టాలు తెలుసుకుంటాడు. వారితో సహా ఆ కుర్రాడు ఇండియా ఎలా చేరుకున్నాడు? అనేది చిత్రకథ. కథనం ఉత్కంఠభరితంగా ఉంటుంది. త్వరలో సినిమా విడుదల తేదీ తెలియజేస్తాం'' అన్నారు. కోటా శ్రీనివాసరావు, జయప్రకాష్, దేవీప్రసాద్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్, కెమెరా: దాశరథి శివేంద్ర.


చరణ్

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
638	207
56,789	16,887

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ప్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్‌	10,717	△	141
డోజోన్స్‌	29,370	△	644
ఎఫ్‌టీఎస్‌ఈ 100	6,909	△	15
డాక్స్‌	12,209	△	99
షాంఘై (సెప్టెంబర్‌ 30 ముగింపు)	3,024	▽	17
నికాయ్‌	26,216	△	279

•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

నవంబర్‌ నుంచి బీఎస్‌ఎన్‌ఎల్‌ 4జీ నెట్‌వర్క్‌



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ టెలికం సంస్థ బీఎస్‌ఎన్‌ఎల్‌ నవంబర్‌ నుంచి తమ 4జీ నెట్‌వర్క్‌ను అందుబాటులోకి తేనుంది. వచ్చే ఏడాది ఆగస్టు నాటికి క్రమంగా దాన్ని 5జీకి అప్‌గ్రేడ్‌ చేసుకోనుంది. ఇండియా మొబైల్‌ కాంగ్రెస్‌లో పాల్గొన్న సందర్భంగా బీఎస్‌ఎన్‌ఎల్‌ సీఎండీ పి.కె. పుర్వార్‌ ఈ విషయాలు తెలిపారు. 18 నెలల్లో 1.25 లక్షలకు పైగా 4జీ మొబైల్‌ సైట్లను ప్రారంభించే యోచనలో ఉన్నట్లు వివరించారు. దేశీ 4జీ టెక్నాలజీని వినియోగించేందుకు ఐటీ దిగ్గజం టీసీఎస్, ప్రభుత్వ రంగ టెలికం పరిశోధన సంస్థ సీ–డాట్‌ సారథ్యంలోని కన్సార్షియంతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. 2023 ఆగస్టు 15 నాటికి బీఎస్‌ఎన్‌ఎల్‌ 5జీ కార్యకలాపాలు ప్రారంభించాలంటూ టెలికం శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ నిర్దేశించారని, తదనుగుణంగా కృషి చేస్తున్నామని పుర్వార్‌ పేర్కొన్నారు.

బులియన్‌ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	50,387
బంగారం (99.5 స్వచ్ఛత)	50,185
వెండి (కిలో)	57,317

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్‌ / 100కు రూ.లలో)

4-10-2022	
విశాఖ	430–00
చిత్తూరు	423–00
ఈస్ట్, వెస్ట్‌ గోదావరి	430–00
విజయవాడ	430–00
రిటైల్‌ ధర (డజను)	66.00
3-10-2022 ఫామ్‌ ధర...	
హైదరాబాద్‌	401–00
వరంగల్‌	403–00
రిటైల్‌ ధర	4.60

బిల్‌డెస్క్‌ కొనుగోలుకు నో

- ప్రోజస్‌ ఎన్‌వీ (పేయూ) వెనకడుగు
- రూ. 38,400 కోట్ల విలువైన డీల్‌ రద్దు

న్యూఢిల్లీ: దేశీ డిజిటల్‌ చెల్లింపుల కంపెనీ బిల్‌డెస్క్‌ కొనుగోలు ప్రతిపాదనను విరమించుకుంటున్నట్లు ప్రోజస్‌ ఎన్‌వీ తాజాగా పేర్కొంది. 4.7 బిలియన్‌ డాలర్ల (దాదాపు రూ. 38,400 కోట్లు) విలువైన ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్లు పేయూ నిర్వాహక సంస్థ ప్రోజస్‌ ఎన్‌వీ వెల్లడించింది. డీల్‌కు సంబంధించి గడువులోగా కొన్ని పరిస్థితులు అనుకూలించలేదని తెలియజేసింది. సెప్టెంబర్‌ ముగిసేలోగా ముందుగా చేసుకున్న కొన్ని ఒప్పంద పరిస్థితులను చేరుకోలేకపోవడంతో తాజా నిర్ణయానికి వచ్చినట్లు డచ్‌ ఈ–కామర్స్‌ దిగ్గజం ప్రోజస్‌ వివరించింది. అయితే ఈ డీల్‌కు సెప్టెంబర్‌ 5న కాంపిటీషన్‌ కమిషన్‌ (సీసీఐ) నుంచి అనుమతులు లభించినప్పటికీ ఏ ఇతర పరిస్థితులు అడ్డుపడ్డాయో వివరించకపోవడం గమనార్హం! డీల్‌ నిబంధనల ప్రకారం కాంట్రాక్టు ఆటోమేటిక్‌గా రద్దుకానున్నట్లు కూడా ప్రోజస్‌ వెల్లడించింది.



భారీ కంపెనీగా

బిల్‌డెస్క్‌ను పేయూ సొంతం చేసుకుని ఉంటే వార్షికంగా 147 బిలియన్‌ డాలర్ల విలువైన పరిమాణం (టీపీవీ) ద్వారా డిజిటల్‌ చెల్లింపుల దిగ్గజంగా ఆవిర్భవించి ఉండేది. ప్రత్యర్థి సంస్థలు రేజర్‌పే 50 బిలియన్‌ డాలర్లు, సీసీఎవెన్యూ(ఇన్ఫీబీమ్‌) 18–20 బిలియన్‌ డాలర్ల టీపీవీ కలిగి ఉన్నట్లు అంచనా. డీల్‌ పూర్తయిఉంటే ప్రోజస్‌ చేపట్టిన అతిపెద్ద కొనుగోలుగా నిలిచేది. కాగా.. గతేడాది ఆగస్ట్‌ 31న బిల్‌డెస్క్‌ కొనుగోలుకి ప్రోజస్‌ నగదు రూపేణా ఒప్పందాన్ని కుదుర్చుకుంది. తద్వారా భారత్‌లో వేగంగా విస్తరిస్తున్న ఫిన్‌టెక్‌ రంగంలో విస్తరించేందుకు వీలు చిక్కేది.

దేశంలో పెట్టుబడులు

ప్రోజస్‌ మాతృ సంస్థ నేస్పర్స్‌ 4.5 లక్షల బిజినెస్‌లకు 100 రకాలకుపైగా చెల్లింపుల విధానాలలో సేవలు అందిస్తోంది. ప్రోజస్‌ ద్వారా దేశీయంగా దీర్ఘకాలిక ఇన్వెస్టర్‌గా కొనసాగుతోంది. స్విగ్గీ, ఫార్మ్‌ఈజీ తదితర టెక్నాలజీ కంపెనీలలో 6 బిలియన్‌ డాలర్లు ఇన్వెస్ట్‌ చేసింది. ఇక బిల్‌డెస్క్‌ను ఆర్థర్‌ ఆండర్సన్, ఎంఎన్‌ శ్రీనివాసు, అజయ్‌ కౌశల్‌– కార్తిక్‌ గణపతి 2000లో ఏర్పాటు చేశారు. స్మార్ట్‌ఫోన్ల వినియోగంతో డిజిటల్‌ చెల్లింపుల వ్యవస్థ ఊపందుకుంది. ఇది కంపెనీ పురోభివృద్ధికి సహకరించింది. డీల్‌ సాకారమైతే వ్యవస్థాపకులు ఒక్కొక్కరికీ 50 కోట్ల డాలర్ల చొప్పున లభించి ఉండేవి. బిల్‌డెస్క్‌లో జనరల్‌ అట్లాంటిక్‌ 14.2 శాతం, టీఏ అసోసియేట్స్‌ 13.1 శాతం, వీసా 12.6 శాతం చొప్పున వాటాలు కలిగి ఉన్నాయి. ముగ్గురు ప్రమోటర్లకు దాదాపు 30 శాతం వాటా ఉంది.

సెప్టెంబర్‌లో తయారీ మందగమనం



55.1కు తగ్గిన పీఎంఐ

న్యూఢిల్లీ: భారత్‌ తయారీ రంగం స్పీడ్‌ సెప్టెంబర్‌లో మందగమనంలో ఉందని ఎస్‌అండ్‌పీ గ్లోబల్‌ ఇండియా మాన్యుఫ్యాక్చరింగ్‌ మేనేజర్స్‌ ఇండెక్స్‌ (పీఎంఐ) పేర్కొంది. తాజాగా వెల్లడయిన గణాంకాల ప్రకారం ఆగస్టులో సూచీ 56.2 వద్ద ఉంటే అది సెప్టెంబర్‌లో 55.1కి తగ్గింది. అయితే సూచీ 50పైన ఉంటే వృద్ధి ధోరణిగానే భావించడం జరుగుతుంది. ఆ లోపునకు పడిపోతేనే క్షీణతగా పరిగణిస్తారు. ఈ ప్రాతిపదికన పీఎంఐ 50 పైన ఉండడం వరుసగా ఇది 15వ నెల. కాగా ఉపాధి కల్పన, ముడిపదార్థాల ధరలకు సంబంధించి సెప్టెంబర్‌లో సానుకూల పరిస్థితులు నమోదయినట్లు సంస్థ ఎకనమిక్స్‌ అసోసియేట్‌ డైరెక్టర్‌ పోలియానా డీ లిమా పేర్కొన్నారు. ముడిపదార్థాల ధరల స్పీడ్‌ గడచిన రెండేళ్లలో ఎన్నడూ లేనంత తక్కువగా ఉన్నట్లు తెలిపారు. దాదాపు 400 సంస్థల పర్చేజింగ్‌ మేనేజర్స్‌ నుంచి పొందిన సమాచారం ఆధారంగా మాన్యుఫ్యాక్చరింగ్‌ పీఎంఐని ఎస్‌అండ్‌పీ గ్లోబల్‌ రూపొందిస్తుంది.

డౌన్‌ట్రెండ్‌లోకి రూపాయి



ముంబై: డాలర్‌ మారకంలో రూపాయి విలువ మళ్లీ దిగువముఖంలోకి జారిపోయింది. ఇంటర్‌ బ్యాంక్‌ ఫారెక్స్‌ మార్కెట్‌లో వరుసగా రెండు ట్రేడింగ్‌ సెషన్లలో (గురు, శుక్ర) 53 పైసలు లాభపడిన రూపాయి, సోమవారం ట్రేడింగ్‌లో తిరిగి భారీగా 42 పైసలు పతనమైంది. 81.82 వద్ద ముగిసింది. దేశీయ ఈక్విటీ మార్కెట్ల బలహీనత, క్రూడ్‌ ఆయిల్‌ ధరలు మళ్లీ కొంత పెరగడం వంటి అంశాలు రూపాయి సెంటిమెంట్‌ను దెబ్బతీశాయని ఫారెక్స్‌ ట్రేడర్లు పేర్కొంటున్నారు. ట్రేడింగ్‌లో 81.65 వద్ద ప్రారంభమైన రూపాయి, ఒక దశలో 81.98 దిగువ స్థాయినీ చూసింది. గత వారం సెప్టెంబర్‌ 26వ తేదీన. ఇంటర్‌ బ్యాంక్‌ ఫారెక్స్‌ మార్కెట్‌ ఇంట్రాడే ట్రేడింగ్‌లో రూపాయి విలువ మొదటిసారిగా 82 దిగువకు పడిపోయింది.

పంజాగుట్టలో జోయాలుక్కాస్‌ షోరూమ్‌ పునఃప్రారంభం

హైదరాబాద్‌: ప్రముఖ ఆభరణాల విక్రయ సంస్థ 'జోయాలుక్కాస్‌' హైదరాబాద్‌లోని పంజాగుట్టలో ఉన్న తన షోరూమ్‌ను నవీకరించింది. ఆధునికంగా రూపొందించిన ఈ షోరూమ్‌ను ఈ నెల 8న తిరిగి ప్రారంభించనున్నట్టు సంస్థ ప్రకటించింది. ఈ సందర్భంగా కస్టమర్లకు పలు ఆఫర్లను ఇస్తున్నట్టు తెలిపింది. వజ్రాలపై 25 శాతం తగ్గింపుతో పాటు, ప్రతీ కొనుగోలుపై కచ్చితంగా ఒక ఉచిత బహుమతిని అందిస్తున్నట్టు ప్రకటించింది. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు ఆభరణాలపై ఆఫర్లు ఉంటాయని తెలిపింది. నవీకరించిన ఈ షోరూమ్‌ వద్ద కస్టమర్ల పార్కింగ్‌కు తగినంత సౌకర్యాలను కల్పించామని జోయాలుక్కాస్‌ వెల్లడించింది. కస్టమర్లకు మరింత మెరుగైన షాపింగ్‌ అనుభవాన్ని అందించేందుకు షోరూమ్‌ను నవీకరించినట్టు జోయాలుక్కాస్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ జోయాలూక్కాస్‌ తెలిపారు. కస్టమర్లకు విస్తృత శ్రేణిలో ఆభరణాల కలెక్షన్స్, సాటిలేని సేవలను అందించేందుకు కట్టుబడి ఉన్నట్టు చెప్పారు.



రిలయన్స్‌ డిజిటల్‌ దసరా ఆఫర్లు

హైదరాబాద్‌: దసరా సందర్భంగా రిలయన్స్‌ డిజిటల్‌ ఆకర్షణీయమైన ఆఫర్లను ప్రకటించింది. బ్యాంకు కార్డులపై 10% తగ్గింపు ఇస్తున్నట్టు ప్రకటించింది. యాపిల్‌ వాచ్‌ను రూ.17,100కు, శామ్‌సంగ్‌ వాచ్‌ను రూ.6,490కు అందిస్తున్నట్టు తెలిపింది. అలాగే, స్మార్ట్‌వాచ్‌లు రూ.1,599 నుంచి అందుబాటులో ఉన్నట్టు పేర్కొంది. ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్లపైనా ప్రత్యేక ఆఫర్లను ఇస్తున్నట్టు తెలిపింది. శామ్‌సంగ్‌ ఎం53 5జీ ఫోన్‌ను కేవలం రూ.19,999కు, శామ్‌సంగ్‌ ఎస్‌22ను రూ. 49,990కే ఆఫర్‌ చేస్తున్నట్టు ప్రకటించింది. సమీపంలోని రిలయన్స్‌ డిజిటల్‌ స్టోర్లు లేదా మైజియో స్టోర్‌ లేదా రిలయన్స్‌డిజిటల్‌ డాట్‌ ఇన్‌ పోర్టల్‌ నుంచి కొనుగోలు చేసుకోవచ్చని సూచించింది.



మళ్లీ అమ్మకాలదే పైచేయి

- వారాంతపు లాభాలకు బ్రేక్‌
- 638 పాయింట్లు పతనం
- 56,789 వద్దకు సెన్సెక్స్‌
- నిఫ్టీ 207 పాయింట్లు డౌన్‌

ముంబై: గత వారం చివర్లో ఒక్కసారిగా జోరందుకున్న స్టాక్‌ ఇండెక్సులు తిరిగి తోకముడిచాయి. ఇన్వెస్టర్లు మళ్లీ అమ్మకాలకే మొగ్గుచూపడంతో నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్‌ 638 పాయింట్లు పతనమై 56,789 వద్దకు చేరగా.. 207 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ 16,887 వద్ద స్థిరపడింది. ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిన ఆర్థిక మాంద్య ఆందోళనలు సెంటిమెంటును బలహీనపరుస్తున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. మరోపక్క వివిధ దేశాల కేంద్ర బ్యాంకులు ద్రవ్యోల్బణ అదుపునకు వడ్డీ రేట్ల పెంపును చేపడుతుండటం స్టాక్స్‌లో అమ్మకాలకు దారితీస్తున్నట్లు తెలియజేశారు. రష్యా– ఉక్రెయిన్‌ యుద్ధ భయాలు, ట్రెజరీ ఈల్డ్స్‌ జోరు సైతం ఇందుకు కారణమవుతున్నట్లు వివరించారు.

ఫార్మా ఎదురీత: ఎన్‌ఎస్‌ఈలో ఫార్మా (1.1%) మినహా అన్ని రంగాలూ నీరసించాయి. ప్రధానంగా మెటల్, ఎఫ్‌ఎంసీజీ, ఆటో, బ్యాంకింగ్‌ 3–1.6 శాతం మధ్య క్షీణించాయి. నిఫ్టీలో అదానీ ఎంటర్, ఐషర్, అదానీ పోర్ట్స్, టాటా కన్జూమర్, మారుతీ, హెచ్‌యూఎల్, ఇండస్‌ఇండ్, హిందాల్కో, బజాజ్‌ ఫైనాన్స్, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్‌ 8.4–2.2% మధ్య పతనమయ్యాయి. అయితే ఓఎన్‌జీసీ 4.6% జంప్‌చేయగా.. డాక్టర్‌ రెడ్డీస్, సిప్లా, బీపీసీఎల్, కోల్‌ ఇండియా 2–1% మధ్య బలపడ్డాయి.



మిడ్‌ క్యాప్స్‌ వీక్‌

మార్కెట్ల బాటలో బీఎస్‌ఈలో మిడ్, స్మాల్‌ క్యాప్స్‌ 1.2–0.5 శాతం డీలా పడ్డాయి. ట్రేడైన షేర్లలో 2,194 నష్టపోగా 1,356 మాత్రమే లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) తాజాగా అమ్మకాల బాట వీడి రూ. 591 కోట్లు ఇన్వెస్ట్‌ చేయగా.. దేశీ ఫండ్స్‌ రూ. 423 కోట్ల స్టాక్స్‌ విక్రయించాయి.

ఎల్‌ఐసీ పెట్టుబడి: ఓపెన్‌ మార్కెట్‌ లావాదేవీల ద్వారా ఇటీవల కొద్ది రోజులుగా పీఎస్‌యూ దిగ్గజం ఎల్‌ఐసీ మొత్తం 33.86 లక్షలకుపైగా షేర్లను కొనుగోలు చేసినట్లు డాక్టర్‌ రెడ్డీస్‌ ల్యాబొరేటరీస్‌ పేర్కొంది. దీంతో కంపెనీలో ఎల్‌ఐసీ వాటా తాజాగా 7.7 శాతానికి బలపడినట్లు వెల్లడించింది.

నైకా బోనస్‌ షేర్లు

సౌందర్యం, ఆరోగ్యపరిరక్షణ, ఫ్యాషన్‌ ప్రొడక్టుల సంస్థ ఎఫ్‌ఎస్‌ఎన్‌ఈకామర్స్‌ వాటాదారులకు బోనస్‌ షేర్లను జారీ చేయనున్నట్లు ప్రకటించింది. సోమవారం సమావేశమైన బోర్డు 5:1 ప్రాతిపదికన బోనస్‌ షేర్ల జారీకి గ్రీన్‌సిగ్నల్‌ ఇచ్చినట్లు వెల్లడించింది. వాటాదారుల వద్దగల ప్రతీ 1 షేరుకీ 5 షేర్లను ఉచితంగా కేటాయించనుంది. ఇందుకు రికార్డ్‌ డేట్‌ నవంబర్‌ 3గా వెల్లడించింది. ఈ నేపథ్యంలో నైకా షేరు తొలుత ఎన్‌ఎస్‌ఈలో 11 శాతం పైగా(రూ. 142) దూసుకెళ్లి రూ. 1,414ను తాకింది. చివరికి 2.6 శాతం లాభపడి రూ. 1,305 వద్ద ముగిసింది.

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ ఇంజనీరింగ్‌ సర్వీసెస్‌లో.. 23 అసిస్టెంట్‌ ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్‌ పోస్టులు

ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రంలోని ఆంధ్రప్రదేశ్‌ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌(ఏపీపీఎస్సీ).. ఇంజనీరింగ్‌ సర్వీసెస్‌లో అసిస్టెంట్‌ ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్‌ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 23

» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్‌ ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్‌–సివిల్‌(ఏపీ రూరల్‌ వాటర్‌ సప్లై అండ్‌ శానిటేషన్‌ ఇంజనీరింగ్‌ సర్వీస్‌)–13, అసిస్టెంట్‌ ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్‌–సివిల్‌(ఏపీ రోడ్స్‌–బిల్డింగ్స్‌ ఇంజనీరింగ్‌ సర్వీస్‌)–03, అసిస్టెంట్‌ ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్‌–సివిల్‌(ఏపీ వాటర్‌ రిసోర్సెస్‌ సర్వీస్‌)–04, అసిస్టెంట్‌ ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్‌–మెకానికల్‌(ఏపీ వాటర్‌ రిసోర్సెస్‌ సర్వీస్‌)–01,అసిస్టెంట్‌ ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్‌ –సివిల్‌ (ఏపీ పంచాయతీరాజ్‌–రూరల్‌ డెవలప్‌మెంట్‌ ఇంజనీరింగ్‌ సర్వీస్‌)–02.

» **అర్హత:** బీఈ/బీటెక్‌(సివిల్‌/మెకానికల్‌ ఇంజనీరింగ్‌) ఉత్తీర్ణులవ్వాలి. » **వయసు:** 01.07.2022 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.

» **వేతనం:** నెలకు రూ.57,100 నుంచి రూ.1,47,760 చెల్లిస్తారు.

» **ఎంపిక విధానం:** రాతపరీక్ష(పేపర్‌–1, పేపర్‌–2, పేపర్‌–3), ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా.

» **ఫీజు చెల్లింపు చివరితేది:** 14.11.2022

» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:** 15.11.2022

» **వెబ్‌సైట్‌:** https://psc.ap.gov.in

1540 ఏఈఈ ఉద్యోగాల భర్తీకి టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్‌

ఇంజనీరింగ్‌ పట్టభద్రుల కోసం టీఎస్‌పీఎస్సీ శుభవార్త. 1540 అసిస్టెంట్‌ ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్‌ (ఏఈఈ) ఉద్యోగాల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. వీటిల్లో ఎక్కువగా సివిల్‌ ఇంజనీర్‌ పోస్టులున్నాయి. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 14(అక్టోబర్‌)వ తేదీలోగా ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హతలు

» సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, అగ్రికల్చర్‌ విభాగాల్లో బీఈ/బీటెక్‌ లేదా తత్సమాన ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు.

» **వయసు:** 18–44 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్‌ వర్గాలకు చెందిన అభ్యర్థులకు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

పరీక్ష విధానం

ఈ పరీక్షను పేపర్‌–1, 2లుగా నిర్వహిస్తారు.

» **పేపర్‌–1 జనరల్‌ స్టడీస్‌ అండ్‌ జనరల్‌ ఎబిలిటీస్‌:** ఇది 150 మార్కులకు ఉంటుంది. పరీక్ష సమయం 150 నిమిషాలు. ఇందులో జనరల్‌ స్టడీస్, జనరల్‌ ఎబిలిటీస్‌కు సంబంధించి మొత్తం 15 అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్న పత్రం తెలుగు, ఇంగ్లిష్‌ మాధ్యమంలో ఉంటుంది.

» **పేపర్‌–2(సంబంధిత సబ్జెక్ట్‌):** ఈ పరీక్ష 150 ప్రశ్నలు–300 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష సమయం 150 నిమిషాలు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్‌లో మాత్రమే ఉంటుంది.

ప్రిపరేషన్‌.. ఇలా

పేపర్‌–1: ఇందులో తెలంగాణ భౌగోళిక అంశాలు, చరిత్ర–సంస్కృతి, కళలు, సాహిత్యం, వాస్తు శైలి, తెలంగాణలోని సమాజం, సామాజిక అంశాలు, తెలంగాణ ఉద్యమానికి దారి తీసిన పరిస్థితులు తదితర అంశాలపై ప్రశ్నలు ఇస్తారు.

»జాతీయ, అంతర్జాతీయ, వర్తమాన అంశాలపై ఎక్కువగా దృష్టి పెట్టాలి.ఇందుకోసం దినపత్రికలను చదవాలి. ముఖ్యమైన అంశాలను షార్ట్‌ నోట్స్‌ రూపంలో రాసుకోవాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, అవార్డులు, పాలసీలు, జాతీయంగా, స్థానికంగా జరిగిన ముఖ్యమైన సదస్సులు, భారత్‌ విదేశాలతో చేసుకున్న ఒప్పందాలు, అంతర్జాతీయ సంబంధాలు, క్రీడలు తదితర అంశాలపై పరిజ్ఞానం పెంచుకోవాలి.

» లాజికల్‌ రీజనింగ్‌; అనలిటికల్‌ ఎబిలిటీ అండ్‌ డేటా ఇంటర్‌ప్రిటేషన్‌పై ప్రశ్నలు ప్రాక్టీస్‌ చేయాలి. » ఇంగ్లిష్‌కు సంబంధించి పదోతరగతి స్థాయి బేసిక్‌ ఇంగ్లిష్‌ పై పట్టు సాధించాలి. » ప్రశ్నల కాఠిన్యత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. కాబట్టి సబ్జెక్ట్‌పై లోతైన అవగాహన పెంచుకుంటే సమాధానాలు గుర్తించే అవకాశం ఉంటుంది.

పేపర్‌-2 సంబంధిత సబ్జెక్ట్‌

» డిగ్రీ స్థాయిలో సంబంధిత(సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్‌ అండ్‌ ఎలక్ట్రానిక్, అగ్రికల్చరల్‌ ఇంజనీరింగ్‌) విభాగాల నుంచి ప్రశ్నలను అడుగుతారు. » ఇంజనీరింగ్‌ విభాగానికి సంబంధించిన ప్రశ్నల సరళి తెలుసుకోవడానికి గత ప్రశ్నపత్రాలను పరిశీలించాలి. ఫలితంగా ఏయే అంశాల నుంచి ఎలాంటి ప్రశ్నలు అడిగే అవకాశముందో తెలుస్తుంది.

» సిలబస్‌కు అనుగుణంగా ఏయే అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలి అనే దానిపై స్పష్టమైన అవగాహనతో ప్రిపరేషన్‌ సాగించాలి.

ముఖ్యమైన సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా.

» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరి తేదీ:**14.10.2022

» **వెబ్‌సైట్‌:** https://www.tspsc.gov.in

50 'డే'స్‌ సక్సెస్‌ ప్లాన్‌..

కామన్‌ అడ్మిషన్‌ టెస్ట్‌..సంక్షిప్తంగా క్యాట్‌!! దేశంలో మేనేజ్‌మెంట్‌ విద్యలో.. ప్రతిష్టాత్మక బీస్కూల్స్‌ ఇండియన్‌ ఇన్‌స్టిట్యూట్స్‌ ఆఫ్‌ మేనేజ్‌మెంట్‌ (ఐఐఎంలు) క్యాంపస్‌లలో.. ఎంబీఏ/మేనేజ్‌మెంట్‌ పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో.. ప్రవేశానికి నిర్వహించే పరీక్ష! ఈ టెస్ట్‌కు ఏటా రెండు లక్షల మంది వరకు పోటీ పడుతుంటారు! ఈ ఏడాది క్యాట్‌-2022 పరీక్ష నవంబర్‌ 27న జరగనుంది. అంటే.. అభ్యర్థులకు ఇప్పటినుంచి నికరంగా అందుబాటులో ఉన్న సమయం 50 రోజులు!! ఈ నేపథ్యంలో.. క్యాట్‌లో మెరుగైన స్కోర్‌ సాధించడానికి ప్రిపరేషన్‌ ప్లాన్‌..

» నవంబర్‌ 27న క్యాట్‌ ఎంట్రన్స్‌
» ఐఐఎంలలో మేనేజ్‌మెంట్‌ పీజీ, పీహెచ్‌డీలకు మార్గం
» ఎంట్రన్స్‌లో మెరుగైన స్కోర్‌ ప్రధానం
» ప్రణాళికాబద్ధ ప్రిపరేషన్‌ కీలకమంటున్న నిపుణులు

క్యాట్‌కు ఏటేటా పోటీ పెరుగుతోంది. ఐఐఎంల్లో చేరాలనే లక్ష్యంతో ప్రిపరేషన్‌ సాగిస్తున్న సీరియస్‌ అభ్యర్థుల సంఖ్య పెరగడమే ఇందుకు కారణం. మరోవైపు క్యాట్‌లో ప్రశ్నల శైలి, క్లిష్టత స్థాయి కూడా పెరుగుతోంది. కాబట్టి అభ్యర్థులు ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఈ 50 రోజుల సమయాన్ని ఎంతో కీలకంగా భావించాలి అంటున్నారు నిపుణులు.

మూడు విభాగాలు.. రెండు గంటలు

ఈ ఏడాది క్యాట్‌ మూడు సెక్షన్లుగా రెండు గంటల వ్యవధిలో ఉంటుందని.. నిర్వాహక ఇన్‌స్టిట్యూట్‌ ఐఐఎం–బెంగళూరు పేర్కొంది. అభ్యర్థులకు వెర్బల్‌ ఎబిలిటీ అండ్‌ రీడింగ్‌ కాంప్రహెన్షన్‌(24 ప్రశ్నలు); డేటా ఇంటర్‌ప్రిటేషన్‌ అండ్‌ లాజికల్‌ రీజనింగ్‌(20 ప్రశ్నలు); క్వాంటిటేటివ్‌ ఎబిలిటీ (22 ప్రశ్నలు) విభాగాల్లో మొత్తం 66 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో విభాగానికి 40 నిమిషాల చొప్పున సమయం అందుబాటులో ఉంటుంది. ప్రతి ప్రశ్నకు మూడు మార్కులు కేటాయిస్తారు. నెగెటివ్‌ మార్కుల విధానం కూడా ఉంటుంది.

పెరుగుతున్న క్లిష్టత

క్యాట్‌లో ప్రశ్నల క్లిష్టత స్థాయి ప్రతి ఏటా పెరుగుతోందని నిపుణులు పేర్కొంటున్నారు. గతేడాది క్యాట్‌లో వీఏఆర్‌సీ, డీఐఎల్‌ఆర్‌ నుంచి అడిగిన ప్రశ్నలు కఠినంగా ఉన్నాయని పరీక్షకు హాజరైన అభ్యర్థులు చెప్పారు. ముఖ్యంగా డీఐఎల్‌ఆర్‌లో అడిగిన ప్రశ్నలకు సమాధానాలు సాధించేందుకు ఎక్కువ సమయం వెచ్చించాల్సి వచ్చింది. దీంతో ఎక్కువ మంది అభ్యర్థులకు సమయాభావ సమస్య ఎదురైంది. ఒకే రోజు మూడు స్లాట్లలో జరిగే పరీక్షలో ఒక స్లాట్‌లో ప్రశ్నలు కొంత సులభంగా, మరో స్లాట్‌లో కొంత క్లిష్టంగా ఉన్నాయనే అభిప్రాయం కూడా వ్యక్తమైంది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే.. ప్రస్తుత అభ్యర్థులు ప్రశ్నల క్లిష్టత స్థాయి ఎలా ఉన్నా.. సమాధానాలు గుర్తించేలా సన్నద్ధత పొందాలని నిపుణులు సూచిస్తున్నారు.

సమయ పాలన, సబ్జెక్ట్‌ విభజన

- క్యాట్‌ అభ్యర్థులు ముందుగా సమయ పాలనపై ప్రధానంగా దృష్టిపెట్టాలి. మొత్తం మూడు సెక్షన్లుగా నిర్వహించే ఈ పరీక్షలో రాణించాలంటే..ఇప్పటి నుంచి నిర్దిష్టమైన సమయ పాలన పాటించాలి. పరీక్షలో ప్రతి సెక్షన్‌ను 40 నిమిషాల వ్యవధిలో పూర్తి చేయాల్సి ఉంటుంది. దీనికి అనుగుణంగా అభ్యర్థులు తమ ప్రిపరేషన్‌ను కొనసాగించాలి. తమ వ్యక్తిగత సామర్థ్యాల ఆధారంగా టైం మేనేజ్‌మెంట్‌ పాటించాలి.
- ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమయంలో ప్రతి రోజు ప్రతి సెక్షన్‌కు మూడు గంటలు చొప్పున కేటాయించాలి. వాస్తవానికి అభ్యర్థులు ఇప్పటికే ప్రిపరేషన్‌ పూర్తి చేసుకుని రివిజన్‌పై దృష్టిపెడుతుంటారు. కాబట్టి ముందుగా సిలబస్‌లో పేర్కొన్న అంశాల్లో ఇప్పటికీ పూర్తి చేయని టాపిక్స్‌ ఉంటే.. వాటిని అక్టోబర్‌ చివరి నాటికి పూర్తి చేసుకునే విధంగా సమయం కేటాయించుకోవాలి.
- ప్రతి రోజూ ఒక్కో సెక్షన్‌కు మూడు గంటలు చొప్పున మొత్తం 9 గంటలు; వారానికి రెండు మాక్‌ టెస్టులు, మోడల్‌ టెస్టులకు హాజరయ్యే విధంగా వ్యవహరించాలి.
- నవంబర్‌ మొదటి వారం నుంచి పూర్తిగా రివిజన్‌కే కేటాయించాలి. అప్పటికీ సిలబస్‌లో పేర్కొన్న అంశాల ప్రిపరేషన్‌ను పూర్తి చేయకపోయినా.. వాటి గురించి ఎక్కువగా ఆలోచించకూడదు. పూర్తి చేసిన అంశాల్లోనే మరింత రాణించే విధంగా ప్రాక్టీస్‌ కొనసాగించాలి.
- ఇప్పటి నుంచి కనీసం 10 నుంచి 12 మాక్‌ టెస్ట్‌లకు హాజరై.. బలహీనంగా ఉన్న అంశాలపై కొంత ఎక్కువ దృష్టి పెట్టాలి.

సెక్షన్ల వారీగా.. ప్రిపరేషన్‌

వెర్బల్‌ ఎబిలిటీ అండ్‌ రీడింగ్‌ కాంప్రహెన్షన్‌

ప్యాసేజ్‌ ఆధారిత ప్రశ్నలు ఉండే విభాగం.. వెర్బల్‌ ఎబిలిటీ అండ్‌ రీడింగ్‌ కాంప్రహెన్షన్‌. ఇందులో మంచి స్కోర్‌ కోసం ప్రాక్టీస్‌ చాలా కీలకం. నిర్దేశిత ప్యాసేజ్‌ నుంచి ప్రశ్నలు అడుగుతారు. అధికశాతం ప్రశ్నలు ప్యాసేజ్‌ సారాంశం అర్థమైతేనే సమాధానం ఇవ్వగలిగేలా ఉంటాయి. కాబట్టి అభ్యర్థులు స్పీడ్‌ రీడింగ్‌తోపాటు ఏదైనా ఒక టాపిక్‌ను చదువుతున్నప్పుడే అందులోని కీలక అంశాలను గుర్తించే నైపుణ్యం సొంతం చేసుకోవాలి. పంక్చుయేషన్స్‌ నుంచి ప్యాసేజ్‌ మెయిన్‌ కాన్సెప్ట్‌ వరకూ.. అన్నింటిపైనా అవగాహన పెంచుకోవాలి. అర్థాలు, సమానార్థాలు, ఫ్రేజెస్, వర్డ్‌ యూసేజ్, సెంటెన్స్‌ ఫార్మేషన్‌ అంశాలపై ప్రధానంగా దృష్టిపెట్టాలి. వీటితోపాటు వొకాబ్యులరీపైనా పట్టు సాధించాలి. ఫలితంగా ఆయా ప్యాసేజ్‌లలో వినియోగించిన పదజాలాన్ని వేగంగా అర్థం చేసుకుని.. నిర్దేశిత సమయంలో సమాధానాలిచ్చే నైపుణ్యం లభిస్తుంది.



రీడింగ్‌ కాంప్రహెన్షన్‌

కొంత ఎక్కువ స్కోరు సాధించడానికి అవకాశం ఉన్న విభాగం.. రీడింగ్‌ కాంప్రహెన్షన్‌. ఇందులో రాణించాలంటే.. అభ్యర్థులు విశ్లేషణాత్మకంగా చదవడం అలవర్చుకోవాలి. చదివేటప్పుడే అందులోని ముఖ్య సమాచారం, ప్రశ్నార్హమైన అంశాలు, కీలక పదాలు గుర్తించే నేర్పు సొంతం చేసుకోవాలి. అందుకోసం ఇంగ్లిష్‌ దినపత్రికల్లోని ఎడిటోరియల్స్, ఇతర వ్యాసాలు చదవాలి. వీటిని చదివిన తర్వాత సొంతంగా, క్లుప్తంగా సారాంశాన్ని రాసుకోవాలి. వొకాబ్యులరీని పెంచుకోవడం వెర్బల్‌ ఎబిలిటీలో ఎంతో ఉపయుక్తం. ఇంగ్లిష్‌ గ్రామర్‌పైనా పట్టు సాధించాలి. ప్రిఫిక్స్, సఫిక్స్‌ విధానంలో వర్డ్‌ లెర్నింగ్‌.. వొకాబ్యులరీని పెంచుకునేందుకు దోహదపడుతుంది. ప్రతి రోజు కనీసం 20 నుంచి 30 కొత్త పదాలను నేర్చుకోవాలి. ఆయా పదాల వినియోగంపైనా అవగాహన పెంచుకోవాలి.

డేటా ఇంటర్‌ప్రిటేషన్, లాజికల్‌ రీజనింగ్‌

గ్రాఫ్‌లు, చార్ట్‌లు, డేటా సంబంధిత ప్రశ్నలు ఉండే.. డేటా ఇంటర్‌ప్రిటేషన్‌లో స్కోర్‌ కోసం ప్రత్యేక కసరత్తు చేయాలి. ఇందులో అధిక శాతం ప్రశ్నలు స్వీయ విశ్లేషణ, సూక్ష్మ పరిశీలన ఆధారంగా సమాధానం రాబట్టేవిగా ఉంటాయి. అంటే.. గ్రాఫ్‌లు, చార్ట్‌లలో ఇచ్చిన దత్తాంశాలపై నేరుగా ప్రశ్నలు అడగకుండా.. సంబంధిత కాన్సెప్ట్‌ను అర్థం చేసుకుని సమాధానం కనుక్కునే విధంగా ఈ ప్రశ్నలు ఉంటాయి. కాబట్టి ఇందులో రాణించేందుకు పర్సంటేజెస్, యావరేజెస్‌పై పట్టు సాధించాలి. ఇందుకోసం ఏదైనా ప్రామాణిక మెటీరియల్‌ లేదా ఆన్‌లైన్‌ టెస్ట్‌లోని ప్రశ్నలను బాగా ప్రాక్టీస్‌ చేయాలి. ఇక్కడ కేవలం ఒకే తరహా ప్రశ్నలు కాకుండా.. విభిన్న క్లిష్టతతో కూడిన సమస్యలను సాధించడానికి ప్రాధాన్యం ఇవ్వాలి.

క్వాంటిటేటివ్‌ ఆప్టిట్యూడ్‌

మ్యాథమెటిక్స్‌ సబ్జెక్ట్‌ అంశాలతో ఉండే ఈ సెక్షన్‌లో రాణించడానికి వేగం చాలా ముఖ్యం. ముఖ్యంగా కాలిక్యులేషన్స్‌ వేగంగా చేయగలిగే నేర్పు సొంతం చేసుకోవాలి. నాన్‌–మ్యాథ్స్‌ అభ్యర్థులు ప్రాబబిలిటీ,పెర్ముటేషన్స్‌/కాంబినేషన్స్, నెంబర్స్, అల్‌జీబ్రా, జామెట్రీ విభాగాలపై దృష్టి పెట్టాలి.

వీటికి సంబంధించిన బేసిక్‌ కాన్సెప్ట్స్‌పై పట్టు సాధించాలి. వాస్తవానికి క్యాట్‌లో ఎదురయ్యే ప్రశ్నల్లో పది శాతం మేర బేసిక్స్‌ ఆధారంగా సొంత ఆలోచనతో సాధించాల్సినవిగా ఉంటాయి. వీటికి ఎక్కువ సమయం పడుతుంది. కాబట్టి పరీక్షలో నేరుగా ఫార్ములా బేస్డ్‌గా ఉండే ప్రశ్నల సాధనపై దృష్టిపెట్టాలి. ప్రస్తుత సమయంలో సబ్జెక్ట్‌ ప్రిపరేషన్‌తోపాటు ఆయా సెక్షన్లలో గత ప్రశ్నల ప్రాక్టీస్‌ కూడా కీలకమని గుర్తించాలి.

ముఖ్యాంశాలు

- క్యాట్‌ స్కోర్‌ ఆధారంగా 20 ఐఐఎంలలో ఎంబీఏ, ఇతర మేనేజ్‌మెంట్‌ ప్రోగ్రామ్‌లలో ప్రవేశం.
- ఐఐఎంలతోపాటు మరో వేయికి పైగా బి–స్కూల్స్‌లో క్యాట్‌ స్కోర్‌తో మేనేజ్‌మెంట్‌ పీజీలో అడుగుపెట్టొచ్చు.
- క్యాట్‌ ప్రిపరేషన్‌కు కచ్చితమైన టైమ్‌ ప్లాన్‌ రూపొందించుకోవాలి.
- అక్టోబర్‌ చివరి నాటికి ప్రిపరేషన్‌ పూర్తి చేసుకోవాలి.
- అక్టోబర్‌ చివరి నుంచి పరీక్ష తేదీ వరకు పూర్తిగా రివిజన్‌కు కేటాయించాలి.
- కనీసం వారానికి ఒక మోడల్‌ టెస్ట్‌కు హాజరు కావాలి.
- కనీసం ఎనిమిది గ్రాండ్‌ టెస్టులు రాయాలి.

క్యాట్‌-2022 ముఖ్య సమాచారం

- నవంబర్‌ 27న మూడు స్లాట్లలో క్యాట్‌ పరీక్ష.
- **హాల్‌ టికెట్‌ డౌన్‌లోడ్‌ సదుపాయం:** అక్టోబర్‌ 27 నుంచి.
- **ఫలితాల వెల్లడి:** డిసెంబర్‌ చివరి వారం/2023 జనవరి మొదటి వారం.
- **వివరాలకు వెబ్‌సైట్‌:** https://iimcat.ac.in

గడప గడపకు వెళితేనే

ప్రజా స్పందన తెలుస్తుంది

అసెంబ్లీలో గొడవలు చేయడం కరెక్ట్ కాదు • రాజకీయ నాయకులు వ్యక్తిగత దూషణలు చేయరాదు

- ఓర్పు, నీతి ఉంటేనే రాజకీయాల్లో రాణిస్తారు
- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- సీఎం వై.ఎస్.జగన్ ఏపీని రోల్‌మోడల్‌గా మారుస్తున్నారు
- ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడికి చిత్రపటం అందజేస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, చిత్రంలో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా తదితరులు

నెల్లూరు (సెంట్రల్): గడప గడపకు వెళ్తేనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్న తీరు, ప్రజా స్పందన తెలుస్తుందని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 'గడప గడపకు మన ప్రభుత్వం' పెట్టారని అన్నారు. గతంలో తాను కూడా పల్లెపల్లెకు బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వెంకయ్యనాయుడికి ఆత్మీయ అభినందనోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా లోక్ సభ సభాపతి ఓంబిర్లాతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు విచ్చేశారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ ప్రతి రాజకీయ నాయకుడు అసెంబ్లీలో గొడవ చేయకుండా హుందాగా ఉండాలన్నారు. ప్రభుత్వ పనులను, అవినీతి, అక్రమాలను ప్రశ్నించవచ్చని, వ్యక్తిగత దూషణలు, విమర్శలు సరికాదని చెప్పారు. రాజకీయాల్లో ఓర్పు, నీతి, రీతి ఉంటేనే రాణిస్తారని వివరించారు. దేశానికి వెంకయ్యనాయుడు చేసిన సేవలను లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా కొనియాడారు. రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ వెంకయ్యనాయుడుకు సన్మానం చేస్తానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చెప్పినప్పుడు సీఎం చాలా సంతోషించారని చెప్పారు. వెంకయ్యనాయుడుపై తనకున్న గౌరవాన్ని తెలియజేసేలా ఘనంగా నిర్వహించాలని చెప్పారన్నారు. ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్‌ను పరిశ్రమల రంగంలో దేశానికే మోడల్‌గా మారుస్తున్నారన్నారు. సీఎం కృషి వల్ల మూడేళ్లుగా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఏపీ మొదటి స్థానంలో ఉందన్నారు. సంక్షేమం, అభివృద్ధితో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని చెప్పారు. నవరత్నాలు, సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ వంటి ముఖ్యమంత్రి పథకాలు దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందుతున్నాయని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో కూడా వీటి అమలుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మాగుంట శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, వెలగపల్లి వరప్రసాద్, ఎమ్మెల్సీలు బల్లి కల్యాణ్ చక్రవర్తి, వాకాటి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక స్వయం సమృద్ధి దిశగా ఆర్టీసీ

5 నుంచి 15 ఏళ్ల వరకు లీజుకు ఆర్టీసీ స్థలాలు

- బీవోటీ విధానంలో ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం
- మున్సిపల్, మండల కేంద్రాల్లో 48 స్థలాలకు టెండర్లు
- వచ్చే ఏడాది ప్రారంభం నాటికి పూర్తి కానున్న టెండర్ల ప్రక్రియ

సాక్షి, అమరావతి: వనరుల సద్వినియోగం ద్వారా ఆర్థిక స్వయం సమృద్ధి సాధన దిశగా ఆర్టీసీ కార్యాచరణ చేపట్టింది. మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో విలువైన స్థలాల్లో 'నిర్మించు-నిర్వహించు-బదలాయించు(బీవోటీ) విధానంలో ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్‌లు నిర్మించాలని ఇప్పటికే నిర్ణయించింది. తాజాగా మున్సిపాల్టీలు, మండల కేంద్రాల్లోని ఆర్టీసీ స్థలాలను కూడా లీజుకు ఇవ్వాలని, ఆ స్థలాలను వాణిజ్య ప్రయోజనాలకు వినియోగించాలని ప్రణాళిక రూపొందించింది. మొదటి దశలో 48 కేంద్రాల్లో స్థలాలను లీజుకు ఇవ్వనుంది. రాష్ట్రంలో నాలుగు జోన్ల పరిధిలోని మొత్తం 1,98,393 చ.గజాల విస్తీర్ణంలోని స్థలాలను ఐదేళ్ల నుంచి 15 ఏళ్ల కాలపరిమితికి ఇవ్వాలని నిర్ణయించింది. మొదటి జోన్ పరిధిలో 14 కేంద్రాల్లో 38,188 చ.గజాలు, రెండో జోన్ పరిధిలో 10 కేంద్రాల్లో 21,125 చ.గజాలు, మూడో జోన్ పరిధిలో 11 కేంద్రాల్లో 33,326 చ.గజాలు, నాలుగో జోన్ పరిధిలో 13 కేంద్రాల్లో 1,05,754 చ.గజాల స్థలాలు ఉన్నాయి. వాటిలో కనిష్టంగా 250 చ.గజాల నుంచి గరిష్టంగా 15,500 చ.గజాల స్థలాల వరకు ఉండటం విశేషం.

ఆ స్థలాల్లో జి+1 విధానంలో వాణిజ్య సముదాయాల నిర్మాణానికి అనుమతిస్తారు. లీజు కాలపరిమితి ముగిసిన తర్వాత ఆ సముదాయాలు ఆర్టీసీ సొంతమవుతాయి. ఈ స్థలాల లీజుకు సంబంధించి ఆయా జోన్ల వారీగా వచ్చే ఏడాది ప్రారంభం నాటికి టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని భావిస్తోంది.

వలంటీర్ల ద్వారా ఆయుష్మాన్ భారత్ కార్డులు

- ఆరోగ్య శ్రీ తరహాలో కేంద్రం ఆయుష్మాన్ భారత్ పథకం
- రాష్ట్రంలో అర్హులు 59 లక్షల మంది
- ఐదో తేదీలోగా కార్డుల పంపిణీ

సాక్షి, అమరావతి : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య శ్రీ తరహాలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఆయుష్మాన్ భారత్ పథకం కార్డులను ప్రభుత్వం వలంటీర్ల ద్వారా అర్హులకు పంపిణీ చేయనుంది. ఆయుష్మాన్ భారత్ పథకానికి కేంద్రం పేర్కొన్న నిబంధనల ప్రకారం కేవలం 59 లక్షల మంది అర్హులు ఉన్నారు. వారి వివరాలను వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు వారం క్రితం గ్రామ, వార్డు సచివాలయ శాఖకు అందజేశారు. వారందరికీ ఈ నెల 5వ తేదీలోగా వలంటీర్ల ద్వారా ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీకి గ్రామ, వార్డు సచివాలయ శాఖ చర్యలు చేపట్టింది. అర్హుల జాబితాను ఇప్పటికే వలంటీర్ల మొబైల్ యాప్‌కు పంపారు. ఆయుష్మాన్ భారత్ యాప్‌ను వలంటీర్లు డౌన్‌లోడ్ చేసుకొని వారి పరిధిలో ఉండే అర్హుల వివరాలను అందులో నమోదు చేస్తారు. ప్రతి ఒక్కరికి విడివిడిగా ఆయుష్మాన్ భారత్ కార్డు పంపిణీ చేయాలని వలంటీర్లను గ్రామ, వార్డు సచివాలయ శాఖ కమిషనర్ ఆదేశించారు. వలంటీర్ ఆ కుటుంబాన్ని సందర్శించినప్పుడు ఎంతమంది అర్హులకు కార్డులు ఉంటే అవన్నీ పంపిణీ చేసేయాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న వారందరికీ ఆయుష్మాన్ భారత్ కార్డు పొందేందుకు అర్హత ఉండదని వలంటీర్లకు తెలిపారు. కార్డుల పంపిణీ బాధ్యతలను గ్రామీణ ప్రాంతంలో ఎంపీడీవోలు, మున్సిపల్ ప్రాంతంలో మున్సిపల్ కమిషనర్లు తీసుకోవాలని సూచించారు.

12వ తేదీ లోపు రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాలి

సాక్షి, అమరావతి: పంటల బీమా, ఇతర పథకాలకు అర్హత కోసం రైతులు తప్పనిసరిగా ఈ నెల 12వ తేదీలోపు ఈ-కేవైసీ చేయించుకోవాలని వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ హరికిరణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక తనిఖీల కోసం ఈ-కేవైసీ చేయించుకున్న రైతుల జాబితాలను ఈ నెల 16వ తేదీ నుంచి రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు ఖరీఫ్ సీజన్‌లో 1.08 కోట్ల ఎకరాల విస్తీర్ణంలో పంటలు సాగు చేసినట్లు తెలిపారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, వీఆర్‌వో కలిపి 90 శాతం ఈ-క్రాప్‌ను ధ్రువీకరించినట్లు పేర్కొన్నారు. రైతులందరికీ తమ మొబైల్ నంబర్‌కు వారు సాగు చేసిన పంట, విస్తీర్ణం, ఇతర వివరాలను మెసేజ్ రూపంలో పంపుతున్నామని వివరించారు. ఈ వివరాలను తెలియజేస్తూ రైతు భరోసా కేంద్రాల్లో ఉండే సిబ్బంది సంతకంతో కూడిన రశీదు కూడా ఇస్తారని తెలిపారు.

సురేష్‌కుమార్‌కు 'సమగ్ర శిక్ష' బాధ్యతలు

సాక్షి, అమరావతి: సమగ్ర శిక్ష అభియాన్ రాష్ట్ర పీడీగా పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఎస్ఎస్ఏ పీడీగా ఉన్న కె.వెట్రిసెల్విని ఆంగ్లమాధ్యమం ప్రాజెక్టు స్పెషలాఫీసర్‌గా, విద్యాశాఖ జాయింట్ సెక్రటరీగా నియమించింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.